

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

రామాలయం విరాళాల చోరీ..
అన్ని రికార్డులు
బహిర్గతం చేయాలి

పెద్దనోట్ల రద్దు ప్రక్రియ
అవినీతి మయం

07

సంపుటి 29, సంచిక: 142 | గురువారం | 12-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00

రబీ సీజన్‌లో ఎరువులకు
రూ.62,370 కోట్ల సబ్సిడీ

- యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు
- స్టాండ్-అప్ ఇండియా పథకం, ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఐదేళ్లు కొనసాగింపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం



న్యూఢిల్లీ : రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ బుధ వారం ఆమోదం తెలిపింది. అలాగే నార్త్, సౌత్ బ్లాక్‌లను మ్యూజియంగా మార్చేందుకు అనుగుణంగా యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేం దుకు నిర్ణయించింది. నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోటియా సెక్టార్ 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. స్టాండ్ అప్ ఇండియా పథకానికి, అలాగే ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను 5 సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం తరువాయి 8లో

వచ్చే విద్యా సంవత్సరం నుంచి
10+2 అమలు

- డ్రాపవుట్‌లు తగ్గించేందుకే ఈ విధానం
- రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు
- విద్యావ్యవస్థలో మార్పులతో జూనియర్ కాలేజీల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, పదవీవిరమణ ప్రయోజనాలకు ఇబ్బందులు కలుగనివ్వం
- సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగొద్దు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ



నర్సరీ నుంచి 4వ తరగతి వరకు – ప్రాథమిక విద్య
5 నుంచి 8వ తరగతి వరకు – సెకండరీ విద్య
9 నుంచి 12వ తరగతి వరకు – సీనియర్ సెకండరీ విద్య

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణం గా విద్యావిధానంలో రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల సంస్కరణలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నర్సరీ నుంచి యూనివర్సిటీ వరకు నాణ్య మైన విద్య అందించడంతో పాటు, విద్యా ర్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందుకు అనుగు ణంగా రానున్న విద్యా సంవత్సరం నుంచి 12వ తరగతి వరకు నూతన విద్యావిధా నాన్ని అమలు చేయాలని అధికారులను ఆదే శించారు.బుధవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5 నుంచి 8వ తరగతి వరకు సెకండరీ, 9 నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకం డరీ విధానాన్ని అమలు చేయాలని సూచిం చారు. పదో తరగతి తర్వాత చాల మంది విద్యార్థులు చదువు మానేస్తుండగా, వారిలో బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పిల్లలే అధికంగా ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 12వ తరగతి వరకు విద్య కొనసాగించే కేంద్రీయ, నవోదయ, కస్తూర్బా విద్యాలయాల్లో డ్రాపౌట్లు తక్కువగా ఉన్నా యని గుర్తుచేశారు. ఈ మార్పుల వల్ల జూని యర్ కళాశాలల లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, పదవీ విరమణ ప్రయోజ నాలకు ఎలాంటి ఇబ్బంది కలగనివ్వబోమని హామీ ఇచ్చారు.రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని సిఎం స్పష్టం చేశారు. అన్ని వసతులతో శాశ్వత భవనాల నిర్మాణానికి కార్యాచరణ ప్రారంభించాలని, అవసరమైన నిధులు విడుదల చేస్తామని తెలి పారు. పాఠశాలలు, హాస్టళ్లలో మరుగు దొడ్లు, తాగునీటి తరువాయి 8లో

మైనారిటీల అభివృద్ధితోనే దేశ ప్రగతి

- విద్య, నైపుణ్యాలకు పెద్దపీట
- నైట్ ఎకానమీతో యువతకు ఉపాధి
- ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీని పునరుద్ధరిస్తాం : సిఎం రేవంత్‌రెడ్డి 03



విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య

- ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- విద్య ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యం
- విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రూ.10 కోట్లతో కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/హనుమకొండ

విద్య ద్వారానే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమని, తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి ప్రపంచ స్థాయిలో పోటీపడేలా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. బుధవారం కాజీపేటలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠ శాల ప్రాంగణంలో రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనా నికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసేందుకు సోషియో ఎకనామిక్ అండ్ పొలిటికల్ ఎంప్లా య్‌మెంట్ సర్వే నిర్వహించిందని తెలిపారు. ఈ సర్వే విశ్లేషణలో సమాజంలోని కుటుం బాలు, కులాలు, వర్గాలు అభివృద్ధి చెందడా నికి విద్యే ప్రధానమైన సాధనమని స్పష్టమైంద న్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగు ణంగా విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుం దని పేర్కొన్నారు. తెలంగాణను దేశంలోనే కాకుండా ప్రపంచంలోని తరువాయి 8లో



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో
హైదరాబాద్‌కు జాతీయ అవార్డు

రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) జాతీయ అవార్డు లభించింది. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో బుధవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిహెచ్‌ఎంసి కమిష నర్ ఆర్‌వి కర్ణన్, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అవార్డును స్వీకరించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ నిర్వహిం చిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభిం చింది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, తరువాయి 12లో

రైతులకు సందేహాలు, అభ్యంతరాలుండొద్దు

- పారదర్శకంగా భూముల రీసర్వే పూర్తిచేయాలి
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలి
- నోటీసుల తర్వాత ప్రతి 15 రోజులకు గ్రామాల్లో చాటింపు వేయాలి
- మంత్రి పొంగులేటి ఆదేశం
- 22ఎ భూముల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



03

సిఆర్‌పిఎఫ్ జవాన్లపై
ఉగ్రదాడి

బైక్‌పై వచ్చి కాల్పులు జరిపిన ఇద్దరు ఆగంతకులు
ముగ్గురు జవాన్లకు గాయాలు : ఒకరి పరిస్థితి విషమం



శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లో మరోసారి ఉగ్రదాడి కలకలం రేపింది. కుల్గాం జిల్లాలో బుధవారం మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) చెక్ పోస్ట్‌పై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలి పారు. కాల్పులు జరిపిన అనంతరం దుండగులు పరార్ కావడంతో వారి కోసం భద్రతా దళాలు విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ దాడి మధ్యాహ్నం 2.15 గంటల ప్రాంతంలో, శ్రీనగ ర్‌కు సుమారు 75 కిలోమీటర్ల దూరంలో, కట్టుది ట్టమైన భద్రత గల జమ్ము–శ్రీనగర్ జాతీయ రహ దారికి కేవలం ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మీర్ బజార్ సమీపంలో జరిగింది. ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, భద్రతను కట్టుదిట్టం చేశారు. గాయ పడిన జవాన్లను దాడి జరిగిన ప్రదేశం నుండి సుమారు 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనం తనాగ్ జిల్లాలోని ఆసుపత్రికి తరలించారు. ఒక రికి కడుపులో తీవ్ర గాయాలవ్వగా, మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒక రికి చేయిపై తూటా గాయం కాగా, మరొకరికి కాలికి గాయమైంది. గాయపడిన జవాన్లను స్ట్రెచ ర్లపై ఆసుపత్రికి తరలిస్తుండగా, వైద్య సిబ్బంది వారికి సహాయం చేయడానికి పరుగెత్తుతున్న దృశ్యాలు ఘటనా స్థలం నుండి కనిపించాయి. దర్యాప్తు అధికారులు ఆ ప్రాంతంలోని దుకాణా లతో సహా సిసిటివి ఫుటేజీని నిశితంగా పరిశీ లిస్తూ, దుండగులు ఎక్కడి నుంచి వచ్చారో తరువాయి 12లో



విద్వేషానికి చోటులేదు

విద్వేష పూరిత రాజకీయాలు, ఆర్థిక, సామాజిక విధానాలకు ప్రత్యామ్నాయ అన్వేషణే లక్ష్యం

ఆ దిశగా హైదరాబాద్ వేదికగా నేటి నుంచి భారత్ సమ్మిట్

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్

ప్రపంచ వ్యాప్తంగా ఈనాడు మిత వాద శక్తులు అధికారంలో ఉంటూఅనుసరిస్తున్న విద్వేష పూరిత హింసాత్మక ఆర్థిక ,రాజకీయ ,సామా జిక విధానాలకు ప్రత్యామ్నయంగా ఆహింస, మిశ్రమ ఆర్థిక విధానాలు అలీనోద్యమం విధా నాలపై చర్చించి వాటి అమలుకు కృషి చేయా లన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన 2వభారత్ సమ్మిట్ 2026 నేటి నుంచి 14 తేదీ వరకు మూడు రోజుల పాటు నగరంలో జరగనుంది. తెలంగాణ ప్రభుత్వం ఆదిథ్యం ఇస్తున్న ఈ సమ్మిట్‌లో భారత్‌తో సహా సుమారు 70 దేశాల నుంచి దాదాపుగా 1000 మంది విధాన రూప కర్తలు, ప్రభుత్వ అధికారులు, ప్రతిపక్షాల నాయకులు , రాజకీయ పార్టీల ప్రతినిధులు ,ప్రత్యామ్నయ విధానాలపై ఆలోచించే ప్రగతి శీల శక్తులు, పాల్గొనున్నారు. ఈ సమ్మిట్‌కు సంబంధించి హైదరాబాద్‌లోని హైటెక్స్‌లోని ఓహోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఎఐసిసి విదేశీ వ్యవహారాల విభాగం ఛైర్ పర్సన్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పరిశ్ర మల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎఐసిసి పరి పాలన విభాగం ఇంఛార్జీ గురుదీప్ సింగ్ సప్పల్, పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ వివరాలను వెల్లడిం చారు. ఈ సందర్భంగా సల్మాన్ ఖుర్షీద్ మాట్లా డుతూ భారత దేశం ప్రపంచానికి ఆహింస, అలీనోద్యమం, మిశ్రమ ఆర్థిక విధానాలతో పాటు ప్రగతిశీల భావాలను అందించిందని , నేడు ఈ విధానాలు ప్రపంచానికి చాల అవసర మని చాటు చెప్పాల్సిన అవశ్యకత ఉందన్నారు. కాంగ్రెస్ కూడ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఈ విధానాలనే అనుసరించిందని ఆయన గుర్తు చేశారు. ప్రపంచానికి లౌకిక ప్రజాస్వామ్యం నేడు ఎంత అవసరమో భారత్ దేశానికి అంతకంటే ఎక్కువ అవసరముంద న్నారు. నాటి విధానాలకు విఘాతం కలిగిస్తూ మితవాదశక్తులు తరువాయి 8లో

సార్వత్రిక సమ్మె స్తంభించిన స్పెయిన్



జీతాలు, గృహాలు, ధరలపై దృష్టి : వామపక్షాల డిమాండ్
వీధుల్లో లక్షలమంది కార్మికుల ప్రదర్శన
హౌసింగ్ సంక్షోభానికి పరిష్కారం చెప్పాలని నినాదాలు 08

సాగునీరు లేకుండా వ్యవసాయాభివృద్ధి ఎలా?



- కాలువలు, ప్రాజెక్టులున్నా చివరి ఆయకట్టు వరకు రైతుకు నీరందకపోవడం ఆందోళనకరం
- రైతుబంధును రైతుభరోసాగా ప్రకటిస్తే సమస్యలు పరిష్కారం కావు.. సకాలంలో పెట్టుబడిసాయం అందించాలి
- నిర్మల్ రైతు గర్జన సభలో కెటిఆర్ 03

హైడ్రా కమిషనర్‌ను కోర్టులో హాజరుపర్చండి

- డిజిపికి హైకోర్టు ఆదేశం
- కోర్టు ధిక్కరణ కేసులో రంగనాథ్ వ్యక్తిగత హాజరు మినహాయింపు అభ్యర్థన తిరస్కరణ



ప్రజాపక్షం/హైదరాబాద్

కోర్టు ధిక్కరణ కేసులో హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ వ్యక్తి గత హాజరు మినహాయింపు అభ్యర్థనను హైకోర్టు తిరస్కరిం చింది. ఈ నెల 17న ఆయనను కోర్టుకు హాజరుపరిచేలా చర్య లు తీసుకోవాలని డిజిపిని ఆదేశించింది. ఇదే రోజు శంషాబాద్ తహసీల్దార్‌ను హాజరుపరిచేలా చూడాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్‌కు సూచించింది. శంషాబాద్ గ్రామంలోని సర్వే నంబరు 626/2ఏఏలోని ప్రైవేటు భూమిని కోర్టు ఉత్తర్వు లకు విరుద్ధంగా స్వాధీనం చేసుకున్నారంటూ మహమ్మద్ తాజ మలుద్దీన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. బోర్ల తవ్వ కాల నియంత్రణ విధుల్లో ఉన్నందున హాజరు నుంచి మినహా యింపు ఇవ్వాలని కమిషనర్ కోరగా, అధికారిక విధుల కార ణంగా మినహాయింపు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

మేజ్ఞల్ కలెక్టర్ హాజరుకు పోలీస్ కమిషనర్‌కు ఆదేశం

కోర్టు ధిక్కరణ కేసులో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ వ్యక్తి గత హాజరు నుంచి మినహాయింపు కోరడాన్ని హైకోర్టు నిరాక రించింది. ఈ నెల 25న ఆయనను కోర్టు ముందు హాజరుపరి చేలా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. బాచుపల్లి భూముల స్వాధీనానికి సంబంధించి 2025 జులైలో ఇచ్చిన ఉత్తర్వులు అమలు కాలేదంటూ దాఖ లైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఐఆర్ విధుల్లో ఉన్నందున హాజరు నుంచి మినహా యింపు కోరగా, గతంలో రెండుసార్లు అవకాశం ఇచ్చిన విష యాన్ని ప్రస్తావిస్తూ హైకోర్టు అభ్యర్థనను తిరస్కరించింది. పిటిష నర్ భూమిని ఏ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకున్నారు, అను సరించిన విధానం, ప్రభుత్వం ఆధీనంలో ఉన్న భూమి విస్తీర్ణం వివరాలను సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించింది.



ఎవరికీ నష్టం కలుగకుండా
మూసీ పునరుజ్జీవం

21 కిలోమీటర్ల మేర పనులు త్వరలో ప్రారంభిస్తాం
తమ్మిడికుంట అభివృద్ధిలో 14 ఎకరాలను 30 ఎకరాలకు విస్తరించాం
పునరుద్ధరించిన చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 12

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
12-11-2026
www.prajapaksham.in

ఎడిట్
PEOPLE'S VIEWS

పేదరికం తగ్గితే ఉచిత రేషన్ ఎందుకు?

భారతదేశంలో పేదరికం తగ్గిందని ప్రభుత్వ గణాంకాలు ప్రకటిస్తున్నప్పుడు, దేశంలోని కోట్లాది కుటుంబాలకు ఉచిత రేషన్ ఎందుకు ఇంకా అవసరమవుతోంది? ఈ ప్రశ్న మన దేశంలోని సామాజిక వాస్తవికతకు, ప్రభుత్వ విధానాలకు, పేద ప్రజల జీవన ప్రమాణాలకు, అభివృద్ధి నమూనాకు సంబంధించిన మౌలిక అంశాలను నిలదీస్తున్నది. ఒక దేశంలో పేదరికం తగ్గిందని ప్రకటించడం గొప్ప విషయమే. కానీ ఆ ప్రకటనతో పేదరికం అనుభవిస్తున్న మనుషుల కష్టాలు కూడా తగ్గిపోయాయని భావించడం మాత్రం ముమ్మాటికీ వాస్తవాన్ని విస్మరించడమే. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహా మండలి సభ్యురాలు డాక్టర్ షమికా రవి వెల్లడించిన వివరాల ప్రకారం, 2011–12 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 30 శాతంగా ఉన్న పేదరికం, తాజా గృహ వినియోగ వ్యయ గణాంకాల ఆధారంగా చూస్తే, 3.9 శాతానికి తగ్గింది. మరోవైపు, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందించే వ్యవస్థ కొనసాగుతోంది. పేదరికం ఇంతగా తగ్గిపోయినప్పుడు, ఉచిత రేషన్ పొందుతున్న వారి సంఖ్యలో అదే దామాషాలో తగ్గుదల ఎందుకు కనిపించడం లేదు? పేదరికం తగ్గిందనే గణాంకానికి, పేదరికం నుంచి బయటపడిన ప్రజల వాస్తవ జీవితాలకు మధ్య ఉన్న అంతరాన్ని మనం పరిశీలించాల్సిన అవసరం లేదా? ఈ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత మోదీ ప్రభుత్వానిదే. గణాంకాలు ఒక దేశ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. అవి అవసరమే. ప్రభుత్వాలు తమ విధానాల ఫలితాలను అంచనా వేయడానికి, ఆర్థికవేత్తలు అభివృద్ధి తీరును విశ్లేషించడానికి అవి ప్రామాణిక సాధనాలు. కానీ గణాంకాలకు ఒక పరిమితి ఉంది. అవి ఒక మనిషి జీవితాన్ని పూర్తిగా వివరించలేవు.

జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) ప్రకారం గ్రామీణ జనాభాలో 75 శాతం, పట్టణ జనాభాలో 50 శాతం మందికి ఆహార ధాన్యాలు అందించాలనే లక్ష్యంతో 2011 జనాభా లెక్కల ఆధారంగా 81.35 కోట్ల మందిని పేదలుగా తేల్చారు. ఈ పరిమితి పేదరికం తగ్గిన ప్రతిసారీ దానంతట అదే తగ్గే విధంగా రూపొందించలేదు. అంతే కాదు, 2011 జనాభా లెక్కల తర్వాత జనాభా పెరిగినా, కొత్త జనాభా అంచనా లెక్కల ఆధారంగా ఈ పరిమితిని పూర్తిగా సవరించలేదు. అందువల్ల 80 కోట్ల మందికి రేషన్ అందుతోందనే సంఖ్యను ప్రస్తుత పేదరికానికి నేరుగా అద్దం పట్టే గణాంకంగా చూడలేం. కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం అర్హులుగా గుర్తించినవారి సంఖ్య, వాస్తవంగా రేషన్ తీసుకుంటున్నవారి సంఖ్య ఒకటి కాదు. 2025 అక్టోబరులో దాదాపు 78.90 కోట్ల మంది ఉచిత ధాన్యాలు పొందుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ అంశాన్ని విస్మరించి 3.9 శాతం పేదరికం, 80 కోట్ల రేషన్ లబ్ధిదారులు అనే రెండు సంఖ్యలను మాత్రమే పోల్చడం సరైన విశ్లేషణ కాదు. ప్రభుత్వం నిజంగా పేదరిక నిర్మూలన దిశగా గొప్ప విజయాలు సాధించి ఉంటే, ఆ విజయాల ఫలితంగా ఆర్థికంగా బలపడిన కుటుంబాలను గుర్తించి, మరింత అవసరంలో ఉన్న కుటుంబాలకు ఆ ప్రయోజనాలను అందించే సమర్థమైన వ్యవస్థను ఎందుకు అభివృద్ధి చేయకూడదు? ఒకవైపు అనర్హులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు నిజమైన అర్హులు రేషన్ కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వలస కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వికలాంగులు అనేక సందర్భాల్లో ప్రభుత్వ గుర్తింపు వ్యవస్థలోనే చోటు సంపాదించలేకపోతున్నారు.

అర్హతను నిర్ణయించే ప్రమాణాలు కేవలం పత్రాల ఆధారంగా కాకుండా, కుటుంబాల వాస్తవ ఆర్థిక పరిస్థితుల ఆధారంగా ఉండాలి. ఆహార భద్రత అనేది దానం కాదు, పౌరుడి హక్కు. అయితే ఆహార భద్రతను కేవలం బియ్యం, గోధుమల పంపిణీకి పరిమితం చేయడం కూడా సరైంది కాదు. మనిషి కడుపు నిండితేనే ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పలేం. పిల్లలకు పప్పులు, పాలు, గుడ్లు, పండ్లు అందాలి. గర్భిణులకు పౌష్టికాహారం అందాలి. రక్తహీనత, పోషకాహార లోపం, చిన్నారుల్లో ఎదుగుదల సమస్యలను నిర్మూలించాలి. అందువల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రాంతీయ ఆహార అలవాట్లకు అనుగుణంగా చిరుధాన్యాలు, పప్పులు, ఇతర పోషకాహార పదార్థాలను కూడా చేర్చే దిశగా ప్రభుత్వం ఆలోచించాలి.

దేశంలో అట్టడుగు వర్గాలను నిజం గా అభివృద్ధి చేయాలంటే సంక్షేమ పథకాలతో పాటు ఉపాధి అవకాశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి. పట్టణాల్లో వలస కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, గృహ వసతి, ఆరోగ్య బీమా కల్పించాలి. ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేసి, పట్టణ పేదలకు కూడా ఉపాధి హామీ కల్పించే విధానాన్ని పరిశీలించాలి.

విద్య అనేది పేదరిక నిర్మూలనకు అత్యంత శక్తివంతమైన ఆయుధం. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, డిజిటల్ విద్య, వృత్తి విద్యను బలోపేతం చేయాలి. అలాగే ఆరోగ్య రంగాన్ని నిర్లక్ష్యం చేసి పేదరికాన్ని నిర్మూలించడం సాధ్యం కాదు. మహిళల ఆర్థిక సాధికారతకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి. స్వయం సహాయక సంఘాలను కేవలం రుణాల పంపిణీ కేంద్రాలుగా కాకుండా, చిన్న పరిశ్రమలు, ఉత్పత్తి కేంద్రాలు, మార్కెటింగ్ వ్యవస్థలుగా అభివృద్ధి చేయాలి. మహిళలకు ఆస్తి హక్కులు, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి. వృద్ధులకు, వికలాంగులకు, ఒంటరి మహిళలకు గౌరవప్రదమైన పెన్షన్లు అందించాలి. సంక్షేమం అనేది వారి జీవనాధారానికి మాత్రమే కాకుండా ఆత్మగౌరవానికి కూడా తోడ్పడాలి. ప్రభుత్వం ప్రకటించే 3.9 శాతం పేదరికం నిజంగా దేశానికి గర్వకారణం కావాలంటే, ఆకలితో నిద్రపోయే ఒక్క కుటుంబం కూడా ఉండకూడదు. ఉచిత రేషన్ తీసుకునే కుటుంబాన్ని అవమానంగా చూడకూడదు. అదే సమయంలో జీవితాంతం ఉచిత రేషన్‌పై ఆధారపడాల్సిన పరిస్థితిని కూడా అభివృద్ధిగా పరిగణించకూడదు.


ఉచిత ఆహారం తాత్కాలికంగా ఆకలిని నివారిస్తుంది. నాణ్యమైన విద్య, స్థిరమైన ఉపాధి, ఆరోగ్య భద్రత, సామాజిక న్యాయం మాత్రం తరతరాల పేదరికాన్ని నిర్మూలిస్తాయి. ఒక దేశ అభివృద్ధిని కొలవడానికి అత్యంత సరైన కొలమానం ఆ దేశంలో అత్యంత పేదవాడి జీవితాన్ని పరిశీలించడమే. అంబానీ సంపద ఎంత పెరిగింది, స్టాక్ మార్కెట్ ఎంత ఎత్తుకు చేరింది, దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఎన్నో స్థానానికి ఎదిగింది అనే అంశా లు ముఖ్యమే కావచ్చు. కానీ ఒక పేద తల్లి తన బిడ్డకు తగినంత ఆహారం పెట్టగలుగుతోందా? ఒక రైతు తన అప్పులు తీర్చగలుగుతున్నాడా? ఒక నిరుద్యోగ యువకుడు గౌరవప్రదమైన ఉద్యోగం సంపాదించగలుగుతున్నాడా? ఒక వృద్ధుడు ఇతరులపై ఆధారపడకుండా జీవించగలుగుతున్నాడా? అన్నదే నిజమైన అభివృద్ధికి సిసలైన పరీక్ష. గణాంకాలు ప్రజల కన్నీళ్లను తుడవలేవు. అంకెలు ఆకలి బాధను అనుభవించలేవు. పేదరికం తగ్గిందని చెప్పడం కంటే, పేదరికంలో ఉన్న చివరి మనిషిని కూడా ఆ పరిస్థితి నుంచి బయటకు తీసుకురావడమే కీలకం. అప్పుడే గణాంకాలకు, వాస్తవాలకు నిజమైన అర్థం.. పరమార్థం.



ఆయన ఒక్క నిమిషం కూడా పదవిలో ఉండొద్దు

త్వరలో పదవి నుంచి దిగిపోనున్న ప్రధానమంత్రి (నెతన్యాహూ) అధికారిక కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తూ 26వ నెస్సెట్(ఇజ్రాయెల్ పార్లమెంటు) ప్రమాణ స్వీకారోత్సవంలో చేసిన భ్రమపూరిత, విభజనకర, ద్వేషపూరిత, అవమానకరమైన ప్రసంగాన్ని నేను కూర్చుని విన్నాను. ఆయన ఒక్క నిమిషం కూడా ఆ పదవిలో కొనసాగడానికి అనర్హుడని నా నమ్మకం మరింత బలపడింది. మనం తక్షణమే జాతీయ అత్యవసర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. ఆయన పాలన కొనసాగితే ఇజ్రాయెల్‌ను విభజిస్తూ, దాని భద్రతకు ప్రమాదం కలిగిస్తోంది.

- గాదీ ఐసన్‌కోట్, ఇజ్రాయెల్ ప్రధానిగా ఆహ్వానం అందుకున్న విపక్ష నేత



ప్రాణాలు తీస్తున్న న్యుమోనియా వ్యాధి!

2021లో న్యుమోనియా అంటువ్యాధితో 2.2 మిలియన్లు మరణించగా అందులో 5.02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యుమోనియా. కోవిడ్19 కారణంతో మరో 10 మిలియన్లు కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలను తీస్తున్న వ్యాధుల్లో న్యుమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యుమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, మిలియన్ల జనులు న్యుమోనియా సోకే ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యుమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోని వారు, పోషకాహారలోపాలు, ఇంట్లో వంట చెరుకు వాడేవారు, కలుషిత గాలి పీల్చే పెద్దలు, పొగ త్రాగే దురలవాటు ఉన్నవారు అధికంగా న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ప్రపంచ న్యుమోనియా దినం 2026 ఇతివృత్తంగా న్యుమోనియా అదుపులో కొత్త శకం(ఏ న్యూ ఏరా ఆఫ్ న్యుమోనియా కంట్రోల్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

న్యుమోనియాలో రకాలు: న్యుమోనియా నివారించదగిన అంటు వ్యాధి. వ్యాధిగ్రస్థులు తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాల్లో మరొకరికి సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. పిల్లల్లో బ్యాక్టీరియా కారక స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది. న్యుమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. న్యుమోనియా వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది. ప్రపంచ న్యుమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌జిఒలు, ఇతర సంస్థలు కలిసి న్యుమోనియా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగగ్రస్థులకు చికిత్సా పద్ధతులు వివరించ డం మంచి ఫలితాలను ఇస్తాయి. న్యుమోనియాను తొలి దశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి. యూనిసెఫ్ వివరాల ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యుమోనియాతో మరణిస్తున్నాడు. వృద్ధుల్లో న్యుమోకోకల్ న్యుమోనియా అధికంగా సోకుతుంది. న్యుమోసిస్టిక్ జిరోవెస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. డబ్ల్యూహెచ్ఒ, యూనిసెఫ్‌లు సంయుక్తంగా న్యుమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు.

నివారణ మార్గాలు: టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల న్యుమోనియా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. యాంటీబ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ఔషధాలతో న్యుమోనియా కట్టడి జరుగుతుంది. భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ ప్రదేశాల్లో ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదుల్ని కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు జాగ్రత్తలు న్యుమోనియా కేసులను తగ్గిస్తాయి.

డాక్టర్ బిఎం. రెడ్డి, 9949700037

ఐడిబిఐ విక్రయం ఆర్థిక స్వయంప్రతిపత్తికి చేటు

ఫెయిర్‌ఫాక్స్‌కు అమ్మడాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యోగులు

జ్ఞాన్ పాఠక్

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఐడిబిఐ) త్వరలోనే విదేశీయుల చేతుల్లోకి వెళ్లనుంది. దేశ జాతీయ ప్రయోజనాల దృష్ట్యానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ వాది అయిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభు త్వం చెబుతోంది. అయితే, దీనిని వ్యతిరేకిస్తూ ఐడిబి ఐ ఉద్యోగులు, అధికారులు నవంబర్ 2, 3 తేదీలలో దేశవ్యాప్తంగా రెండు రోజుల సమ్మె నిర్వహించారు. ఇది భారత వ్యతిరేక చర్యఅని, ప్రజా జవాబుదారీతనం, జాతీయ ప్రయోజనాలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో తదుపరి కార్యాచరణను నిర్ణయించడానికి ఐడిబిఐ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయీస్ యునైటెడ్ ఫోరమ్ (యుఎఫ్ఐఒఇ)నవంబర్ 10న కోర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

దేశవ్యాప్త సమ్మె పిలుపుతో సహ ఇతర సంఘాల మద్దతు కోరేందుకు, బ్యాంక్ యూనియన్‌ల ప్రధాన సంస్థ అయిన 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యుఎఫ్‌బియు – ఎఐబిఇఎ, ఎఐబిఒసి, ఎన్‌సిబి, ఎఐబిఒఎ, బెఫి, ఇన్‌బాక్, ఇన్‌బెఫ్ అనే ఏడు బ్యాంకు యూనియన్‌ల ఉమ్మడి వేదిక)ను సంప్రదిస్తామని యుఎస్ఐఒఇ కన్వీనర్ దేవిదాస్ తుల్జాపూర్కర్ తెలిపారు. 'ఈ ఒప్పందం ద్వారా ఐడిబిఐ ఆస్తులు, సంస్థాగత సామర్థ్యాలు, వినియోగదారులతో సంబంధాలు, భవిష్యత్తు ఆదాయాలు, వ్యూహాత్మక ప్రాముఖ్యత తక్కువ అంచనా వేయ బడతాయని మేము తీవ్రం గా ఆందోళన చెందుతున్నాము' అని ఆయన అన్నారు.

ఐడిబిఐలో ఉన్న 60.72 శాతం ప్రభుత్వ వాటాను సుమారు రూ.53,000కోట్లకు (5.5 బిలియన్ డాలర్లు) కెనడాకు చెందిన ఫెయిర్ ఫ్యాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు విక్రయించడానికి కేంద్రం ఇప్పటికే ఆమోదం తెలిపింది. ప్రభుత్వానికి చెందిన 30.48 శాతం వాటాను సుమారు రూ. 26,620 కోట్లకు, ఎల్ఐసి కలిగి ఉన్న 30.24 శాతం వాటాను సుమారు రూ.26,440 కోట్లకు ఫెయిర్‌ఫ్యాక్స్ వ్యూహాత్మక కొనుగోలుదారుగా దక్కించుకోనుంది. భారతీయ బ్యాంకులో ఇదే అతి పెద్ద విదేశీ పెట్టుబడి కానుంది. అంతేకాకుండా, దేశంలో మొత్తం బ్యాంకింగ్ ప్రైవేటీకరణ వైపు ఇది ఒక ప్రధాన అడుగు కానుంది. ఇద్దరు స్వతంత్ర విలువ మదింపు ఏజెన్సీలు నిర్ణయించిన రూ.75.99 బెంచ్‌మార్క్ ఫెయిర్ వాల్యూ కంటే ఎక్కువ గా, కెనడియన్ బిలియనీర్ ప్రేమ్ వాత్సా నేతృత్వంలోని ఫెయిర్‌ఫ్యాక్స్ ఒక్కో షేరుకు రూ. 81 చొప్పున చెల్లించనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి నియంత్రణ అనుమతులు లభిస్తే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని అంచనా.

ఐడిబిఐ అనేది సాధారణ బ్యాంకు కాదు. ఇది భారతదేశ పారిశ్రామిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన ఒక పారిశ్రామిక బ్యాంకు. దీనిని విదేశీ చేతుల్లో పెట్టడమంటే... భారతదేశ పారిశ్రామిక భవిష్యత్తును, దాని ప్రజల గమనాన్ని నిర్దేశించే అధికారాన్ని విదేశీయుల చేతిలో పెట్టడమే. ప్రస్తుతం ఐడిబిఐలో ఎస్‌సి, ఎస్‌టి,ఒబిసి వర్గాలకు చెందిన 9,500 మందితో కలిపి మొత్తం 19,108 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇందులో 6,911 మంది మహిళా ఉద్యోగులు, 884 మంది దివ్యాంగులైన ఉద్యోగులు ఉన్నారు.

ఐడిబిఐలో 60.72 శాతం వాటాను కొనుగోలు చేయడానికి కెనడియన్ బిలియనీర్ ప్రేమ్ వాత్సా నేతృత్వంలోని ఫెయిర్ ఫ్యాక్స్ అంగీకరించిన కొద్ది వారాలకే ఈ అఖిల భారత రెండు రోజుల సమ్మె జరిగింది. సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు, అధికారులు ఈ విక్రయ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విక్రయం తర్వాత భారత ప్రభుత్వానికి 15 శాతం, ఎల్ఐసికి 19 శాతం వాటా మిగులుతుంది. ఈ వాటాను కూడా రెండేళ్లలోపు 15 శాతానికి తగ్గించుకోవాల్సి ఉంటుంది.

ఆ తర్వాత ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం, కొనుగోలు చేసిన 15 ఏళ్లలోపు ఫెయిర్‌ఫ్యాక్స్ తన ఈక్విటీ హోల్డింగ్‌ను క్రమంగా 26 శాతానికి తగ్గించుకోవాల్సి ఉంటుంది. రెండేళ్లలోపు ఫెయిర్‌ఫ్యాక్స్ తన సిఎస్‌బి బ్యాంకును ఐడిబిఐతో విలీనం చేయాలి లేదా సిఎస్‌బి బ్యాంకులో తన వాటాను విక్రయించాలి. అలాగే మైనారిటీ వాటాదారుల కోసం ఓపెన్ ఆఫర్ కూడా ఉంటుంది. అయితే, ఫెయిర్ ఫ్యాక్స్ ఓటింగ్ హక్కులు మాత్రం 26 శాతానికే పరిమితం చేయబడతాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నుంచి ఫెయిర్‌ఫ్యాక్స్ అధికారిక అనుమతులు పొందాలి. ఈ ఒప్పందాన్ని 2027 మార్చి 31 నాటికి పూర్తిగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

తక్కువ ధరకు విక్రయిస్తున్నారనేదే అసలు వివాదానికి కారణం. నివేదికల ప్రకారం, కొనుగోలుదారులే ధరను చూసి, ఆ తర్వాత ధరను నిర్ణయించారు. ఇది బిడ్డింగ్ ప్రక్రియ సమగ్రతపై ప్రశ్నలను లేవనెత్తింది. మరో కారణం వల్ల కూడా ఈ అంశం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మరికొన్ని ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా అమ్మకానికి ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.





దేశంలోని ప్రతి ప్రభుత్వ రంగ సంస్థను ద్రవ్యీకరణ (మానిటైజేషన్) పేరుతో విక్రయిస్తున్నారని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ) పేర్కొంది. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలోకి విదేశీ మూలధనాన్ని అనుమతిస్తున్నారు. రేపు మన బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ ఏ రూపంలో ఉండాలో కూడా వారే నిర్దేశిస్తారేమోనని మేము భయపడుతున్నాము. బ్యాంకుల ప్రైవేటీకరణ ఇప్పుడు ప్రధాన సమస్యగా మారింది. ఐడిబిఐ కాకుండా మరికొన్ని బ్యాంకులను ప్రైవేటీకరించబోతున్నామని ప్రకటించడం ద్వారా ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగులకు సవాలు విసిరింది. మేము ఒక సంఘంగా ఆ సవాలును స్వీకరించి, ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాన్ని తిప్పికొట్టడానికి వీధుల్లోకి రావాలని ఎఐబిఇఎ స్పష్టం చేసింది.

ఐడిబిఐ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు యుఎఫ్‌బియు ప్రకటించింది. 'ఐడిబిఐ బ్యాంకును రక్షించండి, ప్రైవేటీకరణను ఆపండి, విదేశీకరణను ఆపండి' అనే నినాదాలతో వారు ముందుకు వచ్చారు. 2026 అక్టోబర్ 23న ముంబైలో జరిగిన నిరసన దీక్షలో కూడా వారు పాల్గొన్నారు. ఐడిబిఐ ఉద్యోగులు, అధికారుల పోరాటం తమ అందరి పోరాటమని యుఎఫ్‌బియు స్పష్టం చేసింది. బ్యాంకులను అమ్మడం అంటే ప్రజల పొదుపును రూ. 3.5 లక్షల కోట్ల మేరకు విదేశీ పెట్టుబడిదారులకు కట్టబెట్టడమేనని తెలిపింది.

10 కేంద్ర కార్మిక సంఘాల (సిటియు) సంయుక్త వేదిక కూడా ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. ఫెయిర్‌ఫ్యాక్స్‌కు ఐడిబిఐ విక్రయాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. బిడ్డింగ్, వాల్యుయేషన్, నిర్ణయాధికార ప్రక్రియలలో జరిగినట్లు ఆరోపణలున్న అక్రమాలపై దర్యాప్తు జరపాలని, పబ్లిక్ ఓనర్‌షిప్‌పై దీని ప్రభావం గురించి, పార్లమెంట్‌లో ఐడిబిఐ గురించి ఇచ్చిన గత హామీలకు ఇది ఎలా అనుగుణంగా ఉందో సమీక్షించడానికి పార్లమెంటరీ సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు.

'ఐక్య వేదికతో సమన్వయం చేసుకుంటూ దేశ వ్యాప్తంగా నిరసనలు, సంఘీభావ ఆందోళనలను నిర్వహించాలని మా అనుబంధ సంఘాలు, ఫెడరేషన్లకు మేము పిలుపునిస్తున్నాము. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, పరిశ్రమలు, రవాణా, ప్రజా సేవలు, ఇతర రంగాల కార్మికులు ఏకమై ఈ విధానం తాలూకు పరిణామాలను ఎండగట్టాలి. ప్రజా సంపదను కార్పొరేట్ ప్రయోజనాలకు తాకట్టు పెట్టడాన్ని ప్రతిఘటించాలి'అని సిటియుల ఉమ్మడి వేదిక పేర్కొంది.

రైతు పండిస్తే రూ.30.. వ్యాపారి అమ్మితే రూ.70!

బియ్యం ధరలకు కళ్లెం వేసే ప్రభుత్వానికి ధాన్యం ధరలు కనిపించవా? రైతు కష్టానికి గిట్టుబాటు ఏదీ?

తెలంగాణలో బియ్యం ధరల పెరుగుదలపై ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. బియ్యం కొరత ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని పౌర సరఫరాల శాఖ ఖండించడమే కాకుండా వివిధ రకాల బియ్యానికి గరిష్ట విక్రయ ధరలను నిర్ణయించింది. బిపిటి, కెఎన్ఎం రకాల బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రూ.74, హెచ్ఎంటి, జెఎస్ఆర్ రకాల బియ్యం రూ.79గా ధరలను ప్రకటించింది. నిర్ణయించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సామాన్య వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమంజసమే. కానీ ఇక్కడే ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బియ్యం ధరలు పెరిగితే వెంటనే స్పందించే ప్రభుత్వానికి ధాన్యం పండించిన రైతుకు గిట్టుబాటు ధర దక్కకపోతే ఎందుకు స్పందన ఉండటం లేదు?

రైతు విత్తనం వేసిన రోజు నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎన్నో కష్టాలు పడతాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల వేతనాలు, సాగునీరు, విద్యుత్, యంత్రాల అద్దెలు, కోతలు, రవాణా ఇలా ప్రతి దశలోనూ పెట్టుబడి పెడతాడు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, తెగుళ్లు ఎదురైనా పంటను కాపాడుకోవడానికి శ్రమిస్తాడు. చివరకు ధాన్యం చేతికి వచ్చినప్పుడు మాత్రం దాని ధర నిర్ణయించే అధికారం అతని చేతిలో ఉండదు. అప్పులు తీర్చాలి, కుటుంబాన్ని పోషించాలి, పిల్లల చదువులు కొనసాగించాలి, తదుపరి పంటకు పెట్టుబడి సమకూర్చుకోవాలి. ఈ పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన ధరకు ధాన్యం విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పంట పండించే రైతుకు ధర నిర్ణయించే అవకాశం లేకపోవడం వ్యవసాయ వ్యవస్థలోని ప్రధాన లోపం.

రూ.3వేల ధాన్యం.. రూ.7వేల బియ్యం!

క్వింటాల్ ధాన్యం సుమారు రూ.3 వేల ధర పలుకుతుంటే, అదే ధాన్యం నుంచి తయారైన బియ్యం క్వింటాల్ సుమారు రూ.7వేల వరకు విక్రయించే పరిస్థితి కనిపిస్తోంది. అంటే రైతు ఉత్పత్తి చేసిన ముడిసరుకుకు లభిస్తున్న ధరకు, వినియోగదారుడు చెల్లిస్తున్న ధరకు మధ్య భారీ వ్యత్యాసం ఉంది. అయితే ఈ వ్యత్యాసమంతా వ్యాపారుల లాభమేనని చెప్పడం సరైంది కాదు. ధాన్యాన్ని మరపట్టడానికి విద్యుత్, కార్మికుల వేతనాలు, రవాణా, నిల్వ, ప్యాకింగ్ వంటి ఖర్చులు ఉంటాయి. బియ్యంతో పాటు నూకలు, తవుడు, పొట్టు వంటి ఉప ఉత్పత్తులు కూడా వస్తాయి. వీటి విలువను కూడా లెక్కించాలి. కానీ అన్ని ఖర్చులు పోను మిల్లర్లు, వ్యాపారులకు మిగులుతున్న లాభమెంత? రైతు కు అందుతున్న వాటా ఎంత ? ఇదే అసలు ప్రశ్న.



బియ్యం ధరలు పెరిగితే వినియోగదారులపై భారం పడుతుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. మరి ధాన్యం ధరలు పడిపోయినప్పుడు రైతులపై పడే భారం గురించి ఎవరు ఆలోచించాలి? కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే సరిపోదు. ఆ ధరకు కొనుగోళ్లు జరిగేలా చూడాలి. తేమ శాతం, నాణ్యత, తరుగుదల పేరుతో రైతుల ధాన్యానికి అన్యాయమైన కోతలు విధించకుండా పర్యవేక్షించాలి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జాప్యం జరిగితే రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదే అవకాశంగా భావించే కొందరు వ్యాపారులు తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతు అప్పుల ఒత్తిడిలో ఉన్నప్పుడు తన పంటను నిల్వ చేసుకునే స్థోమత ఉండదు. చివరకు వచ్చిన ధరకు అమ్ముకొని నష్టాన్ని భరించాల్సి వస్తోంది.

ధరల నియంత్రణలో రైతుకు న్యాయం ఎక్కడ?

ప్రభుత్వం బియ్యం విక్రయ ధరలకు గరిష్ట పరిమితులు విధించడం ఎంత ముఖ్యమో, రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడం కూడా అంతే ముఖ్యం. వినియోగదారుడికి తక్కువ ధరకు బియ్యం అందించాలనే పేరుతో రైతు ఆదాయాన్ని తగ్గించడం పరిష్కారం కాదు. మిల్లర్లు, వ్యాపారులు తమ పెట్టుబడికి తగిన న్యాయమైన లాభం పొందాలి. అదే సమయం లో రైతు కూడా తన సాగు ఖర్చులు తిరిగి పొందడంతో పాటు తగిన ఆదాయం పొందాలి. ఈ మూడు వర్గాల ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ధాన్యం కొనుగోలు చేసిన పరిమాణం, మిల్లింగ్ అనంతరం వచ్చిన బియ్యం, ఉప ఉత్పత్తుల పరిమాణం, వాటి విక్రయ ధరలు, మిల్లింగ్ ఖర్చులపై ప్రభుత్వం సమగ్ర పరిశీలన చేయాలి. ధాన్యం నుంచి బియ్యం వినియోగదారుడి చేతికి చేరే వర కు ప్రతి దశలో పారదర్శకత తీసుకురావాలి. కనీస మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోళ్లు జరగకుండా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. రైతు విక్రయించిన ధాన్యానికి నిర్ణీత సమయంలోనే నగదు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. రైతు పండించిన ధాన్యం లేకుండా బియ్యం మార్కెట్‌లోకి రాదు. రైతు వ్యవసాయం నుంచి దూరమైతే భవిష్యత్తులో ఆహార ఉత్పత్తిపైనే ప్రభావం పడుతుంది. ఇప్పటికే పెరుగుతున్న పెట్టుబడులు, తగ్గుతున్న గిట్టుబాటు ధరలు, అప్పుల భారం రైతాంగాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం రైతు ఆదాయాని కి భరోసా కల్పించాలి. బియ్యం ధరల నియంత్రణ చర్యలతో పాటు ధాన్యం ధరల విషయంలోనూ సమానమైన శ్రద్ధ చూపాలి. రైతుకు న్యాయమైన ధర లభిస్తేనే వ్యవసాయం లాభసాటిగా మారుతుంది.

పాలకులు ఆలోచించాల్సిన ప్రశ్న ఒక్కటే.. బియ్యం కిలో రూ.70కు విక్రయించే పరిస్థితిలో వినియోగదారుడి ప్రయోజనాల కోసం ధరలను నియంత్రిస్తున్న ప్రభుత్వం, అదే బియ్యానికి మూలమైన ధాన్యం పండించిన రైతుకు న్యాయమైన ధర కల్పించడానికి ఎందుకు సమానమైన చొరవ చూపడం లేదు? రైతు కష్టానికి విలువ లేకుండా వ్యాపార వ్యవస్థలో ధరల నియంత్రణకు అర్థమేమిటి? రైతు నష్టపోతే దేశ ఆర్థిక వ్యవస్థకే నష్టం. వ్యాపారులకు న్యాయమైన లాభం, వినియోగదారుడికి అందుబాటు ధర, రైతుకు గిట్టుబాటు ధర.. ఈ మూడింటినీ సమన్వయం చేసినప్పుడే నిజమైన సంక్షేమం సాధ్యమవుతుంది. బియ్యం ధరలకు కళ్లెం వేయడం మాత్రమే పాలన కాదు.. ధాన్యం పండించిన రైతు కన్నీళ్లకు అడ్డుకట్ట వేయడమే నిజమైన రైతు సంక్షేమం!

వెంకగారి భూమయ్య, 9848559863

మైనారిటీల అభివృద్ధితోనే దేశ ప్రగతి

విద్య, నైపుణ్యాలకు పెద్దపీట
త్వరలో మూసీ రివర్ ఫ్రంట్ పనులు ప్రారంభం
'నైట్ ఎకానమీ'తో యువతకు ఉపాధి
ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీని పునరుద్ధరిస్తాం
సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : దేశ జనాభాలో 15 శాతం ఉన్న మైనారిటీలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే దేశం ముందడుగు వేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మైనారిటీల్లో పేదరిక నిర్మూలన, విద్యాభివృద్ధి, యువతకు నైపుణ్య శిక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. హైదరాబాద్ నగర చారిత్రక వైభవాన్ని పునరుద్ధరించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించేలా మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీకి శ్రీకారం చుట్టనున్నట్లు ప్రకటించారు. భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో సిఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహమ్మద్ అజారుద్దీన్‌తో కలిసి సిఎం నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం తొలి ప్రధాని పండిట్ నెహ్రూ విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. మౌలానా ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే దేశ విద్యావిధానానికి రూపకల్పన చేయడంతోపాటు ఐఐటీల వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ఏర్పాటుకు పునాదులు పడ్డాయని వివరించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో కేవలం విద్య ఉంటే సరిపోదని, నైపుణ్యాలు ఉన్నవారికే ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని సిఎం పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఐటిఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ఎటిసిలు) అభివృద్ధి చేశామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన విద్య, అనంతరం నైపుణ్య శిక్షణ, ఆ తర్వాత ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిస్తూ విద్యారంగంలో సంస్కరణలు చేపడుతున్నట్లు చెప్పారు. స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల ఏర్పాటుతో యువతకు నూతన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మైనార్టీ యువతలో నైపుణ్యం ఉన్నవారు ఎంతో మంది ఉన్నారని, తల్లిదండ్రులు పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. చదువుపై ఆసక్తి లేనివారికి నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు క్రీడల్లో ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. మైనారిటీల్లో పేదరికాన్ని తొలగించాలనే ఉద్దేశంతో సచార్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. విద్యకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, హైదరాబాద్‌లో నిరుపేదల కోసం లక్ష ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు.

త్వరలో మూసీ రివర్ ఫ్రంట్ పనులు

మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు సిఎం ప్రకటించారు. మూసీ పరిసరాల్లో నైట్ ఎకానమీ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రివర్ ఫ్రంట్‌ను అత్యంత సుందరమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్ది, దేశవిదేశాల నుంచి సందర్శకులను ఆకర్షించేలా అభివృద్ధి చేస్తామన్నారు. హైదరాబాద్‌ది ఓల్డ్ సిటీ కాదని, ఒరిజినల్ సిటీ అని పేర్కొంటూ నగర పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాలు విస్తరించి, దేశ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు.గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ పనులను వచ్చే రెండు నెలల్లో ప్రారంభిస్తామని సిఎం వెల్లడించారు. మీరాలం ట్యాంక్‌ను మరో ఏడాది కాలంలో సుందరమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలు, అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, వి.హనుమంతరావు, ఎంపిలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, టిజిఎంఆర్ఇఐఎస్ వైస్ చైర్మన్, ప్రెసిడెంట్ ఫహీం ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల చైర్మన్లు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



గిగ్ వర్కర్లతో రాహుల్ గాంధీ ర్యాలీ

14న శిల్పకళావేదిక నుంచి హెచ్‌ఐసిసి వరకు ప్రదర్శన
6 లక్షల మంది కార్మికులకు సామాజిక భద్రత, ప్రమాద బీమా : మంత్రి వివేక్

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : గిగ్ వర్కర్ల హక్కులు, సంక్షేమం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ నెల 14న హైదరాబాద్‌లో శిల్పకళావేదిక నుంచి హెచ్‌ఐసిసి వరకు గిగ్ వర్కర్లతో కలిసి రాహుల్ గాంధీ ర్యాలీలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ ర్యాలీ రాజకీయాలకు అతీతంగా కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేద్కర్ సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 6 లక్షల మంది గిగ్ వర్కర్లు వివిధ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, మల్టీనేషనల్ కంపెనీల ద్వారా ఉపాధి పొందుతున్నారని చెప్పారు. డెలివరీ సిబ్బంది, క్యాబ్ డ్రైవర్లు పని ఒత్తిడి, ప్రమాదాల సమయంలో రక్షణ లేకపోవడం, సంక్షేమ సదుపాయాల కొరత వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లకు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చిందని, దాని అమలుకు అవసరమైన నిబంధనలను సిద్ధం చేసిందని వెల్లడించారు. కార్మికులకు సామాజిక భద్రత, ప్రమాద బీమా, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కల్పించడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్లాట్‌ఫామ్ కంపెనీలు, కార్మిక సంఘాలతో చర్చించి వారి సూచనలను పరిగణనలోకి తీసుకున్నామన్నారు. గిగ్ వర్కర్ల నమోదు, సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ గిగ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం గత మూడేళ్లుగా పోరాడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం చట్టాన్ని ఆమోదించి, అమలుకు నిబంధనలు సిద్ధం చేయడం హర్షణీయమన్నారు. సామాజిక భద్రత, ప్రమాద బీమా, సంక్షేమ బోర్డు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థతో లక్షలాది మంది కార్మికులకు భరోసా లభిస్తుందని చెప్పారు. గిగ్ వర్కర్ల తరఫున ప్రభుత్వానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



సాగునీరు లేకుండా వ్యవసాయాభివృద్ధి ఎలా?

రైతు గర్జన సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కెటిఆర్

ప్రజాపక్షం/నిర్మల్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు కావస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు కాలేదని కెటిఆర్ విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం నిర్మల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి రామ్‌కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు గర్జన సభలో కెటిఆర్ ప్రసంగించారు. రైతులకు రూ.15వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. రైతుబంధు పేరును మార్చి రైతుభరోసాగా ప్రకటించినంత మాత్రాన రైతుల సమస్యలు పరిష్కారం కావని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం సకాలంలో అందించాలి, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి, ఎరువులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందించిందని గుర్తుచేశారు. రైతు సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలను కొనసాగించడంతో పాటు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. రైతులు ఎరువుల కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు.
నిర్మల్ నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్) ప్రశ్నించారు. నిర్మల్ పట్టణానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీ ఏమైందని నిలదీశారు. గతంలో ఇదే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.150 కోట్లు కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు లేఖ రాసిన మహేశ్వర్‌రెడ్డి, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆ పనులను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.

గోదావరి జలాలు రైతులకు ఎందుకు అందడం లేదు? ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి సమస్యలపై కెటిఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గోదావరి నది పక్కనే ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు మాత్రం సాగునీరు అందని పరిస్థితి ఎందుకని ప్రశ్నించారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడానికి గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టును నింపడంతో పాటు సరస్వతి కాలువ, సదర్‌మాట్, కడెం ప్రాజెక్టులకు సాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు సాగునీరు అందించకుండా వ్యవసాయాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టులు, కాలువలు ఉన్నప్పటికీ చివరి ఆయకట్టు రైతులకు నీరు అందకపోవడం ఆందోళనకరమన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ?

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి పథకంలో అదనంగా తులం బంగారం వంటి హామీలను కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిందని కేటీఆర్ గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీల అమలుపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతు గర్జన సభ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సభలో నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి రామ్ కిషన్ రెడ్డి,బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి,మాజీ మంత్రి జోగు రామన్న,మా జంపి బాల్క, బోత్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,వినయ్ రెడ్డి,జీవన్ రెడ్డి,చిన్నారెడ్డి,సుభాష్ రావు,సుమన్,బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ రీసర్వేలో రైతుల అభ్యంతరాలకు అవకాశం కల్పించాలి

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేలో రైతులకు ఎలాంటి సందేహాలు, అభ్యంతరాలు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రీసర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్వే అనంతరం అభ్యంతరాలు తెలియజేసేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై రైతులకు స్పష్టతనివ్వాలని, నోటీసులు జారీ చేసిన తర్వాత ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో చాటింపు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్‌డిఓలు, సర్వే శాఖ అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూమి విస్తీర్ణం, రీసర్వేలో గుర్తించిన విస్తీర్ణం వివరాలను భూ యజమానులకు వెంటనే తెలియజేయాలని స్పష్టం చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు కలెక్టర్లు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. పాలేరు నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, పరిధిలోని 141 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 708 రోవర్లతో సర్వే కొనసాగుతోందని, వారం రోజుల్లో అదనంగా మరో 400 రోవర్లను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి మండలానికి రెండు సర్వే బృందాలు, రెండు రోవర్లను కేటాయించినట్లు వివరించారు. క్షేత్రస్థాయి అధికారుల అనుభవాలు, సూచనల ఆధారంగా రీసర్వే ప్రామాణిక నిర్వహణ విధానంలో (ఎస్ఒపి) అవసరమైన మార్పులు, చేర్పులు చేసి మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని చెప్పారు. రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దుల విషయంలో గందరగోళం లేకుండా ఇరు శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి హద్దులను నిర్ధారించాలని ఆదేశించారు. రీసర్వేలో నల్గొండ, ఖమ్మం జిల్లాల పనితీరును అభినందించిన మంత్రి, నిజామాబాద్ జిల్లాలో సర్వే తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఇక 22ఎ భూముల సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ కొన్ని జిల్లాల్లో సమస్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, అర్హులైన పేదలకు త్వరగా లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. వరంగల్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, హనుమకొండ జిల్లాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. నిర్మాణ దశ ఏదైనా సరే, రెండు పడక గదుల ఇళ్లకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి, ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ పాల్గొన్నారు.

"హనుమకొండ కలెక్టరేట్ వద్ద సిపిఐ భారీ ధర్నా"

తెలంగాణకు రూ.20వేల కోట్లు
తక్షణ కరువు సహాయం
అందించాలని డిమాండ్



ప్రజాపక్షం/హనుమకొండ : తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 20,000 కోట్ల తక్షణ కరువు సహాయం అందించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పక్షపాత వైఖరిని వెంటనే విడనాడాలని, రాష్ట్ర కరువు నివారణకు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు కాలంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు రేషన్/చౌక డిపోల ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా లేదా రాయితీ ధరలకు సరఫరా చేయాలి. పంటలు ఎండిపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించి, వ్యవసాయరంగాన్ని ఆదుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితులను పరిశీలించకుండా కేవలం గణాంకాల ఆధారంగా కరువు మండలాలను ప్రకటించడం సరైన విధానం కాదన్నారు. కౌలు రైతులను కూడా గుర్తించి ప్రభుత్వ సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నేదునూరి రాజమౌళి, బాషబోయిన సంతోష్, కొట్టె పాక రవి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్ నాయక్, కొట్టె వెంకటేష్, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, రాసమల్ల దీనా, భూక్య స్వరూప పాల్గొన్నారు.

ఆటోమొబైల్.. ఇ.వి. రంగాల్లో

భారీ పెట్టుబడులకు తెలంగాణ ఆహ్వానం

'ఇన్వెస్ట్ తెలంగాణ' సమ్మిట్‌లో భాగస్వాములు కావాలని
మంత్రి పొన్నం పిలుపు



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: విజన్–2047 లక్ష్య సాధనలో ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల (ఇ.వి) రంగాలు కీలకమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026లో ఆటోమొబైల్, ఈవి రంగాల ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సచివాలయంలో ఆటోమొబైల్, ఆటో కాంపోనెంట్స్, ఇ.వి. రంగాలపై నిర్వహించిన తొలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోమొబైల్ తయారీ, ఆటో కాంపోనెంట్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, బ్యాటరీ టెక్నాలజీ, ఇ.వి. ఛార్జింగ్ మౌలిక వసతుల రంగాల్లో తెలంగాణలో భారీ పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.

2.17లక్షల ఇ.వి.ల విక్రయాలు..కాలుష్య రహిత తెలంగాణ లక్ష్యంతో రెండేళ్ల క్రితమే ప్రత్యేక ఇ.వి. పాలసీని అమలుచేస్తున్నామని పొన్నం తెలిపారు. ఈవిల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు కల్పించినట్లు చెప్పారు. ఈ ప్రోత్సాహకాలతో గత రెండేళ్లలో రాష్ట్రంలో 2,17,690 ఎలక్ట్రిక్ వాహనాలు విక్రయమయ్యాయని, సుమారు రూ.2,343 కోట్ల మేర పన్ను మినహాయింపులు కల్పించినట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో మూడు పారిశ్రామిక పార్కులు..

ఆటోమొబైల్, మొబిలిటీ రంగాల అభివృద్ధికి రాష్ట్రంలో మూడు పారిశ్రామిక పార్కులు, మొబిలిటీ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జహీరాబాద్ నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్‌తోపాటు ఎంకతల, కొడంగల్ ప్రాంతాల్లో పరిశ్రమలకు విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. భూమి, ల్యాబ్‌లు, మౌలిక వసతులు, రవాణా కనెక్టివిటీ, అనుమతులు తదితర అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. హ్యుందాయ్, మహీంద్రా, అమరరాజా, ఓలెక్ట్రా, బిలిటి ఎలక్ట్రిక్, ప్యూర్ ఇ.వి., బాష్, జెడ్‌ఎఫ్, ఎంఆర్ఎఫ్ వంటి సంస్థలు ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వినియోగించుకుని మరిన్ని పెట్టుబడులు పెట్టాలని, ఇప్పటికే ఉన్న పరిశ్రమలను విస్తరించాలని పారిశ్రామికవేత్తలను కోరారు. సమావేశంలో రవాణా శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, కార్యదర్శి నిఖిల్ చక్రవర్తి, జెటిసి వెంకట రమణ, పరిశ్రమల శాఖ డైరెక్టర్ అన్సద్ షేక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: కోస్గి, జిల్లా: నారాయణపేట
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
Lr.No. E1/NIT No.178 to 187/Kosgi/2026-27, తేది: 11.11.2026
కోస్గి మున్సిపాలిటీ, మున్సిపల్ కమిషనర్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ కింద సాధారణ నిధి / 15వ ఆర్థిక సంఘం నిధులతో (10 నెం.) రూ.29.07 లక్షల టెండర్ నోటీసు 1) NIT No.178 to 187/Kosgi/2026-27, తేది: 11.11.2026ను ఆహ్వానించడమైనది. వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:
1. మొత్తం పనుల సంఖ్య : 10
2. పనుల మొత్తం విలువ : రూ. 29.07 లక్షలు
3. బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ & సమయం : 12.11.2026 ఉదయం 10.00 గంటలకు
4. బిడ్ సమర్పణ ముగింపు తేదీ & సమయం : 21.11.2026 సాయంత్రం 5:00 గంటలకు
5. బిడ్ ప్రారంభ తేదీ : 21.11.2026 సాయంత్రం 5.10 గంటలకు
6. కార్యాలయంలో సంప్రదించవలసిన అధికారి పేరు మరియు చిరునామా : మున్సిపల్ కమిషనర్, కోస్గి మున్సిపాలిటీ. ఫోన్. 9701565271. సహాయ ఇంజనీర్, కోస్గి, ఫోన్. 8074904013.
సం/- కమిషనర్, కోస్గి మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 13497-PP/CL/ADVT/2026-27, Date: 11-11-2026

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: U40109TG2000SGC034119
సంక్షిప్త టెండర్ ప్రకటన నెం. 02/ 2026-27 of SE/OP/HNK
పూర్వపు వరంగల్ జిల్లాకు చెందిన TGNPDCL రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనవి. నయీమ్‌నగర్ సబ్-డివిజన్‌లోని 33/11KV పెద్దమ్మగడ్డ సబ్-స్టేషన్‌లో దెబ్బతిన్న ప్రహరీ గోడ పునర్నిర్మాణం, కంట్రోల్ రూమ్ స్లాబ్‌పై ఇంపెరియస్ కోటింగ్, టాయిలెట్ మరమ్మతులు, పెయింటింగ్ మరియు ఇతర సివిల్ పనుల ద్వారా సబ్-స్టేషన్ పునరుద్ధరణకు ప్రతిపాదన; నయీమ్‌నగర్ సబ్-డివిజన్‌లోని 33/11KV గోపాల్‌పూర్ సబ్-స్టేషన్‌లో సెక్షన్ ఆఫీస్ కమ్ కంట్రోల్ రూమ్ కోసం RCC రూఫ్ స్లాబ్, కాలమ్స్ మరియు బీమ్స్‌తో మొదటి అంతస్తులో మూడు (3) గదుల భవన నిర్మాణం; 33/11 KV స్విచ్ యార్డ్‌లో కేబుల్ ట్రెంచ్ నిర్మాణం మరియు 20mm మెటల్ పరచడానికి ప్రతిపాదన. KUC-SS, హనుమకొండ ఉప విభాగంలోని మచిలీబజార్ సెక్షన్ కార్యాలయంలో ముందుగా రంగు వేయబడిన గాల్వాల్యూమ్ ట్రెపెజాయిడల్ ప్రొఫైల్ రూఫింగ్ షీట్లతో స్టోర్ రూమ్ షెడ్ నిర్మాణం మరియు హనుమకొండ సర్కిల్‌లోని జిల్లా స్టోర్స్‌లో సామాగ్రి నిల్వ కోసం ముందుగా రంగు వేయబడిన గాల్వాల్యూమ్ MS రూఫ్ షీట్లతో రెండు ఓపెన్ షెడ్ల నిర్మాణం మరియు మీటర్ సీలింగ్ షెడ్‌పై రూఫ్ షీట్ల మార్పిడికి ప్రతిపాదన. పనుల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.tgnpdcl.com నుండి పొందవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్, హనుమకొండ.
స్పెసిఫికేషన్ నెం - 01/2026-27తో
డి.ఇ./ఆపరేషన్/భద్రాచలం వారి సంక్షిప్త టెండర్ ప్రకటన నెం - 13/2026-27
భద్రాచలం ఆపరేషన్ డివిజన్‌లోని దుమ్ముగూడెం సెక్షన్‌లో పనుల అమలు కోసం ఏజెన్సీ అంచనాను ఖరారు చేయడానికి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని TGNPDCL రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించడమైనవి. పనుల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.TGNPDCL.in నుండి పొందవచ్చు.
సం/- డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్, TGNPDCL, భద్రాచలం.
DIPR R.O. No. : 13513-PP/CL/ADVT/2026-27, Date: 11-11-2026

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్
EE-CIR-6 (GHAT), ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఉప్పల్ జోనల్ ఆఫీస్, ఎంఎంసి.
NIQ నెం. 07/EE/CIR-06/GHAT/MMC/2026-27, తేది.11.11.2026
కింది వస్తువుల ధరల నిర్ధారణ కోసం non-SoR వస్తువులకు కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి

క్ర.సం.	వివరణ	యూనిట్
1	గుంతలు పూడ్చడానికి ఒక ట్రాక్టర్ మరియు ట్రాలీ, డ్రైవర్, ఇంధన ఛార్జీలు (డ్రైవర్ అదనపు ఛార్జీలతో సహా) మరియు ఇతర ఖర్చులు మొదలైనవి	నెలలు
2	ఒక టాటా ఏస్, డ్రైవర్, ఇంధన ఛార్జీలు మొదలైనవి	నెలలు
3	క్రోబార్ల (crow bars) సరఫరా మరియు డెలివరీ - టాటా తయారీ	No
4	పారల సరఫరా మరియు డెలివరీ - టాటా బ్రాండ్	No
5	ప్లాస్టిక్ గిన్నెల (gamalas) సరఫరా మరియు డెలివరీ - టాటా తయారీ	No
6	5 కిలోల బరువు గల ఒక సుత్తి సరఫరా మరియు డెలివరీ	No
7	వాహనం కోసం MMC లోగోతో 4'x6' ఫ్లెక్సీ బ్యానర్ సరఫరా మరియు డెలివరీ	No
8	భద్రతా బూట్లు సరఫరా మరియు డెలివరీ	No
9	2'' రేడియం మరియు లోగోతో కూడిన జాకెట్ల సరఫరా మరియు డెలివరీ	No
10	రోడ్డు ట్రాఫిక్ భద్రతా కోన్ల సరఫరా మరియు డెలివరీ	No
11	హెవీ డ్యూటీ రబ్బరు చేతి తొడుగుల సరఫరా మరియు డెలివరీ	Pair
12	ఇనుప చీపుర్ల సరఫరా మరియు డెలివరీ	No
13	MCH నమూనా ప్రకారం పూర్తిగా, ఖర్చు మరియు రవాణా మొదలైనవాటితో సహా, VRCC M30 డిజైన్ మిక్స్ గల RCC చతురస్రాకార రంధ్రాల కవర్లను అందించడం మరియు అమర్చడం	Each
14	MCH నమూనా ప్రకారం పూర్తిగా, ఖర్చు మరియు రవాణా మొదలైనవాటితో సహా, VRCC M30 డిజైన్ మిక్స్ గల RCC బేస్ ఫ్రేమ్‌లను అందించడం మరియు అమర్చడం	Each

కొటేషన్ల స్వీకరణ ప్రారంభ తేదీ : 12.11.2026 10:30 AM
కొటేషన్ల స్వీకరణ చివరి తేదీ : 13.11.2026 03:30 AM వరకు
ప్రతిష్ఠాత్మక తయారీదారులు / అధీకృత డీలర్లు / రిజిస్టర్డ్ ఏజెన్సీల నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. ఏవైనా అదనపు సమాచారం మరియు సీల్డ్ కొటేషన్ కవర్ల కోసం, వాటిని క్రింది చిరునామాలో అందజేయాలి:-
అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్- 06, (GHAT) ఎంఎంసి, ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఘట్‌కేసర్ సర్కిల్-06, ఉప్పల్ జోన్, హైదరాబాద్.
ఫోన్ నెం.8790374055
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ 06 (GHAT), ఎంఎంసి
DIPR R.O. No. : 13533-PP/CL/ADVT/2026-27, Date: 11-11-2026

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

కారుణ్య నియామకాలు, బదిలీలపై దృష్టి : రాజిరెడ్డి



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా మొగుళ్ళ రాజి రెడ్డి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోషామహల్‌లోని జలమండలి కార్యాలయంలో బుధవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ప్రతినిధులు ఆయనను ఎన్నుకున్నారు. అలాగే యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ జి. సంజీవరెడ్డి, ముఖ్య సలహాదారు గా బొంతు రామ్మోహన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ జలమండలి ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, ఉద్యోగుల బదిలీల దరఖాస్తులను పరిష్కరించడంతో పాటు హెచ్ఆర్, ఎన్ఎంఆర్ విభాగాల్లో పనిచేస్తున్న 22మంది మహిళలను పర్మినెంట్ చేయాలని యాజమాన్యాన్ని కోరనున్నట్లు తెలిపారు. 2004 నుంచి ఉద్యోగంలో చేరిన వారికి రిటైర్మెంట్, డెత్ గ్రాట్యుటీ అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి మాట్లాడుతూ ఐఎన్‌టియుసి పోరాటాల ఫలితంగానే కార్మికుల అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడు తూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వంలో జలమండలి కార్మికులకు న్యాయం జరిగిందన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.టి.రాఘవేంద్ర రాజ్, ఉపాధ్యక్షుడు శ్రావణ్, మేవ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్తర్ అలీ, ఎఐటియుసి నాయకుడు రమేష్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ నాయకులు శంకర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



ఫుట్‌పాత్‌లు పాదచారులకు అనుకూలంగా ఉండేలా చర్యలు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: ఫుట్‌పాత్‌లపై ఎలాంటి వ్యర్థ పదార్థాలు లేకుండా పాదచారులు సురక్షితంగా, సౌకర్యంగా నడిచేలా చూడాలని మల్కాజిగిరి నగర పాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. అదే విధంగా ఎక్కడా ఫుట్‌పాత్‌ల దురాక్రమణ, చిరువ్యాపారాలు నిర్వహించకుండా చూడాలని, ఇలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం మౌలాలి సర్కిల్ పరిధిలో పర్యటించిన ఆయన లైఫ్‌స్ప్రింగ్ ఆస్పత్రి సమీపంలోని జివిపి ప్రాంతాన్ని పరిశీలించి రహదార్లపై చెత్త పాయింట్ల వద్ద గుంతలు లేకుండా చూడాలని, నీరు నిలువకుండా మట్టి పౌడర్, డస్ట్ పౌడర్‌తో క్యాపింగ్ చేయాలన్నారు. దీనివల్ల దోమల వ్యాప్తిని నివారించవచ్చన్నారు. కార్బన్ సంస్థ సమీపంలోని జివిపి ప్రాంతంలో ట్రాఫిక్ డివైడర్లు, విద్యుత్ స్థంభాల పరిసరాలను శుభ్రపరచాలని, చెట్ల కొమ్మలు ఎప్పటికప్పుడు అవసరమైన మేరకు ప్రూనింగ్ చేయాలన్నారు. తిరుమలనగర్ కాలనీలోని జివిపి ప్రాంతంలో ప్రతి రోజు చెత్తను తొలగిస్తుండాలని, ఆర్కేనగర్ రైల్వే బ్రిడ్జికి ఇరువైపులా చెత్త పేరుకోకుండా చూడాలన్నారు. అనంతరం జైన్ బాలాజి బిగ్‌టౌన్‌లోని మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్ శుద్ధి చేసిన వ్యర్థజలాలు ఏ మేరకు మొక్కలకు వినియోగిస్తున్నారన్న విషయాన్ని చూశారు.

ప్రజల పోరాటంతోనే ప్రభుత్వ పాఠశాల స్థలం కాపాడాం

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: కెపిహెచ్‌బి హౌసింగ్ బోర్డు పరిధిలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి కేటాయించిన 2.39 ఎకరాల స్థలం విద్యాశాఖకు బదిలీ కావడం ప్రజలందరి విజయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం రమ్యాగ్రౌండ్స్ సమీపంలోని పాఠశాల స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఇటీవల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి స్థలాన్ని విద్యాశాఖకు బదిలీ చేయడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ స్థలం కోసం గత కొన్నేళ్లుగా ప్రజలతో కలిసి పోరా టం చేస్తున్నామని తెలిపారు. సుమారు నాలుగు సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి పునాదులు వేసి పనులు ప్రారంభించామని, అయితే అనంతరం హౌసింగ్ బోర్డు స్థలాల పేరుతో భూమిని విక్రయించేందుకు బోర్డులు ఏర్పాటు చేసి వేలం నిర్వహించే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. స్థలాన్ని కాపాడేందుకు ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. ఈ పోరాటంలో కెపిహెచ్‌బి ప్రజలు, స్థానిక నాయకులు, మీడియా మిత్రులు అందించిన సహకారం ఎంతో కీలకమని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యంగా మీడియా ప్రతినిధులు సమస్యను తమ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో ఈ అంశంపై విస్తృతంగా చర్చ జరిగిందని పేర్కొన్నారు. ప్రజలందరి సమిష్టి కృషి ఫలితంగానే స్థలం విద్యాశాఖకు బదిలీ అయ్యిందని, ఇది ఏ ఒక్కరి విజయమూ కాదని స్పష్టం చేశారు. అదేవిధంగా కూకట్‌పల్లి, మూసాపేట ప్రాంతాల్లో ఇంకా మిగిలి ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించకుండా ప్రజా అవసరాలకు వినియోగించాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, పగడాల బాబురావు, కృష్ణారెడ్డి, ప్రభాకర్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మౌలానా ఆజాద్‌కు ఘన నివాళి

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : భారత తొలి విద్యాశాఖ మంత్రి స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూం ఘనంగా పుష్పాంజలి ఘటించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మౌలానా ఆజాద్ చేసిన సేవలను విద్యారంగ అభివృద్ధికి ఆయన అందించిన విశేష కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఖయ్యూం, సీనియర్ నాయకులు వాజిద్, అష్రఫ్ అలీ, ఫారూక్, తదితరులు పాల్గొని మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



శామీర్‌పేట: బాలికల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం అజాద్ అని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ అన్నారు. బుధవారం మూడు చింతలపల్లి మున్సిపల్ జగ్గంగూడలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, ఎలక్యూషన్, ఉపన్యాసం, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా విచ్చేసిన వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ కమిటి సభ్యులు మహ్మద్ షఫీ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని, భవిష్యత్తులో ప్రజా ప్రతినిధులుగా, పాత్రికేయులుగా వివిధ రంగాల్లో రాణిస్తు సమాజ సేవకు అంకితం కావాలని సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణ మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం అజాద్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు నడుచుకోవాలని చెప్పారు. విద్యార్థులు భవిష్యత్తులో విద్యావంతులై బాధ్యత గల పౌరులుగా దేశాభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పదవ తరగతిలో టాపర్‌గా నిలిచిన అసిఫ్ తల్లిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఖాదర్, మైనార్టీ సీనియర్ నాయకుడు ఇమ్రాన్, మైనార్టీ నాయకులు మహ్మద్ జాఫర్, మ్మద్ యూసుఫ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కో ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం భూ రీ సర్వే

అవగాహనా సదస్సులో జిల్లా కలెక్టర్ మనుచౌదరి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : భూ రికార్డులను ఆధునీకరించటం, సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించటం, రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులను కల్పించే లక్ష్యంగానే ప్రభుత్వం భూ భారతి రీసర్వే కార్యక్రమం చేపట్టిందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. భూభారతి రీ సర్వేప్రక్రియపై రైతులకు, గ్రామస్తులకు సమగ్ర అవగాహన కల్పించటంలో భాగంగా కీసర మండలం బోగారం గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. రీ సర్వేలో పాత రికార్డులను ఏ విధంగా ఆధునీకరిస్తున్నామన్న విషయాలపై ఆయన సవివరంగా తెలియచేసారు. 1954 నాటి పాత సర్వే రికార్డు ల సమాచారాన్ని సేకరించి ప్రస్తుత కొత్త రీ సర్వేవివరాలతో సరిపోల్చి నవీకరిస్తారన్నారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా ప్రతి భూభాగాన్ని ఖచ్చితమైన భౌగోళిక కోఆర్డినేట్స్‌తో గుర్తించి, డిజిటల్ కోఆర్డినేట్స్‌తో కూడిన ప్రత్యేక నంబరును కేటాయించి రిజిస్టర్లలో నమోదు చేస్తారన్నారు. ముందుగా గ్రామ సరిహద్దులు(పొలిమేరలు), ఊరి భాగాలు, చెరువులు, ప్రభుత్వ భూములు, పట్టా భూములను స్పష్టంగా వర్గీకరించి సరిహద్దులు ఖరారు చేస్తానని, ఈ విధంగా ఏ రోజుఏ సర్వే నంబర్లలో కొలతలు తీసి రీ సర్వే చేయనున్నాయన్న వివరాలను ముందుగా ఆయా ప్రాంత రైతులు, గ్రామస్తులకు నోటీసుల ద్వారా సమాచారమిచ్చి వారి సమక్షంలోనే సర్వే చేస్తారన్నారు. రైతుల సమక్షంలో సర్వే చేసి నాలుగు వైపులా మార్కింగ్ చేసి, సరిహద్దు, సమస్యలు, పొజిషన్ మార్పులు ఏవైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కరించుకొనే అవకాశం ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేసారు. తల్లిదండ్రుల పేరిట ఉన్న భూములకు సంబంధించి కుటుంబ సరిహద్దు వివాదాలు రాకుండా సరిగ్గా పంపిణీ చేసుకొనేందుకు ఈ భూ రీ సర్వే ఉపయోగపడుతుందన్నారు.ఒక సర్వే నంబరులో ఉండే వేర్వేరు భూ యజమానులు సర్వే సమయంలో హాజరైతే భవిష్యత్తులో వారి మధ్య వివాదం ఏర్పడకుండా ఉంటుందన్నా రు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా రీ సర్వే సమయంలో కానీ ఆ తర్వాత కానీ అర్జీ పెట్టుకొని పరిష్కరించుకోవచ్చన్నారు. రీ సర్వే సమయంలో సంబంధిత భూ యజమానులు ప్రత్యక్షంగా హాజరు కావాలని, ఒక వేళ పట్టాదారులు రాలేని పక్షంలో సంబంధిత కుటుంబ సభ్యులు సైతం రావొచ్చన్నారు. గ్రామ సభకు వచ్చిన వారంతా రాలేని వారికి వివరాలు తెలియపరచి భూ రీసర్వేలో ప్రతి ఒక్క భూ యజమాని పాల్గొనేలా చూడాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, కీసర ఆర్డీఓ,అడిషనల్ డైరెక్టర్ సర్వే ఆఫ్ ల్యాండ్స్, కీసర తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి చేయూత పింఛన్లు మంజూరుకు చర్యలు

వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం



ప్రజాపక్షం/వికారాబాద్ : అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను ఆదేశించారు. చేయూత పింఛన్లు మంజూరు ప్రక్రియ, విబి రామ్‌జీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పింఛన్లు మంజూరు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని ఆదేశించారు. అనర్హులకు ఇచ్చినట్లు అయితే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నీటి కుంటలు , బోర్‌వెల్స్ రీచార్జ్, ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యరాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట చారి, డిఆర్డిఒ సుధీర్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎంపి ఈటల

ప్రజాపక్షం/చర్లపల్లి: సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు.5 డివిజన్ నాగారం పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీకి చెందిన నాగేష్‌కు 60 వేల రూపాయల చెక్కు,మధరానగర్ కాలనీకి చెందిన లక్ష్మికి 30 వేల రూపాయల చెక్కును ఈటల రాజేందర్ అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,నాయకులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి 'సిఎంఆర్ఎఫ్ ఎల్ఒసి చెక్కు అందజేత

ప్రజాపక్షం/జవహర్ నగర్ : అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జవహర్ నగర్ జ్యోతి కాలనీకి చెందిన కె. రంజన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 93,000 ఆర్థిక సాయం మంజూరైంది. బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న జవహర్ నగర్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిన్నోజు సుధాకర్ చారి, ఈ విషయాన్ని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తక్షణమే స్పందించి సీఎంఆర్ఎఫ్ (సీఎం ఆర్ ఎఫ్) కింద రూ. 93,000 మంజూరు చేయించారు. ఈ మేరకు మంజూరైన ఆర్థిక సాయం చెక్కును పిన్నోజు సుధాకర్ చారి చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డికి, నాయకులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆశ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాల చోరీ ''అదుపులోకి మైనర్లు''

ప్రజాపక్షం/జవహర్‌నగర్: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లను (చట్టంతో విభేదిస్తున్న నలుగురు బాలలు సిసిఎల్ఎస్) జవహర్‌నగర్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. వేలాది విలువైన 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

కేసు వివరాలు: జవహర్ నగర్ ఎస్‌హెచ్ఒ సైదులు

పోలీసుల సమాచారం మేరకు.. ఈ ఏడాది జూన్ 15న యాప్రాల్ ఎక్స్ రోడ్ సమీపంలో ఉన్న ఒక బేకరీ యజమాని తన హోండా యాక్టివా (టిఎస్ 07 ఇఆర్ 7853) ద్విచక్ర వాహనాన్ని షాపు ముందు పార్క్‌చేసి పనిమీద బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

వాహనాల తనిఖీలో దొరికిన నిందితులు

బుధవారం ఉదయం 6:00 గంటల ప్రాంతంలో జవహర్‌నగర్ చెన్నాపురం క్రాస్ రోడ్స్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయం లో నాగారం వైపు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు 17 ఏళ్ల మైనర్లను ఆపి వాహనం పత్రాలు చూపాల్సింది గా కోరగా, వారు సమాధానం చెప్పలేకపోయా రు. అనుమానంతో వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా, నకిలీ తాళా లు (డూప్లికేట్ కీస్) ఉపయోగించి పార్క్ చేసిన బైక్‌లు, స్కూటర్లను దొంగిలిస్తున్నట్లు అంగీకరించారు. జాలీ రైడ్‌లు, వ్యక్తిగత అవసరాల కోసమే ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

ఛేదించిన కేసులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు:

వీరి విచారణలో జవహర్‌నగర్, కార్ఖానా, అల్వాల్, తుకారాంగేట్, బొల్లారం (బోయిన్‌పల్లి) పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 6 దొంగతనం కేసులు ఛేదించబడ్డాయి.

దర్యాప్తులో భాగంగా ఈ క్రింది 5 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోండా యాక్టివా (టి ఎస్ 07 ఈ ఆర్ 7853) హోండా షైన్ (టిఎస్ 09ఎఫ్ ఇ 9968) ప్లెజర్ స్కూటర్ (ఎపి 10 ఎక్స్ 3067), స్ప్లెండర్ బైక్ (ఎపి24ఏ9291) హోండా షైన్ (టిఎస్ 10 ఇ ఎన్ 8928) (భద్రత నిమిత్తం కార్ఖానా పిఎస్‌కు బదిలీ చేయబడింది.) అదుపులోకి తీసుకున్న ఇద్దరు మైనర్లను చట్టపరమైన ప్రక్రియ అనంతరం మేడ్చల్ లోని జువైనల్ జస్టిస్ బోర్డు (జెజెబి) ముందు హాజరు పరిచారు.

ఈ కేసును మల్కాజిగిరి కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జవహర్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి.శివప్రసాద్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఎస్. భాస్కర్ రెడ్డి క్రైమ్ సిబ్బంది విజయవంతంగా ఛేదిం రు.

పోలీసుల హెచ్చరిక

వాహనదారులు తమ వాహనాలకు సరైన లాకింగ్ సిస్టమ్‌ను ఉపయోగించాలని, నిర్లక్ష్యంగా వాహనాలను వదిలివెళ్లవద్దని మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారులు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

ప్రజాపక్షం/ఉప్పల్ : అనుమానం పెను భూతంగా మారటంతో కట్టుకొన్న భార్య గొంతు నులిమి హతమార్చిన ఉదంతమిది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బజానా తండాకు చెందిన గగులోత్ రాజశేఖర్, ప్రియాంక(22) దంపతులు కుమార్తెతో పాటు ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని న్యూ శాంతినగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. గత కొద్ది కాలంగా భార్యపై అనుమానాలు పెంచుకొన్న క్రమంలో తరచు దంపతుల మధ్య గొడవలు చెలరేగేవి. మంగళవారం అర్ధ రాత్రి దాటాక 2.30 గంటల సమయంలో భార్యను గొంతు నులిమి హతమార్చిన భర్త తన భార్య ఆత్మహత్య చేసుకొందంటూ ఆమె తండ్రికి సమాచార మిచ్చాడు. అక్కడికి చేరుకొని విగతజీవిగా ఉన్న తన కుమార్తెను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఉప్పల్ బగాయత్ ప్రాంతంలో ఉన్ననిందితుడిని అరెస్టు చేశారు.





రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం బలోపేతం

స్పీకర్ ప్రసాద్‌కుమార్

ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్ : రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేస్తు రైతులకు మెరుగైనసేవలు అందించాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ నియోజకవర్గం శివారెడ్డి పేట్ పిఎసిఎస్ చైర్మన్‌గా ఎన్నికైన బి.రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లేశం ప్రమాణ స్వీకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య హాజరైన స్పీకర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాన్ని బలోపేతం చేస్తు రైతులకు మెరుగైనసేవలు అందించాలని సూచించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు సకాలంలో అందేలా చూడాలని పిఎసిఎస్ ద్వారా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం అన్నివిధాలుగా సహకరిస్తామని తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేశం, సభ్యులుగా నాగేంద్రమ్మ, సరిత, సంగప్ప, రమేష్ ,ప్రభకర్‌రెడ్డి నైమొద్దిన్, తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు రంగరాజు, పిఎసిఎస్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ మల్లేశం, సత్యనారాయణ, పార్టీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అనురాగ్‌లో జాతీయ సేవా శిబిరం ప్రారంభం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్: యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత పెంపొందించడమే లక్ష్యంగా అనురాగ్ విశ్వవిద్యాలయంలో పశ్చిమ మండల జాతీయ సేవా పథకం గణతంత్ర దినోత్సవ పూర్వ శిబిరం 2026 ఘనంగా ప్రారంభమైంది. ఏడు రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి యువ సేవకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ చైర్మన్ జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా భద్రతా విభాగం ఉప పోలీసు కమిషనర్ ఉషారాణి గౌరవ అతిథిగా, రిజిస్ట్రార్ చి.గోపాల్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, గోవా రాష్ట్రాలతో నుంచి సేవకులు ఈ శిబిరానికి తరలివచ్చారు. శిబిర సంచాలకుడు ఆర్.సైదా స్వాగత ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యువత నిస్వార్థ సేవ, అంకితభావం, జాతీయ సమైక్యతను అలవర్చుకొని సమాజ అభివృద్ధిలో కీలక ప్రాత పోషించాలని పిలుపునిచ్చారు. ఉషారాణి, గోపాల్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నాయకత్వం, మహిళా భద్రత సామాజిక బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు. జాతీయ సేవా పథకం నినాదమైన నేను కాదు, నీవు అనే సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని అతిథులు సూచించారు. అనంతరం శిబిర సమన్వయకర్త డాక్టర్ సి.మల్లేశ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ శిబిరం యువత మధ్య సాంస్కృతిక మార్పిడి, నాయకత్వ వికాసం, జాతీయ సమైక్యతకు వేదికగా నిలవనుంది.

పుస్తక పఠనంతో ప్రతీ ఒక్కరు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : పుస్తక పఠనంతో ప్రతీఒక్కరూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు మొబైల్ ఫోన్లలో సమయాన్ని వృథా చేయకుండా పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటుతో విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. విద్యాభ్యాసంలో ఆసక్తి ఉండి పేదరికంతో విద్యకు దూరమవుతున్న విద్యార్థులను ప్రోత్సహించి విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా వారి తల్లిదండ్రులకు విద్య అవసరాన్ని తెలియజేసేలా పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని చెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేలా నియోజకవర్గంలో తన సొంత నిధులతో ఇంటర్మీడియట్, ఒకేషనల్, డిగ్రీ కళాశాలలను నిర్మించానని, పేద విద్యార్థులు ఈ కళాశాలను వినియోగించుకుని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సెక్రటరి వసుంధర, పాఠశాల ప్రిన్సిపల్ కమల్ సింగ్, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





హెచ్ఎంటి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : హెచ్ఎంటి సంస్థలో సుదీర్ఘకాలం పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పిఎఫ్, గ్రాట్యూటీ, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, హెచ్ఎంటి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కూన శ్రీశైలం గౌడ్, బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్ఎంటి కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వారు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ పదేళ్లుగా ఉద్యోగులకు అందాల్సిన న్యాయబద్ధమైన బకాయిలను చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఎంపి ఈటల రాజేందర్ ఈ సమస్యను ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పార్లమెంట్‌లో ప్రస్తావించి ఉద్యోగులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి రిటైర్డ్ ఉద్యోగులు, జెఏసి సభ్యులు జివి నారాయణరెడ్డి, బిఎన్ మధుకృష్ణ, రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే సంకల్పం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఎలికట్ట సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహ్



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఆదర్శ గ్రామ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే సంకల్పంగా పని చేస్తున్నామని.. ఇందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అంధించేందుకు కృషి చేయాలని ఎలికట్ట సర్పంచ్ బుద్ద నవకిరణి నరసింహ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. బుధవారం హైద్రాబాద్ లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన మహిళా సర్పంచుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహ్ హాజరయ్యారు. ఈ శిక్షణ కార్యక్రమానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించి గ్రామ పంచాయతీకి రావాల్సిన నిధుల గురించి కోరినట్లు తెలిపా రు. ఈ శిక్షణలో గ్రామ పరిపాలన, అభివృద్ధి పనుల అమలు అంశాలపై అ వగాహన కల్పించినట్లు వివరించారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేసేందుకు తగిన నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు సర్పంచ్ బుడ్డ నవకిరణి నరసింహ్ తెలిపారు.

బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలన్నదే లక్ష్యం



ప్రజాపక్షం/షాద్‌నగర్: బాల బాలికల విద్యాభివృద్ధికి 14ఏళ్ళ లోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఫరుక్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహర్ వివరించారు. బుధవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫరూఖ్‌నగక్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి విద్య ప్రాముఖ్యతను, మాతృభాష ఉర్దూ పరిరక్షణ, ఉర్దూ ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మనోహర్ మాట్లాడుతూ బాలబాలిక విద్యాభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఉచిత నిర్బంధ విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరు విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉర్దూ భాష అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి మాతృభాష ఉర్దూలో విద్యాబోధన చేయించి, మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి మూడో తరగతి స్థాయి అర్హత ధృవపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్ రిజ్వానా ముబారక్ అలీఖాన్, సియాసత్ ఉర్దూ సీనియర్ విలేకరి మన్సూర్‌ఖాన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, వీర్లపల్లి మహబూబ్, ఇసాక్‌లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులకూ ఓటు హక్కు



ప్రజాపక్షం/కొందుర్గు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కొందుర్గు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ప్రథమ పౌరులుగా, గ్రామీణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సర్పంచులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు లేకపోవడం విచారకరమన్నారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నడిపించే సర్పంచులకు తగిన గుర్తింపు గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపిటిసిలకు ఉన్నట్లుగానే సర్పంచులకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టేందుకు మార్పులు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సర్పంచుల హక్కుల సాధన కోసం రాష్ట్రంలోని సర్పంచులందరు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామ స్వరాజ్యం బలోపేతం కావాలంటే సర్పంచులకు తగిన అధికారాలు, హక్కులు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు జరుపుల గోపాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి బోయ అశోక్, సర్పంచులు రమేష్, నర్సింలు, ఆంజనేయులు, యాదయ్య, సుధాకర్‌లు పాల్గొన్నారు.

ఎరుకల తెగపై సిపి వ్యాఖ్యలు బాధాకరం



ప్రజాపక్షం/హయత్ నగర్: ఎరుకల తెగకు చెందిన కులస్తులపై ఇటీవల ప్రెస్‌మీట్‌లో మల్కాజ్గిరి సిపి చేసిన వ్యాఖ్యలు బాధాకరంగా ఉన్నాయని ఏకలవ్య నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిఎస్ఐ డివిజన్ పరిధిలోని ఏకలవ్య నగర్ కాలనీ కమిటీ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో అధిక వడ్డీలకు పాల్పడుతున్న మహిళలను పోలీసులు అరెస్టు చేసిన విషయం విధితమే. తధానంతరం ఏకలవ్య నగర్ కాలనీ, ఎరుకలను నాంచారమ్మ బస్తీలలో పోలీసులు చేసిన ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడ్డ వస్తువులు, ద్వీచక్ర వాహనాలు, ఏ ఒక్కటి కూడా తమ కాలనికి చెందినవి కావని, తాము ఎరుకల కులానికి చెందిన వారే అయినా మా వృత్తి తట్టలు, బుట్టలు అల్లడం,చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవడం లాంటి జీవనం కొనసాగిస్తామని,ఇలా ఎక్కడి నుంచో వచ్చి ఏకలవ్య నగర్ కాలనీ పేరు వాడుకుని మమ్ములను సమాజంలో తలెత్తుకోకుండా చేస్తున్నారని, ఇలాంటివారు మరల తప్పులు చేయకుండా పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకోవడానికి తమ వంతు సహకారం కూడా ఉంటుందని వారు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమం లో కాలనీ వైస్ ప్రెసిడెంట్ కోనేటి మల్లేష్, పెద్ద శీను,ట్రెజరరి స్వామి,ఆర్గనైజింగ్ సెక్రెటరీ కౌన్ రెడ్డి లింగస్వామి,కోనేటి కుమార్,అసిస్టెంట్ సెక్రెటరీ కూతాడి నవీన్, కౌన్ రెడ్డి రాములు,కోనేటి ధనుంజయ,కోనేటి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ భవన నిర్మాణ అనుమతులపై..

థాయ్‌లాండ్ ఆసక్తి

- జిహెచ్‌ఎంసి బిల్డ్ వేదికపై అధ్యయనం.. • పట్టణ పాలనలో ఉత్తమ పద్ధతులపై ఆరా



ప్రజాపక్షం/హైదరాబాద్: భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను వేగవంతం చేస్తూ, పారదర్శకమైన డిజిటల్ సేవలను అందించడంలో జిహెచ్‌ఎంసి అనుసరిస్తున్న విధానాలపై థాయ్‌లాండ్ ప్రతినిధి బృందం ఆసక్తి కనబరిచింది. పట్టణ పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పౌరులకు మెరుగైన సేవల అందింపులో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేసేందుకు థాయ్‌లాండ్‌కు చెందిన ప్రతినిధులు జిహెచ్‌ఎంసిని సందర్శించారు. థాయ్ పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడి సలహాదారు పీంగ్‌పనోర్ బూన్‌క్లమ్, ప్రోగ్రెసివ్ మూవ్‌మెంట్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ తానాథోర్న్ జువాంగ్‌రూంగ్‌రువాంగ్‌కిట్, ఫౌండేషన్ డైరెక్టర్ కుంతిదా రుంగ్రువాంగ్‌కియాట్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి అధికారులు 'బిల్డ్' డిజిటల్ ప్లాట్‌ఫారమ్ పనితీరు, సేవల గురించి వారికి వివరించారు. ఒకే వేదిక ద్వారా వివిధ రకాల భవన నిర్మాణ అనుమతులు, లే అవుట్ ఆమోదాలు, బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కుల (టిడిఆర్) సేవలను పొందే విధానాన్ని ప్రతినిధులకు వివరించారు. ఈ సమీకృత వ్యవస్థ ద్వారా దరఖాస్తుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు పారదర్శకత, వేగవంతమైన అనుమతులు, పౌరులు, నిర్మాణ రంగ అభివృద్ధి దారులకు సులభమైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. జిహెచ్‌ఎంసి చేపట్టిన సాంకేతిక ఆధారిత పాలన, పౌర కేంద్రిత సేవలను థాయ్‌లాండ్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. ఈ సమావేశంలో ఐఎఎస్ అధికారులు పి.ఉదయ్ కుమార్, రాధిక గుప్తా పాల్గొని జిహెచ్‌ఎంసి డిజిటల్ పాలన కార్యక్రమాలు, పరిపాలనా విధానాలపై వివరించారు.



చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి..

సృజనాత్మకత పెంచుకోండి

పోలీసులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి: సిపి సజ్జనర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బంది చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, మానసిక ప్రశాంతత కోసం పుస్తక పఠనం, క్రీడలు, సంగీతం, రచనలు వంటి మంచి అభిరుచులను అలవర్చుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనర్ సూచించారు. పోలీసుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యశాలలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో బుధవారం సిటీ పోలీస్ ఐటి సెల్ కానిస్టేబుల్ కురిటి నారాయణరావు రచించిన 'వంశధార' వచన కవితా సంకలనాన్ని సిపి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన నారాయణరావు పోలీసు విధులు నిర్వహిస్తూనే నాలుగేళ్లపాటు శ్రమించి పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ తమలోని ప్రతిభను వెలికితీయాలని పిలుపునిచ్చా రు. పుస్తకాన్ని తల్లిదండ్రులకు అంకితం ఇవ్వడం గొప్ప విషయమని, వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. పోలీసులు ప్రశాంతంగా విధులు నిర్వహించడానికి వారి కుటుంబ సభ్యులు, ముఖ్యంగా భార్యల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కృత్రిమ మేధ ఎంత అభివృద్ధి చెందినా మానవ భావోద్వేగాలను, అక్షరంలోని జీవాన్ని భర్తీ చేయలేదని సజ్జనర్ అన్నారు. కార్యక్రమంలో రచయిత కుటుంబ సభ్యులతో పాటు బిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, డిసిపి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా, పకడ్బందీగా భూ రీసర్వే

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశం



ప్రజాపక్షం/రంగారెడ్డి: భూ రీసర్వే ప్రక్రియలో ప్రతి రైతుకు సంబంధించిన భూములను క్షేత్ర స్థాయిలో కచ్చితంగా గుర్తించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం రాందాస్‌పల్లి గ్రామంలో చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహణ తీరును, రైతుల భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతుకు చెందిన భూమి సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించి, భవిష్యత్తులో ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహణకు కనీసం 24 గంటల ముందుగానే సంబంధిత గ్రామంలోని పట్టాదారులకు నోటీసులు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ రోజు, ఏ సమయంలో, ఏ ప్రాంతంలో సర్వే నిర్వహించనున్నారనే వివరాలను ముందుగానే రైతులకు తెలియజేయాలని, నోటీసులు అందించిన వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వేకు హాజరైన రైతులతో పాటు, నోటీసులు అందించినప్పటికీ హాజరుకాని పట్టాదారుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. సర్వే నంబర్ల ప్రాతిపదికన మాత్రమే కాకుండా రైతుల వారీగా భూములను గుర్తించి హద్దులు నిర్ధారించాలని తెలిపారు. ప్రతి రైతుకు చెందిన భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవసరమైన చోట ఫ్లాగ్‌లు ఏర్పాటు చేసి,రైతులకు భూమి సరిహద్దులను ప్రత్యక్షంగా చూపిస్తూ వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పూర్తయిన అనంతరం భూమి విస్తీర్ణం, సరిహద్దులు, ఇతర వివరాలను ఖచ్చితంగా నమోదు చేసి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సర్వే వివరాలకు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలకు మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. భూ రీసర్వే ప్రక్రియపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని, వారి సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ సర్వేలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా వివరించాలని కలెక్టర్ సూచించారు. సర్వే బృందాలు ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు చేరుకుని, సంబంధిత రైతులకు ముందస్తు సమాచారం అందిస్తూ సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. భూ రీసర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతులు, గ్రామస్థులు సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎం.రాంరెడ్డి, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ సునీత, సర్వేయ ర్లు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార రంగాల్లో రాణిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




ప్రజాపక్షం/షాద్‌నగర్: వ్యాపార రంగాల్లో యువత రాణిస్తేనే ఆర్థికాభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. బుధవారం షాద్‌నగర్‌లో సిడి తండా ఉప సర్పంచ్ మూడావత్ రవీందర్ నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన కెఎఫ్‌సి రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభించి నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత వ్యాపార రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ రంగం కొంతమేరకు వెనుకబడిపోయిందని, దాంతో అందరు వ్యాపార రంగాల వైపు ఎక్కువగా మొగ్గు చూపిస్తున్నారని గుర్తు చేశారు. వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నప్పుడే వ్యాపారం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు అస్కారం ఉంటుందని పేర్కొన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలను తయారు చేయడంతో పాటు ప్రజల నమ్మకాన్ని ఎప్పటికప్పుడు నిలబెట్టుకునేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజలందరి అభిప్రాయాల మేరకు రుచికరమైన ఆహారం అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని పేర్కొన్నారు. నిర్వాహకులు ముందుకు వస్తే యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అస్కారం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్, మాజీ ఎంపిపి శివ శంకర్ గౌడ్, కౌన్సిలర్లు రాజునాయక్, చాకలి పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, సిడిగుట్ట తండా సర్పంచ్ గబ్రు చౌహాన్, నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సంక్షేమానికి నిధులివ్వండి

కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం

ప్రజాపక్షం/షాద్‌నగర్: మైనార్టీ సంక్షేమానికి రూ.2కోట్ల నిధులు మంజూరు చేసేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం కోరారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎండి ఇబ్రహీం మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లో చేపట్టనున్న అలు అభివృద్ధి కార్యక్రమాలకు మైనార్టీ సంక్షేమ శాఖ నుండి రూ.2కోట్ల నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని మంత్రి అజారుద్దీన్‌ను కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నాలుగు ఉర్దూ ఘర్ కమ్ షాదీ ఖానాల మరమ్మత్తులు పునరుద్ధరణ పనులతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మైనార్టీ సంక్షేమ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్ని పూర్తి చేసేందుకు రూ.2కోట్ల నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని, ఉర్దూ పాఠశాలలతోపాటు మైనార్టీ సంక్షేమానికి నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని మంత్రిని కోరినట్లు వివరించారు. అదే విధంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ మైనార్టీల అభివృద్ధికి మైనార్టీ కార్పోరేషన్ ద్వారా నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబేదుల్లా కోత్వాల్‌ను సైతం కలిసి నియోజకవర్గానికి అవసరమైన నిధుల విషయంపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఖదీర్, ఫయూమ్, ఇషాక్‌లు ఉన్నారు.



భూమి కొనుగోలు చేసిన రైతుకు న్యాయం చేయాలి



ప్రజాపక్షం/యాచారం : యాచారం మండల పరిధిలోని తులే కుర్థ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 167లో 3 ఎకరాల 20 గుంటల భూమిని అకుల కోటయ్య పట్టా చేసే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. మూడవ రోజు దీక్ష జక్కుల ఆనంద్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి అయన ముఖ్యఅతిధిగా హజరై మాట్లాడారు. 40 సంవత్సరాల క్రితం ధర్మన్నగూడ గ్రామానికి చెందిన తెరేటి ముత్యాలు నిర్మల వద్ద డబ్బులు తీసుకోని అగ్రిమేంటు రాసి డాక్మేంటు నంబర్ 1277/1992తో ఇచ్చి పట్టా చేస్తానని నమ్మించి మోసం చేస్తున్న ఆకుల కోటయ్య ధౌరజ్యన్యాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు. పట్టా చేస్తానని కాలాయాపన చేస్తూ తన కోడుకు ఆకుల శ్రీనివాస్ పేరున దొంగతనంగా జిపిఎం చేశారని అగ్రహం వ్యక్తం చేశారు. భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని అగ్రహం వ్యక్తం చేశారు. 1992లో భూమిని పట్టా చేస్తామని డబ్బులు తీసుకోని పట్టా చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కోన్నారు. పట్టా చేయక పోతే అందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తావునాయక్, శ్రీనివాస్, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీమన్నారాయణ తదితరులు పాల్గోన్నారు.

18 ఎకరాల భూ సమస్యపై రైతులకు న్యాయం చేయాలి

ఎల్‌బినగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



ప్రజాపక్షం/హయత్ నగర్: హయత్‌నగర్ మండల పరిధిలోని సర్వే నంబర్ 255/1లో ఉన్న 18 ఎకరాల భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించి బాధిత దళిత రైతులకు న్యాయం చేయాలని ఎల్‌బినగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. సుమారు 70 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి భూములను ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో లాక్కుందని తెలిపారు.రైతులు తమ భూమికి సంబంధించిన సమస్యల వివాదం, ఎదుర్కొంటున్న సమస్యలు, భూమి హక్కులకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని,అర్హులైన బాధిత రైతులకు న్యాయం జరిగేలా సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2022లో బిఆర్ఎస్ ప్రభుత్వం బాధిత రైతులకు ఎకరానికి 500 గజాల స్థలం కేటాయించే విధంగా నిర్ణయం తీసుకోని సంతకాలు సేకరించిందని తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం దళితులను టార్గెట్ చేసి 300 గజాల స్థలం ఇచ్చేలా చెప్పడం సరైంది కాదని అన్నారు. భూములు కోల్పోతున్న బాధిత రైతులకు నష్టపరిహారంగా ఒక్కొక్కరికి 600 గజాల స్థలం ఇవ్వాలని సుధీర్ రెడ్డి కోరారు. అలాగే సాహెబ్ నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ వీకర్ సెక్షన్ సర్వే నెంబర్ 71/1నందు గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58,59 జిఒ కింద దరఖాస్తు చేయడం జరిగిందని దానిలో కొందరు 59 జిఒ కింద దాదాపు 23 మంది ఒక్కొక్కరు ఒక లక్ష యాభై అయిదు వేల రూపాయలు(1,55,000) డబ్బులు కూడా కట్టడం జరిగింది అలాగే రెవిన్యూ అధికారులు పరిశీలించడం జరిగింది అని తెలిపారు. అక్కడ పేద, మధ్య తరగతి ప్రజలు దాదాపు 80 గజాల స్థలంలో ఇండ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కానీ ఈ పభుత్వం వారికీ పట్టాలు ఇవ్వకుండా ఆపివేయడం జరిగిందన్నారు. కావున తక్షణం వీటి మీద చర్యలు తీసుకుని పట్టాలు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కటేపాక స్కైలాబ్, గంగాని నాగేష్,దుబ్బాక నవీన్,జయ ఈశ్వర్,బోడ శ్రీరాములు,కటేపాక ప్రవీణ్,గంగాని శ్రీను,బోడ శ్రవణ్,గంగాని ప్రవీణ్ మరియు శ్రీ వెంకటేశ్వర కాలనీ వీకర్ సెక్షన్ మాజీ అధ్యక్షులు కృష్ణ,బొమ్మడ శీను,రామాచారి,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలు పరిష్కరించాలి : కరుణాకర్



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసేందుకు కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారుడు, రాజ్యసభ ఎంపి వెం నరేందర్‌రెడ్డికి వినతిని కోరినట్లు తెలంగాణ గ్రాడ్యుట్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల డైరెక్టర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టి.కరుణాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో వెం నరేందర్‌రెడ్డిని టిపిజెఎం స్టేట్ ప్రెసిడెంట్ చైర్మన్ గౌరీ సతీష్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భీమ్ భరత్, తెలంగాణ గ్రాడ్యుట్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్‌లు కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఒకవైపు విద్యార్థులు, మరోవైపు కళాశాల యజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వివరించారు. బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల నిర్వాహణ భారంగా మారుతొందని తెలిపారు. సమస్య తీవ్రతను ప్రభుత్వ సలహాదారుడు, రాజ్యసభ ఎంపి వెం నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చి వివరించారు. ఇందుకు వారు స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పూలే పోరాట ప్రస్థానం... బిసి చరిత్రలో చెరగని అధ్యాయం

ప్రజాపక్షం/కొత్తూరు: పూలే పోరాట ప్రస్థానం బిసి చరిత్రలోనే చెరగని అధ్యాయంగా మిగిలిపోయిందని..వారి ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకువెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ బిసి జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప అన్నారు. బుధవారం కొత్తూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మహనీయుల పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయ సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ సమాజానికి విద్య, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అందించేందుకు తమ జీవితాలనే ఉద్యమాలుగా మలిచారని గుర్తు చేశారు. పూలే దంపతుల నుండి మండల్ వరకు సాగిన ఈ పోరాట ప్రస్థానం బిసి చరిత్రలో చెరగని అధ్యాయంగా నిలిచిందని పేర్కొన్నారు. మహాత్మాజ్యోతిరావు పూలే కుల వివక్షకు వ్యతిరేకంగా, బహుజన విద్యకోసం ఉద్యమిస్తే సావిత్రిబాయి పూలే మహిళా విద్యకు మార్గదర్శకంగా నిలిచారని వివరించారు. మహనీయుల త్యాగాలను కేవలం సంస్మరణకే పరిమితం కాకుండా వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ప్రత్యామ్నాయంపై జలమండలి దృష్టి

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : వేసవిలో తాగునీటి సరఫరాను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మహానగరానికి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జలమండలి ముందస్తు చర్యలను ముమ్మరం చేస్తోంది. ముఖ్యంగా నగరానికి ప్రధాన జలవనరులైన సింగూరుమంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ జలవనరుల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించింది.ఇందులో భాగంగా జలమండలి ఎండి కె.అశోక్‌రెడ్డి బుధవారం ఉన్నతాధికారుల బృందంతో కలిసి గండిపేట్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి నగరానికి అదనపు తాగునీటిని సరఫరా చేసే సాధ్యాసాధ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మైనార్టీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది

మహమూద్ అలీ

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలను విస్మరించి, వారి సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ, విమర్శించారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు బుధవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్ అహ్మద్, నాయకులు ఆజం అలీ, అర్షద్ అలీఖాన్, నియాజీ తదితరులు ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో మైనార్టీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాధాన్యత లభించిందని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని రంగాల్లో మైనార్టీలు నష్టపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన మైనారిటీ డిక్లరేషన్‌ను మూడేళ్ల పాలనలో ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మైనార్టీడిక్లరేషన్ అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.



డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : ఐటీ కారిడార్‌లో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం చిత్రపురి సొసైటీని సందర్శించి, ఐటీ కారిడార్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రతిపాదనను పరిశీలించారు. ఈ సందర్భంగా చిత్రపురి సొసైటీ ప్రతినిధులు సిఎండి పర్యటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతిపాదిత విద్యుత్ అభివృద్ధి పనుల అమలుకు తమ సంపూర్ణ సహకారం, మద్దతు అందిస్తామని తెలిపారు.



కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. విద్యార్థుల భవిష్యత్తు అంధకారం

తెలంగాణ తెలుగుదేశం పార్టీ మండిపాటు

ప్రజాపక్షం/ముషీరాబాద్ : ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతోపైవేట్ సంస్థలు సర్టిఫికెట్లు నిలిపివేయడంతో లక్షలాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల్ల కిషోర్ నగర పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ప్రభుత్వం స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడితో పాటు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. మీడియా సమావేశంలో మాజీ కార్పొరేటర్ పి.బాల్‌రాజ్ గౌడ్, భవాని శ్రీనివాస్, భానుప్రకాష్, వైఎల్ నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'నృత్య సమాగమ్'



ప్రజాపక్షం/రవీంద్రభారతి : ఒడిస్సీ, కూచిపూడి, కథక్, భరతనాట్యం, పేరిణి నృత్య ప్రదర్శనలు ఒకే వేదికపై భారతీయ కళావైభవాన్ని ఆవిష్కరించాయి. భువనేశ్వర్‌కు చెందిన నృత్యధామ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'నృత్య సమాగమ్ ఫెస్టివ్ – 2026' అంగరంగవైభవంగా సాగింది. ముఖ్యఅతిథులుగా పద్మశ్రీ డాక్టర్ అరుణా మొహంతీ (ఒడిస్సీ) ,కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత గురు ప్రొఫెసర్ డాక్టర్ భాగవతుల సేతురాం (కూచిపూడి), కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత గురు డాక్టర్ రాజేశ్వరి సైనాథ్ (భరత నాట్యం), నృత్యధామ్ కార్యదర్శి డాక్టర్ సుభశ్రీ పట్నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణా మొహంతీకి ప్రతిభషోత్మక 'నృత్య సమాగమ్' లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు – 2026'ప్రదానం చేసి,ఘనంగా సత్కరించారు. అరుణా మొహంతీ,సుభశ్రీ పట్నాయక్ ప్రదర్శించిన ఒడిస్సీ నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకొన్నాయి.

కొత్తగూడెం సహాయక చర్యల్లో ధైర్యసాహసాలు

63 మంది అగ్నిమాపక సిబ్బందికి డిజి సత్కారం



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రాణాలకు తెగించి ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడమే లక్ష్యంగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించిన 63మంది అగ్నిమాపక శాఖ సిబ్బందికి ఉన్నతాధికారుల నుంచి అరుదైన గుర్తింపు లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు వద్ద ఈనెల 4న రాత్రి నిర్వహించిన సహాయక చర్యల్లో చూపిన తెగువ, అంకితభావానికి గుర్తింపుగా తెలంగాణ అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్‌సింగ్ మాన్ వారిని ఘనంగా సత్కరించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయకుండా సహాయక చర్యల్లో పాల్గొని విలువైన ప్రాణాలను కాపాడేందుకు కృషి చేసిన 63 మంది సిబ్బందిని డిజి తన కార్యాలయానికి ఆహ్వానించారు. వారి సేవలను ప్రశంసిస్తూ నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సిబ్బంది ధైర్యసాహసాలు, నిస్వార్థ సేవలకు తగిన గుర్తింపు కల్పించేలా ప్రభుత్వానికి సిఫారసు నివేదికలు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డిజి మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది వృత్తి నైపుణ్యం, సమష్టి కృషి, ప్రజాసేవ పట్ల అంకితభావం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, సహాయక చర్యల సమయంలో వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ముఖ్యంగా ప్రాణాపాయ పరిస్థితుల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు సైతం సిబ్బంది ప్రదర్శించిన తెగువ, సమన్వయం, సేవాభావాన్ని అభినందించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం అగ్నిమాపక సిబ్బంది చేస్తున్న నిస్వార్థ సేవలకు ఈ సత్కారం నిదర్శనంగా నిలిచింది.

ప్రతి లైన్‌మెన్ డ్రోన్ వినియోగించాలి

టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించుకోవాలని.. డ్రోన్ టెక్నాలజీని కేవలం ఇంజినీర్లకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి లైన్‌మెన్‌తో సహా సిబ్బంది అందరూ వినియోగించుకునేలా ప్రోత్సహించాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ పిలుపునిచ్చారు. టిజిఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో అర్రిసోల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, గోగ్ సర్వీసెస్ సంస్థల సహకారంతో నిర్వహించిన మూడు రోజుల డ్రోన్ పైలెట్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని శిక్షణ పొందిన 50 మంది అధికారులు, ఉద్యోగులకు ధృవీకరణ పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ, సాధారణంగా ఒక లైన్‌మెన్ నిచ్చెన సహాయంతో విద్యుత్ లైన్లపై ఉన్న ఇన్సులేషన్‌ను తనిఖీ చేసేందుకు ఎక్కువ సమయం పడుతుందని, ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం కూడా కష్టమవుతుందన్నారు. డ్రోన్ల సహాయంతో ఇన్సులేషన్ పరిస్థితిని సులభంగా పరిశీలించడంతో పాటు, కేబుళ్లపై బలహీనమైన ప్రాంతాలు, సమస్యాత్మక పాయింట్లను గుర్తించవచ్చని తెలిపారు. సబ్‌స్టేషన్‌లను కూడా పైభాగం నుంచి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించే అవకాశం ఉంటుందని వివరించారు. డ్రోన్ పైలట్లను మరింత ప్రోత్సహించేందుకు పోలీసు, పారాట్రూపర్ విభాగాల్లో ఉన్నట్లుగా ప్రత్యేక గుర్తింపు బ్యాడ్జీలను అందించే ఆలోచన ఉందని, వారు నిర్వహించే డ్రోన్ ఫ్లయిట్ల సంఖ్య ఆధారంగా ప్రోత్సాహకాలు కల్పిస్తామని తెలిపారు. డ్రోన్లను సమర్థంగా వినియోగించే సిబ్బందికి ప్రత్యేక అవార్డులు అందించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించే ఆధునిక విద్యుత్ పంపిణీ సంస్థగా ఎస్‌పిడిసిఎల్ ఎదగాలని, ప్రతి ఒక్కరూ ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం



ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్ : ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉస్మానియా ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఏడాది మధుమేహంపై ముందస్తు చర్యలు అనే ఇతివృత్తంతో జరిగిన కార్యక్రమంలో వ్యాధి ముందస్తు పరీక్షలు, సకాలంలో రోగ నిర్ధారణ, సమర్థవంతమైన నిర్వహణ ప్రాముఖ్యతపై వైద్య నిపుణులు విస్తృతంగా చర్చించారు. కార్యక్రమంలో ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ నీలవేణి, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రంగలక్ష్మి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గురురాజ్, ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ రేష్మా, డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ ఆయేషా పాల్గొన్నారు.



మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం అని హైదరాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతో పాటు, స్వతంత్ర్య భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఆయన చేసి విశేషమైనదన్నారు. విద్య ప్రాధాన్యతను సమాజ నిర్మాణంలో దాని కీలకపాత్రను జాతీయ విద్యాదినోత్సవం గుర్తు చేసే సందర్భమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పెకాన్స్ కుకింగ్ క్లాస్

ప్రజాపక్షం/బంజారాహిల్స్ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో అమెరికన్ పెకాన్స్ కౌన్సిల్ సహకారంతో పవర్ ఆఫ్ పెకాన్స్ పేరుతో ప్రత్యేక వంటకాల మాస్టర్ క్లాస్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ సెలబ్రిటీ చెఫ్ అజయ్ చోప్రా, స్కూల్ ఫర్ యూరోపియన్ పేస్ట్రీ సహ వ్యవస్థాపకుడు చెఫ్ అనిల్ రోహిరా, ప్రముఖ చెఫ్, రచయిత, విద్యావేత్త డాక్టర్ చెఫ్ పర్వీందర్ సింగ్ బాలి, అంతర్జాతీయ వంటకాలలో ప్రత్యేక గుర్తింపు పొందిన చెఫ్ విక్కీ రత్నాని తదితరులు పాల్గొన్నారు.

సదర్‌లో పాల్గొనడం ఆనందం

కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : యాదవ సోదరులతో కలిసి సదర్ ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉన్నదని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి గాంధీ కుటీర్‌లో డోల్కి సందీప్ యాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలు నిర్వహించారు. బిజెపి ఒబిసి మోర్చా నగర ప్రధాన కార్యదర్శి ఎస్.అభిషేక్ యాదవ్ ఆహ్వానం మేరకు జి.కిషన్‌రెడ్డితో పాటు ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపి దా.కె.లక్ష్మణ్, నగర అధ్యక్షులు లంకెల దీపక్ రెడ్డి, బిఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సి.కృష్ణ యాదవ్, బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి తుళ్ల వీరేందర్ గౌడ్ తదితర నేతలు,ప్రముఖులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దున్నల నృత్య ప్రదర్శనలను తిలకించి, ఆనందం వ్యక్తంచేశారు. దున్నలు యాదవుల కీర్తి ప్రతిష్ఠలకు ప్రతీకలుగా వారు అభివర్ణించారు.



నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్




ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ : విద్యుత్ పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించాలని టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించడం జరిగింది. పిటిఆర్ వైఫల్యాలకు కారణాలను విశ్లేషించి, డిసెంబర్ నెలాఖరులోగా నివారణ చర్యలు పూర్తి చేయాలని.. జనవరి 1,2027 నుంచి నిర్లక్ష్యం కారణంగా జరిగే వైఫల్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఆపరేషన్ సర్కిళ్ల నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భద్రత దృష్ట్యా ప్రతి గ్రామంలోని గృహ విద్యుత్ సరఫరా పిటిఆర్ వద్ద ఎబి స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, ఈ పనులను డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని సూచించారు. పిటిఆర్‌ల రవాణాకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన పరిహారంలో జాప్యం ఉండకూడదన్నారు.



విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం

నారాయణ స్కూల్స్‌లో ఘనంగా 'మాస్టర్ ఆరేటర్ సీజన్ 7'

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : విద్యార్థుల్లో భావవ్యక్తీకరణ, వక్తృత్వ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా నారాయణ స్కూల్స్ ఆధ్వర్యంలో 'మాస్టర్ ఆరేటర్ కాంటెస్ట్ సీజన్ 7'ను ఘనంగా నిర్వహించారు. లైఫ్ స్కిల్స్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 9వ తరగతి వరకు రెండు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి విభాగంలో 2,600 మందికి పైగా పాల్గొనగా, 84 మంది గ్రాండ్ ఫినాలేకు ఎంపికయ్యారు. వీరిలో 18 మంది విజేతలుగా నిలిచారు. రెండో విభాగంలో ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలోని 12 బ్రాంచ్‌ల నుంచి 3,500 మందికి పైగా విద్యార్థులు పోటీపడగా, ఫైనల్స్‌కు చేరిన 96 మందిలో 34 మంది విజేతలుగా నిలిచారు. ఇంటర్నెట్ లేని జీవితం, పాఠ్యపుణాళికలో కళలుసంగీతం ప్రాముఖ్యత, మెరుగైన పాఠశాల కోసం నా ఆలోచనలు, చిన్న మార్పులతో పెద్ద ఫలితాలు, గ్లోబలైజేషన్ వంటి అంశాలపై విద్యార్థులు ప్రసంగించారు. ప్రసంగాల్లోని విషయ పరిజ్ఞానం, సృజనాత్మకత, ప్రదర్శన, కమ్యూనికేషన్ నైపుణ్యాల ఆధారంగా న్యాయనిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ మాట్లాడుతూ మాస్టర్ ఆరేటర్ పోటీలు కేవలం ప్రసంగ పోటీలు మాత్రమే కాదని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, స్పష్టమైన భావవ్యక్తీకరణను పెంపొందించే వేదిక అని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను నిర్భయంగా వ్యక్తం చేస్తూ, వేదికపై ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలన్నదే తమ లక్ష్యమన్నారు. విజేతలతో పాటు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు యాజమాన్యం అభినందనలు తెలిపింది.



అట్టహాసంగా సదర్ సంబురం

ప్రజాపక్షం/కాచిగూడ: సదర్ సంబురాలు అంబరాన్నంటాయి. నారాయణగూడలోని వైఎంసిఎ చౌరస్తా సదర్ సమ్మేళనానికి వేదికైంది. ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతులు సదర్ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాల్లో గడ్డం సందీప్ యాదవ్, పొనబోయిన నరేందర్ యాదవ్, నేతుల దుర్గాయాదవ్, కె.మురళియాదవ్, నేతుల చేతన్ యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

ప్రజాపక్షం/కార్వాన్ : వీర్ అభిమన్యు కల్చరల్ అసోసియేషన్ సబ్జిమండి స్వాంతన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధునిక డేటా అనలిటిక్స్, ఎఐ ఉద్యోగ అవకాశాలపై ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, పవర్ బిఐ,ఎన్‌క్యూఎల్,ఆల్‌టూల్స్, మెడికల్ కోడింగ్ తదితర అంశాలు ప్రత్యేకంగా బోధించనున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఉద్యోగాల్లో పోటీని ఎదుర్కోవాలంటే ఆధునిక నైపుణ్యం తప్పనిసరిగా మారిందని... మా సంస్థ పేద, మధ్య తరగతి యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ కోర్సును అందిస్తోందని తెలిపారు. వివరాలకు సెల్: 8688914603 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.



బిసిల అభివృద్ధికి రాజ్యాధికారమే లక్ష్యం

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : సమగ్రాభివృద్ధికి ఏ ప్రభుత్వాలపై ఆధారపడకుండా విద్యావంతులై ప్రత్యేక రాజకీయాల్లో పాల్గొని తమ వాటాను దక్కించుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు సూచించారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్ బిసి ఇంటిలెక్చువల్స్ ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్, బిసి కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కామారెడ్డి హామీలు దగాపడ్డ బిసిలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా టి.చిరంజీవులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీలను ఏ విధంగా తుంగలో తొక్కారో గణాంకాలతో సహా వివరించారు. సమావేశంలో ఆల్ ఇండియా బహుజన్ సమాజ్ పార్టీ కన్వీనర్, మాజీ డిజిపి పూర్ణచందర్‌రావు, మాజీ ఐఎఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్, బిసి కులాల ఐక్యవేదిక చైర్మన్ చిన్నరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



బిజెఆర్ డిగ్రీ కాలేజీకి ప్రథమ అవార్డు

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : బాబూ జగ్జీవన్ రామ్ (బిజెఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) నారాయణగూడకు చెందిన వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఇ.ఎం.సునీత నేతృత్వంలోని బృందం, సిసిఇ తెలంగాణ నిర్వహించిన ప్రతిష్టాత్మక జిజ్ఞాస ప్రాజెక్టులో ప్రథమ బహుమతి సాధించింది. '' ప్లాంట్ బేస్డ్ బయోడిగ్రెడబుల్ హైడ్రోజెల్స్ – ఎ ప్రామిసింగ్ సొల్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ అర్బన్ ఫార్మింగ్ అండ్ వాటర్ కన్జర్వేషన్'' అనే వినూత్న పరిశోధన ప్రాజెక్టుకు లభించిన అవార్డును ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ వారికి ప్రదానం చేశారు. నీటి సంరక్షణ, నేలలో తేమ నిల్వ స్థిరమైన పట్టణ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ఈ పరిశోధన ప్రధాన లక్ష్యమని ప్రొఫెసర్ సునీత పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎం.విజయకుమార్ అందించిన ప్రోత్సాహం, సహకారం,మార్గదర్శకత్వం వల్లే తమ పరిశోధనకు అవార్డు దక్కిందని పేర్కొన్నారు.

రామాలయం విరాళాల చోరీ...

అన్ని రికార్డులు బహిర్గతం చేయాలి

• బాధ్యత నుంచి ఎవరికీ మినహాయింపు ఉండొద్దు
• విచారణ పరిధి విస్తరించి, దోషులైన వారిపై చర్యలు తీసుకోవాలి: కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: రామమందిర విరాళాల చోరీ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై దాడిని మరింత పెంచింది. అన్ని ఆర్థిక రికార్డులను బహిర్గతం చేయాలని, విచారణ పరిధిని విస్తరించాలని, దోషులుగా తేలిన ప్రతి ఒక్కరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనకు సంబంధించి కేవలం అరెస్టు అయిన ఎనిమిది మంది ఉద్యోగులకే బాధ్యతను పరిమితం చేయకూడదని, ఆలయ నిర్మాణం, నిర్వహణ, విరాళాల స్వీకరణలో బాధ్యత వహించే ప్రతి ఒక్కరి పాత్రపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని ప్రతిపక్ష పార్టీ పేర్కొంది. ఈ కేసులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), బిజెపి, విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) నేతల పాత్రపైనా విచారణ జరగాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా హిందీలో పోస్టు చేశారు. 'ఆలయ విరాళాల లెక్కల్లో అవకతవకలు జరుగుతున్నాయని 2021లోనే అప్పటి ఖాతాల అధికారి మహిపాల్ సింగ్ గుర్తించి, ట్రస్టు ప్రతినిధులు చంపత్ రాయ్, గోపాల్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు మీడియా కథనాలు చెబుతున్నాయి. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి బదులుగా ఫిర్యాదు చేసిన అధికారినే విధుల నుంచి తొలగించారు. ఇంతకుముందే అక్రమాల సమాచారం అందినప్పుడు ట్రస్టు ప్రతినిధుల పాత్రపై ఎందుకు విచారణ జరగలేదు. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల వివరణ, దర్యాప్తు సంస్థల నిర్ధారణ ఇంకా కీలకం. ఆలయ నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఇంజినీర్ దినానాథ్ వర్మ కూడా ట్రస్టు కార్యాలయంలో పనుల కోసం 40 శాతం కమీషన్ అడిగారు. దీనికి సంబంధించిన ఆడియో రికార్డింగ్‌ను చంపత్ రాయ్‌కు



వినిపించిన తర్వాత తననే ప్రాజెక్టు నుంచి తొలగించారని వర్మ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఆ ఆరోపణలపై చంపత్ రాయ్ నేరుగా విచారించారా? అక్రమాల గురించి ముందే తెలిసి ఉంటే ఆయనతో పాటు అనిల్ మిశ్రా, గోపాల్ రావులను నిందితులుగా కాకుండా సాక్షులుగా ఛార్జిషీట్‌లో ఎందుకు చేర్చారు' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

నిందితులకు ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలు

విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులుగా ఉన్న కొందరికి ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్‌తో సంబంధాలున్నాయని జైరాం రమేశ్ ఆరోపించారు. అనుకల్ప్ మిశ్రాకు ఈ సంస్థలతో అనుబంధం ఉందని మీడియా కథనాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. 2026 ఏప్రిల్ 30న ఆయన నిర్వహించిన భాగవత కథా కార్యక్రమానికి చంపత్ రాయ్ హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. అలాగే విరాళాల లెక్కింపు సిబ్బంది బాధ్యతలు చూసిన సుభాష్ శ్రీవాస్తవ తన ఇంట్లో ఆర్ఎస్ఎస్ శాఖ నిర్వహించేవారని ఆరోపించారు. విరాళాల పెట్టెల తాళాలను అనధికార వ్యక్తులకు అప్పగించిన వ్యవహారంలో ఆయన పాత్ర ఉందని సిట్ గుర్తించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయని తెలిపారు. మరో నిందితుడు టిన్నూ యాదవ్ చంపత్ రాయ్ వద్ద డ్రైవర్‌గా పనిచేసినట్లు ఆరోపణలున్నాయని చెప్పారు. అర్చకుల నియామకానికి ప్రకటనలు ఇచ్చి, ఎంపిక కమిటీలు ఏర్పాటు చేసిన ట్రస్టు, కోట్లాది రూపాయల విరాళాల లెక్కింపు బాధ్యతలను మాత్రం ఎలాంటి ప్రకటనలు, ఇంటర్వ్యూలు నిర్వహించలేదని విమర్శించారు. సన్నిహితులకు ఉద్యోగాలు ఇచ్చిన వారిని కూడా విచారణ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 2020 ఫిబ్రవరి 5న లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఏర్పాటును ప్రకటించిన విషయాన్ని జైరాం రమేశ్ గుర్తుచేశారు. ట్రస్టు సభ్యుల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలు, నిర్ణయాల ప్రక్రియను ప్రజలకు వెల్లడించలేదని విమర్శించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన కార్యక్రమాల్లో ప్రధాని మోదీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రచారానికి ప్రాధాన్యమిచ్చారని, విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై మాత్రం మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ట్రస్టు విజ్ఞప్తి మేరకే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసిందని ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభలో ముఖ్యమంత్రి చెప్పిన విషయాన్నీ ప్రస్తావించారు. అయితే తొలి సిట్ నివేదిక ట్రస్టు ప్రతినిధులకే అందిందని, ప్రజలకు మాత్రం ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు.

పెద్దనోట్ల రద్దు ప్రక్రియ

అవినీతి మయం

• బిజెపి సర్కార్‌పై ఎస్‌పి అధినేత అఖిలేశ్ తీవ్ర విమర్శలు
• దేశం మళ్లీ 1947 స్వాతంత్ర్య కాలం నాటి ఆర్థిక స్థితికి పడిపోయిందని మండిపాటు

లక్నో : పెద్ద నోట్లు రద్దయి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ తీవ్ర విమర్శలు చేశారు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) ప్రక్రియను బిజెపి ఒక 'అవినీతి సముద్రం'గా మార్చిందని ఆరోపించారు. 2016లో తీసుకున్న ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థను వెనక్కి నెట్టేసిందని, గత దశాబ్ద కాలంగా ఇది 'నెమ్మదిగా పనిచేసే విషం'లా మారిందని ఆయన పేర్కొన్నారు. బుధవారం లక్నోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలేశ్ మాట్లాడారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మారుస్తామన్న బిజెపి వాదనపై చర్చకు రావాలని ఆయన సవాలు విసిరారు. పెద్ద నోట్ల రద్దు ప్రభావం వల్ల దేశం మళ్లీ 1947 స్వాతంత్ర్య కాలం నాటి ఆర్థిక స్థితికి పడిపోయిందని మండిపడ్డారు. బహుశా, ప్రపంచంలో ఎక్కడా జరగనంత భారీ అవినీతి, భారత్‌లో బిజెపి హయాంలో పెద్ద నోట్ల రద్దు పేరుతో జరిగిందని యాదవ్ వ్యాఖ్యానించారు. బ్యాంకులను దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపిస్తూ దీనిని ఆర్థిక చరిత్రలోనే అత్యంత అవినీతిపూరిత నిర్ణయాల్లో ఒకటి గా అభివర్ణించారు. నిజం చెప్పాలంటే, బిజెపి తీసుకున్న ఈ నిర్ణయం ఒక అవినీతి సముద్రంగా మారింది అని ఆయన అన్నారు. పెద్ద నోట్ల రద్దు ద్వారా ఆశించిన లక్ష్యాలేవీ నెరవేరలేదన్నారు. 'రైతులు, కూలీలు, మధ్యతరగతి ప్రజలు, వేతన జీవులు, వృత్తి నిపుణులు, చిన్న దుకాణదారులు, వ్యాపారులు, వీధి వ్యాపారులు, చిన్న తరహా పరిశ్రమలు నడిపేవారందరూ పెద్ద నోట్ల రద్దు వల్ల బాధితులయ్యారు. వారు ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు' అని అఖిలేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత అనేక కర్మాగారాలు మూతపడ్డాయని, ఆ తర్వాత ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలు ఉన్నప్పటికీ అవి తిరిగి తెరవలేదని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత పేర్కొన్నారు. రూ. 2,000 నోటు ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ, అదే సమయంలో 'ఖజాంచీ' అనే బాలుడు జన్మించాడని అఖిలేష్ యాదవ్ ప్రస్తావించారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఖజాంచీ కూడా హాజరయ్యాడు. పెద్ద నోట్ల రద్దు ప్రకటన తర్వాత, తన తల్లి కరెన్సీ నోట్లను మార్చుకోవడానికి బ్యాంకుకు వెళ్లినప్పుడు, 2016 నవంబర్‌లో ఖజాంచీ జన్మించాడు. అఖిలేష్ యాదవ్ ఆ బాలుడికి 'ఖజాంచీ' అని పేరు పెట్టారు. అప్పటి నుండి, పెద్ద నోట్ల రద్దు విషయంలో బిజెపిని విమర్శించేటప్పుడు సమాజ్‌వాదీ పార్టీ తరచుగా ఖజాంచీ పుట్టినరోజులను జరుపుకోవడం, అతని కథను ప్రస్తావించడం చేస్తూ వస్తోంది. ఖజాంచీ తన పుట్టినరోజును యాదవ్, ఇతర పార్టీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో జరుపుకున్నారు. 'ఆ సమయంలో, నోట్లలో చిప్ ఉందని కూడా చెప్పారు. అప్పుడే 2,000 రూపాయల నోటును ప్రవేశపెట్టారు. మరి ఆ 2,000 రూపాయల నోటు ఏమైంది?' అని యాదవ్ ప్రశ్నించారు. నోట్ల రద్దు తర్వాత నగదు చలామణి 70 శాతం పెరిగిందని పేర్కొన్న యాదవ్, అసలు ఈ చర్య వెనుక ఉన్న ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. 'బిజెపి బ్యాంకింగ్ వ్యవస్థను వడ్డీ వ్యాపారుల కంటే ప్రమాదకరంగా మార్చేసింది. బ్యాంకులో మీకు ఖాతా ఉన్నప్పటికీ, అదే బ్యాంకు మీకు నష్టాలను కలిగిస్తోంది' అని ఆయన ఆరోపించారు. ఖాతాదారులపై బ్యాంకులు జరిమానాలు విధిస్తున్నాయని, ఖాతాల నుండి డబ్బు కోత విధిస్తున్నాయని, అంతేకాకుండా బిజెపి పాలనలో బ్యాంకు లాకర్లు కూడా సురక్షితంగా లేవని ఆయన విమర్శించారు.



విమానంలో

హైజాక్ లేఖ కలకలం

కోల్‌కతా : ఎయిర్ ఇండియా విమానంలో హైజాక్ లేఖ కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం ముంబయికి బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా విమానంలోని వాష్ రూమ్‌లో విమానాన్ని హైజాక్ చేస్తామని పేర్కొన్న ఒక లేఖ లభించింది. దీంతో అప్రమత్తమైన భద్రతా అధికారులు, విమానాన్ని విమానాశ్రయంలోని ప్రత్యేక సురక్షిత ప్రాంతానికి (ఐసోలేషన్ బే) తరలించారని ఒక అధికారి తెలిపారు. ఈ విమానం ఉదయం 10:20 గంటలకు బయలుదేరాల్సి ఉంది. అయితే బయలుదేరడానికి కొద్ది సేపటి ముందు, ఉదయం 11:10 గంటలకు విమానాన్ని హైజాక్ చేస్తామని హెచ్చరిస్తూ రాసి ఉన్న ఒక లేఖ వాష్ రూమ్‌లో దొరికిందని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయ డైరెక్టర్ విక్రమ్ సింగ్ చెప్పారు. విమానంలో ఉన్న మొత్తం 105 మంది ప్రయాణికులను కిందకు దించి, విమానాన్ని ఐసోలేషన్ బేకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా విమానం (ఎఐ 2772)లోని వాష్‌రూమ్‌లో ఈ లేఖను క్యాబిన్ సిబ్బంది ఉదయం 10:37 గంటలకు గుర్తించారని, ఈ లేఖ దొరికే సమయానికి విమానంలో 105 మంది ప్రయాణికులు ఉన్నారని, సంబంధిత భద్రతా సంస్థలు తనిఖీలను చేపట్టాయి అని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ఇంకా ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

ఢిల్లీలో కాలుష్యానికి బాణసంచానే కారణం



• ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ అంచనా

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో దీపావళికి గ్రీన్ బాణసంచా మాత్రమే వాడాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసినప్పటికీ, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారు. దీంతో కాలుష్యం విపరీతంగా పెరిగింది. ఢిల్లీ వాయు కాలుష్యానికి సోమవారం, మంగళవారం రెండు రోజులూ బాణసంచానే ప్రధాన కారణంగా నిలిచిందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటిఎం) అంచనా వేసింది. మొత్తం కాలుష్య భారంలో ఇది వరుసగా 71.1 శాతం, 29.8 శాతం వాటాను కలిగి ఉంది. ఐఐటిఎం నమూనాల ప్రకారం.. దీపావళి మరుసటి రోజైన సోమవారం నగర కాలుష్య స్థాయిలలో బాణసంచా వాటా గణనీయంగా ఉండి, మంగళవారం నాటికి తగ్గింది. ఈ అంచనాలలో సోమవారం నాడు 104.1 శాతం పాయింట్లు, మంగళవారం నాడు 27.7 శాతం పాయింట్ల ప్రామాణిక విచలనం (ఎస్‌డి) ఉంది. ఇది నమూనాలలో చూపిన వాటాలలో గణనీయమైన వైవిధ్యం, అనిశ్చితిని సూచిస్తుంది. సోమవారం నాడు, వాహనాల నుండి వెలువడే ఉద్గారాలు 6.9 శాతం కాలుష్యానికి కారణం కాగా, ఆ తర్వాత ద్వితీయ అకర్బన ఏరోసోల్స్ 5 శాతం, ద్వితీయ కర్బన ఏరోసోల్స్ 4.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. మిశ్రమ లేదా అపరిష్కృత జీవ ఇంధనం 4.4 శాతం వాటాను అందించగా, ఖనిజ ధూళి, బూడిద, మిశ్రమ దహనం చెరో 2.5 శాతం వాటాను కలిగి ఉన్నాయి. కట్టెల దహనం 1.3 శాతం వాటాను అందించగా, పురపాలక, ప్లాస్టిక్‌ర బ్బరు కలిగిన వ్యర్థాలతో సహా వ్యర్థాలను కాల్చడం 1.1 శాతం వాటాను కలిగి ఉంది. బొగ్గు దహనం, పారిశ్రామిక ఉద్గారాలు వరుసగా 0.5 శాతం, 0.2 శాతం వాటాను అందించాయి. మంగళవారం నాడు, బాణసంచా వాటా 29.8 శాతానికి తగ్గగా, సెకండరీ ఆర్గానిక్ ఏరోసోల్స్ 17.5 శాతంతో రెండవ అతిపెద్ద కారకంగా నిలిచాయి. వాహన ఉద్గారాలు, సెకండరీ ఇనార్గానిక్ ఏరోసోల్స్ చెరో 11.7 శాతం కాలుష్య భారాన్ని కలిగి ఉండగా, కట్టెల దహనం 10.7 శాతం, వ్యర్థాల దహనం 7.7 శాతం వాటాను అందించాయి. మంగళవారం నాడు వాహన ఉద్గారాలు కాలుష్యానికి మూడవ అతిపెద్ద కారకంగా నిలిచాయి. మిశ్రమ దహనం 5.1 శాతంగా, ఆ తర్వాత మిశ్రమ లేదా పరిష్కారం కాని జీవ ఇంధనం 3.3 శాతంగా, ఖనిజ ధూళి, బూడిద 1.5 శాతంగా ఉన్నాయి. మంగళవారం నాడు ఢిల్లీలో సగటు 24 గంటల గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) స్వల్పంగా మెరుగుపడి 'పేలవమైన' వర్గంలోకి చేరింది. సాయంత్రం 4 గంటల సమయానికి ఇది 299 వద్ద నమోదైంది. అయితే, బుధవారం నాటికి గాలి నాణ్యత మళ్లీ క్షీణించడంతో, ఎక్యూఐ విలువ 312కి పెరిగి చాలా పేలవమైన వర్గంలోకి చేరింది. 201 నుండి 300 మధ్య ఉండే ఎక్యూఐ విలువను పేలవమైనదిగా, 301 నుండి 400 మధ్య ఉండే విలువను చాలా పేలవమైనదిగా వర్గీకరిస్తారు.

ప్రతీస్థాయిలోనూ మాఫియా పాలనే!

• బిహార్ ఆర్థిక అస్తవ్యస్తత, పరిపాలనాపరమైన దుర్వినియోగంలో కూరుకుపోయింది : తేజస్వీ యాదవ్

పాట్నా : బిహార్‌లోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఆర్‌జెడి నాయకుడు తేజస్వీ యాదవ్ విరుచుకుపడ్డారు. మాఫియా తన ప్రభావాన్ని పెంచుకోవడానికి అవకాశం ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్రం ఆర్థిక అస్తవ్యస్తత, పరిపాలనాపరమైన దుర్వినియోగంలో కూరుకుపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అవినీతి, క్షీణిస్తున్న శాంతిభద్రతలు, పేలవమైన పాలన అనేవి లోతుగా పాతుకుపోయిన వ్యవస్థాగత సమస్యలుగా మారాయని, ఇవి సమాజంలోని ప్రతి వర్గాన్ని, అన్ని సంస్థలను ప్రభావితం చేస్తున్నాయని బుధవారం తేజస్వీ ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ప్రతి స్థాయిలో మాఫియా పాలన రాజ్యమేలుతోంది. నేరగాళ్లు పోలీసులను చంపుతుంటే, పోలీసు సిబ్బంది తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి అమాయక పౌరులను చంపడం కంటే దురదృష్టకరమైనది ఏముంటుంది?' అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. ఆయనకు పరిపాలనా నైపుణ్యం, అనుభవం లేకపోవడం, అసమర్థ నాయకత్వం కారణంగా పోలీసులు, అధికార యంత్రాంగం వాస్తవంగా జవాబుదారీతనం లేకుండా పోయాయన్నారు. ఉన్నతాధికారులు ముఖ్యమంత్రిని సీరియస్‌గా తీసుకోవడం లేదని, ప్రజా సంక్షేమం, ఉపాధి, నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, శాంతిభద్రతలు, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం వంటివి ఆయన ప్రాధాన్యతలలో లేవని యాదవ్ ఆరోపించారు. ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సాంకేతికత, పెట్టుబడులు, ఉపాధి కల్పన వంటివి వెనకబడిపోయాయని ఆయన ఆరోపించారు. అవినీతి అన్ని హద్దులు దాటిందని, పాలన వాస్తవంగా కుప్పకూలిందని పేర్కొంటూ, అధికారంలో ఉన్నవారు 'ఓట్ల దొంగతనం' ద్వారా పదవిని దక్కించుకుంటున్నారని ఆరోపించారు. బిహార్‌ను 'నాశనం వైపు' నెట్టడానికే ఎన్‌డిఎ రాష్ట్ర పగ్గాలను ఒక 'నామినేటెడ్ ముఖ్యమంత్రి'కి అప్పగించిందా అని యాదవ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



17, 18 తేదీలలో అమెరికాలో...

ప్రపంచ విద్యార్థి ఉద్యమాలపై రాహుల్ 'ఫైర్‌సైడ్ చాట్స్'

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రాహుల్‌గాంధీ వచ్చేవారం తన అమెరికా పర్యటన సందర్భంగా కొలంబియా, చికాగో విశ్వవిద్యాలయాల్లో వరుసగా ప్రపంచ విద్యార్థి ఉద్యమాలు, భౌగోళిక రాజకీయాలపై 'ఫైర్‌సైడ్ చాట్'లు నిర్వహిస్తారని ఇండియన్ ఓవర్‌సీస్ కాంగ్రెస్ చీఫ్ సామ్ పిట్రోడా బుధవారం తెలిపారు. గతంలో, రాహుల్‌గాంధీ విదేశాలలో భారతదేశాన్ని అప్రదిష్టపాలు చేశారని బిజెపి పదేపదే చేస్తున్న దాడిని ఖండించిన సామ్ పిట్రోడా అది ఒక 'నిరాధారమైన' వాదన అని కొట్టిపారేశారు. ఎందుకంటే, 'ఇది ఎవరినీ విమర్శించే ప్రశ్నకాదు. మీరు చూసిన వాస్తవాలను చూపించే ప్రశ్న' అని వివరించారు. చికాగో నుంచి 'పిటిఐ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో సామ్ పిట్రోడా మాట్లాడుతూ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీప్రధానంగా చాలాకాలం క్రితమే ప్రణాళిక వేసుకున్న రెండు ముఖ్యమైన కార్యక్రమాల కోసం అమెరికా వస్తున్నారని చెప్పారు.'ఒకటి కొలంబియా విశ్వవిద్యాలయంలో జరుగబోయే ఫైర్‌సైడ్ చాట్. ఇది ప్రధానంగా ప్రపంచ వ్యాప్త విద్యార్థి ఉద్యమం యొక్క పెరుగుదల దాని అర్థం. భారతదేశంలో దానిని ఎలా చూస్తున్నారు?. ప్రజాస్వామ్యంపై దాని ప్రభావం, విద్య, ఉపాధి,ఆర్థిక వ్యవస్థ, పర్యావరణంపై వారి డిమాండ్ల గురించి చర్చిస్తుంది. నవంబరు 17వ తేదీన విశ్వవిద్యాలయంలో జరుగబోయే ఫైర్‌సైడ్ చాట్. ఇది సరైన సమయంలో ప్రచారం చేస్తారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను'.నవంబరు 18న చికాగో విశ్వవిద్యాలయంలో జరగనున్న రెండవ సమావేశంలో భౌగోళిక రాజకీయ రంగంలో సుప్రసిద్ధుడైన ప్రముఖ ప్రొఫెసర్ డాక్టర్ (రాబర్ట్) పేప్ పాల్గొంటారు. మధ్య ప్రాచ్యం, ఇరాన్ యుద్ధం వంటి అంశాలపై ఆయనకు చాలా విశాలమైన దృక్పథం ఉంది. కాబట్టి, ఆ రెండవ సంభాషణ ప్రధానంగా భౌగోళిక రాజకీయాలు, ప్రపంచ వ్యవహారాలపై ఉంటుంది' అని సామ్ పిట్రోడా 'పిటిఐ'కి తెలిపారు.

ఏ క్షణంలోనైనా సునేత్రా ఎన్‌సిపిలో చీలిక

• 22 మంది ఎమ్మెల్యేలు వైదొలగే అవకాశం
• సంజయ్ రౌత్ వెల్లడి



ముంబయి: సునేత్రాఅజిత్ పవార్ నాయకత్వంలో ఉన్న ఎన్.సి.పిలో చీలిక వచ్చే అవకాశం ఉందని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ చెప్పారు. బుధవారం ఆయన ముంబయిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, 20 లేదా 22 మంది శాసనసభ్యులు ఏ క్షణంలోనైనా ఎన్‌సిపిని వదిలి వెళ్ళే అవకాశాలు ఉన్నాయని అన్నారు. బిజెపి నాయకత్వంలోని అధికార మహాయుతి కూటమితో జత కట్టిన తర్వాత ఎన్‌సిపి ఎమ్మెల్యేలు బానిసలుగా మారిపోయారని విమర్శించారు. వారంతా ఎస్‌సిపి(ఎస్‌పి) నాయకుడు శరద్ పవార్‌తో సంభాషణలు చేస్తున్నారని, ఈ సంభాషణలు, సంప్రదింపుల వెనుక చాలా పెద్ద తతంగమే ఉందని అన్నారు. ఎన్నికలకంటే ముందుగా వారు వేరే పార్టీలో చేరే అవకాశాలు ఉంటాయన్నారు. ఐతే వారు సొంతపార్టీ అంటే శరత్ పవార్ పార్టీలోకి తిరిగి వెళ్ళే అవకాశం లేదన్నారు. ఈ ప్రక్రియ విలీనం మాత్రం కాదన్నారు. 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపికి 41 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. శరద్ పవార్,అజిత్ పవార్ మధ్య పార్టీ కోర్టు తీర్పు తర్వాత రెండుగా విడిపోయింది. ఎన్‌సిపి టైటిల్ అజిత్ పవార్‌కే దక్కింది. ఆయన ఈ ఏడాది జనవరిలో విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత ఆయన సతీమణి సునేత్రా ఈ పార్టీకి నాయకత్వం వహించి అధికార మహాయుతి కూటమిలో ఉపముఖ్యమంత్రి పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

మంగళవారంనాడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఒక ప్రకటన చేస్తూ, బిజెపితో సంప్రదింపులు చేయకుండా ఎన్‌సిపిని విలీనం చేసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ విలీనం శరద్ పవార్ నాయకత్వంలో ఉన్న ఎన్‌సిపి(ఎస్‌పి)కి వర్తించే అవకాశం లేదని సంజయ్ రౌత్ చెప్పారు.

గోకుల్ డెయిరీలో గెలుపు ప్రజాస్వామ్య ద్రోహం

కొల్హాపూర్ గోకుల్ డెయిరీకి జరిగిన ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి మోసంతో గెలిచిందని సంజయ్ రౌత్ విమర్శించారు. ఈ ఎన్నికల మోసాన్ని ప్రజాస్వామ్య ద్రోహంగా పేర్కొన్నారు. ఎన్‌సిపి నాయకుడు రాజేశ్ పాటిల్ గోకుల్ డెయిరీ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఐతే ఆయన ఒక్క సంవత్సరం మాత్రమే ఆ పదవిలో కొనసాగుతారు. వంతులవారీగా ఈ పదవిని మహాయుతి కూటమి పంచుకుంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో 25 స్థానాలు ఉండగా, కాంగ్రెస్‌కు 13 స్థానాలు, బిజెపి కూటమికి 12 స్థానాలు రావడంతో అడ్డదారిలో ఒక ఆర్డినెన్స్ జారీ చేసి నలుగురు నామినేటెడ్ డైరెక్టర్ పదవులను సృష్టించడం ద్వారా బిజెపి గోకుల్ డెయిరీ ఛైర్మన్ పదవి గెలుచుకుందని రౌత్ విమర్శించారు. ప్రజాస్వామ్య బద్ధమైన ఓటింగ్ హక్కులను ప్రభుత్వం కాలరాసిందని విమర్శిస్తూ, రాజకీయాలలో అన్ని రోజులూ ఒకేవిధంగా ఉండబోవని హెచ్చరించారు. ఎంఎల్‌సి సతేజ్ పాటిల్ ప్యానల్ నుండి బిజెపి కూటమి విజయాన్ని బలవంతంగా లాగేసుకుందని విమర్శించారు.తాను గోకుల్ డెయిరీకి మాత్రమే మద్దతు ఇస్తున్నానని,వ్యక్తులకు కాదని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ చేసిన వ్యాఖ్యలను రౌత్ ప్రస్తావిస్తూ, అలా అయితే ముఖ్యమంత్రి ఎందుకు ఒక ఆర్డినెన్స్ ద్వారా నామినేటెడ్ పదవులు సృష్టించారని ప్రశ్నించారు. అలా మధ్యేవాదిగా ఉన్నప్పుడు నామినేటెడ్ పదవులు సృష్టించకూడదని అన్నారు.

పాలసీ రూపకల్పన కోసం డేటా...

సకాలంలో విశ్వసనీయంగా, ఆమోదయోగ్యంగా ఉండాలి

పిఎం ముఖ్య కార్యదర్శి పికె.మిశ్రా పిలుపు



న్యూఢిల్లీ : వాతావరణ మార్పు, వ్యవసాయ స్థితిస్థాపకత, ఆహార భద్రత, పోషణ వంటి పరస్పరం ముడిపడి ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి శాస్త్రీయపరిశోధన, సూక్ష్మమైన సమాచారం, సాక్ష్యాధారిత విధాన రూపకల్పనను మరింత బలంగా ఏకీకృతం చేయాలని ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి పికె.మిశ్రా బుధవారం పిలుపునిచ్చారు. ఐఐఎం కోజికోడ్‌లో వర్చువల్‌గా జరిగిన ఎన్విరాన్‌మెంట్ ఫర్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ (ఇఎఫ్‌డి) 20వ వార్షికోత్సవ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, కేవలం ఎక్కువ డేటాను సృష్టించడమే కాకుండా, ఆ సమాచారం సకాలంలో కేవలం పర్యావరణ సమస్యగా మాత్రమే చూడకూడదని, దాని ప్రభావాలు, వ్యవసాయ ఉత్పాదకత, నీటి లభ్యత, ఆహార ధరలు, ప్రజారోగ్యం, జీవనోపాధుల వరకు విస్తరించి ఉన్నాయని ఆయన అన్నారు. వాతావరణ మార్పు, వ్యవసాయ స్థితిస్థాపకత, ఆహార భద్రత, పోషణ వంటి పరస్పరం ముడిపడి ఉన్న సవాళ్లను పరిష్కరించడానికి శాస్త్రీయ పరిశోధన, సూక్ష్మమైన డేటా, సాక్ష్యాధారిత విధాన రూపకల్పనను మరింత బలంగా ఏకీకృతం చేయాలని మిశ్రా పిలుపునిచ్చారని ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఆహార భద్రతకు సంబంధించిన సాంప్రదాయ కొలమానాలను అధిగమించాల్సిన అవసరాలను నొక్కిచెబుతూ, కేవలం తగినంత ఆహార ఉత్పత్తి మాత్రమే సరిపోదని మిశ్రా గమనించారు. వాతావరణ సంబంధిత అంతరాయాలు, పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, ఇతర పోషకాలు అధికంగా ఉండే ఆహార లభ్యతను అందుబాటు ధరలను ప్రభావితం చేయగలవు కాబట్టి, అందుబాటు ధరలలో, వైవిధ్యభరితంగా, పోషకమైన ఆహార పదార్థాలు లభించేలా చూడటం కూడా అంతే ముఖ్యమని ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి పికె. మిశ్రా అన్నారు. పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్న చొరవను మిశ్రా ప్రముఖంగా ప్రస్తావించారు.ఈ చొరవ, చిరుధాన్యాల పోషక విలువ, పర్యావరణ సుస్థిరతపై ప్రపంచ దృష్టిని ఆకర్షించడంతోపాటు, వైవిధ్యభరితమైన, పటిష్ఠమైన ఆహారవ్యవస్థలలో భాగంగా వాటిని విస్తృతంగా స్వీకరించడాన్ని 'ప్రాంత–నిర్దిష్ట వాతావరణ అనుసరణ'వైపు మారాలని మిశ్రా పిలుపునిచ్చారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసిఎఆర్) వారి వాతావరణ–స్థితిస్థాపక వ్యవసాయంలో 'జాతీయ ఆవిష్కరణల' కార్యక్రమం కింద జరిపిన అంచనాలలో, 651 వ్యవసాయ జిల్లాలలో, 310 జిల్లాలు అత్యంత అధికంగా ప్రభావితం అయ్యే అవకాశం ఉన్నట్లు గుర్తించారని ఆయన నొక్కిచెప్పారు. వర్షపాతం, నీటి లభ్యత, నేల పరిస్థితులు, పంట దిగుబడి, పోషకాహార ఫలితాలలో తేడాను గుర్తించడానికి , జిల్లా స్థాయి విశ్లేషణ డేటాను మరింత ఎక్కువగా ఉపయోగించాలని ఆయన పిలుపునిచ్చారు. 2031–2035 సంవత్సరాలకుగాను భారతదేశం నవీకరించబడిన జాతీయ నిర్ధారిత సహకారం దాని వాతావరణ లక్ష్యాన్ని మరింత బలోపేతం చేసిందని మిశ్రా తెలిపారు.

పట్టాలు తప్పిన కోల్‌కతా–సాయిరాంగ్ ఎక్స్‌ప్రెస్

గువాహటి : అసోంలో ఓ రైలు పట్టాలు తప్పింది. గువాహటి సమీపంలోని దిగారు వద్ద కోల్‌కతా–సాయిరాంగ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన ఐదు బోగీలు, ఇంజన్ పట్టాలు తప్పడంతో నలుగురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఘటనపై సోషల్ మీడియా వేదికగా స్పందించిన ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వశర్మ ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయని, వారికి చికిత్స అందుతోందని, పరిస్థితిపై తాము రైల్ మంత్రిత్వ శాఖతో కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ప్రయాణానికి అంతరాయం కలిగిన ప్రయాణికులందరికీ అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించామని చెప్పారు. వారి ప్రయాణం కొనసాగేలా ప్రత్యామ్నాయ రైలును ఏర్పాటు చేశామన్నారు. గాయపడిన నలుగురిని సోనాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎవరికీ తీవ్ర గాయాలు కాలేదని ఈశాన్య సరిహద్దు రైల్వే ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతా– సాయిరాంగ్ ఎక్స్‌ప్రెస్ కామరూప్ (మెట్రోపాలిటన్) జిల్లాలోని దిగారు రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశిస్తున్నప్పుడు ఈ ప్రమాదం జరిగిందని, లోకో పైలట్ మరొక రైలుకు దారి ఇచ్చే క్రమంలో వేగాన్ని నియంత్రించలేకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని ఆయన అంతకుముందు వివరించారు. దీనివల్ల రైలు ఇంజన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పాయని ఆ ప్రతినిధి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది. అందులో లోకో పైలట్ ఇంజన్‌లోని పరికరాలను ఆపరేట్ చేయడానికి ప్రయత్నిస్తూ, ఏ పరికరమూ పనిచేయడం లేదని చెబుతున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఈ వీడియో ఎంతవరకు నిజమో ధృవీకరణ కాలేదు. ఉదయం సుమారు 6.54 గంటలకు రైలు పట్టాలు తప్పిందని మరో అధికారి తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో, గువాహటి నుంచి జోర్హాట్‌కు వెళ్లే జనశతాబ్ది ఎక్స్‌ప్రెస్, కోయంబత్తూరు–సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వరుసగా పాన్‌బారి, పానిఖైతి ప్రాంతాల్లో నిలిపి ఉంచారు. అలీపుర్‌దువార్‌మరియాని ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును కామాఖ్య స్టేషన్ వద్దే నిలిపివేశామని, గువాహటి– హైబర్‌గావ్ డిఎంయు రైలును రద్దు చేశామని అధికారి తెలిపారు.

దేశంలోనే 'క్లీనెస్ట్ సిటీ' నవీ ముంబయి

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వార్షిక స్వచ్ఛతా సర్వేలో నవీ ముంబయి దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ జాబితాలో సూరత్ రెండో స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు ఈ స్వచ్ఛతా పురస్కారాలను ప్రదానం చేశారు. 10 లక్షల పైబడిన జనాభా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన గ్రేటర్ విశాఖపట్నం (జివిఎంసి) దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా మొదటి స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో వైజాగ్ తర్వాతి స్థానాల్లో జబల్‌పూర్, లక్నో వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. 3 నుంచి 10 లక్షల జనాభా విభాగంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిన్ తొలి స్థానం దక్కించుకోగా, చండీగఢ్ రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు మూడో స్థానంలో నిలిచి సత్తా చాటాయి. గత 8 సంవత్సరాలుగా వరుసగా దేశంలోనే క్లీనెస్ట్ సిటీగా అగ్రస్థానంలో నిలుస్తూ వచ్చిన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ ఈ ఏడాది టాపర్ల జాబితాలో చోటు దక్కించుకోకపోవడం గమనార్హం.

కాంగ్రెస్‌లో హెగ్సెత్‌పై అభిశంసన విఫలం

ఇది దేశభక్తుడి నిర్దోషిత్వం: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా కాంగ్రెస్ అనుమతి లేకుండా రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ యుద్ధాలు చేస్తున్నారంటూ ప్రవేశపెట్టిన బిల్లును రిపబ్లికన్లు, కొందరు డెమోక్రాట్లు కూడా అడ్డుకున్నారు. దీంతో ప్రస్తుతానికి ఈ బిల్లు ఆమోదం పొందకుండా విఫలమైపోయింది. కెంటకీకి చెందిన రిపబ్లికన్‌పార్టీలో అసమ్మతి సభ్యుడు థామస్ మాస్సీ ఈ బిల్లును కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టి సంచలనం సృష్టించారు. ఈ అభిశంసన తీర్మానాన్ని ఒక జ్యుడీషియరీ హౌస్ కమిటీ పరిశీలనకు పంపాలని మెజార్టీ సభ్యుడు కాంగ్రెస్‌లో ఓటు వేయడంతో హెగ్సెత్‌కు గండం గట్టెక్కింది. ఒక్క మాస్సీ తప్ప రిపబ్లికన్లు అందరూ ఈ బిల్లును హౌస్ కమిటీ పరిశీలనకు పంపాలని కోరుతూ అనుకూల ఓటు వేశారు. దీంతో 211–204 ఓట్ల తేడాతో ఈ బిల్లు వీగిపోయింది. డజనుకు పైగా డెమోక్రాట్లు ఓటింగ్‌కు హాజరుకాలేదు. ఇంకా అనేకమంది డెమోక్రాట్లు కూడా సభకు రాలేకపోవడాన్ని ట్రాఫిక్ సమస్యను ఒక సాకుగా చూపించారు.
గడచిన ఆరునెలల్లో మొదటిసారి పెంటగాన్‌లో హెగ్సెత్ మంగళవారం పత్రికాగోష్ఠి నిర్వహించి, ఈ అభిశంసన బిల్లును ఒక ప్రహసనంగా కొట్టిపారేశారు. ఈ బిల్లును''దేశభక్తి కాదు, దేశద్రోహం''అని అభివర్ణించారు. రక్షణ మంత్రి దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ పరవేశపెట్టిన ఈ బిల్లును ఆమోదించాలంటే మరికొంతమందిరిపబ్లికన్ సభ్యులు కూడా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను ధిక్కరించాల్సి ఉంటుంది. ఇది చాలా కష్టమైన విషయం. అందువల్ల ఈ విషయంలో చాలామంది రాజీపడ్డారని భావిస్తున్నారు.
కాగా, ప్రతిపాదిత అభిశంసన బిల్లు విఫలం కావడంతో ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, ఇరాన్, వెనిజులా దేశాలలో విజయాలు ఒక దేశభక్తుడి నిర్దోషిత్వానికి ఇది ప్రతీక అని పేర్కొన్నారు. ఈ ప్రయత్నంఅతి ఘోరంగా విఫలమైందని హర్షం వ్యక్తం చేశారు. ఇంతకుముందు ఈ బిల్లు ప్రతిపాదించిన రిపబ్లికన్ సభ్యుడు థామస్ మాస్సీ స్పందిస్తూ, ఇదిలా జరుగుతుందని తనకు ముందుగానే తెలుసునన్నారు. కాంగ్రెస్‌కు ఏం చేయాలో తెలుసునని, కానీ వారు అందుకు ఇష్టపడటం లేదని అన్నారు. తాను దిగ్భ్రాంతి చెందలేదుగానీ, నిరాశపడ్డానన్నారు.

సార్వత్రిక సమ్మెతో స్తంభించిన స్పెయిన్

- జీతాలు, గృహాలు, ధరలపై దృష్టి: వామపక్షాల డిమాండ్
- వీధుల్లో లక్షలమంది కార్మికుల ప్రదర్శన
- హౌసింగ్ సంక్షోభానికి పరిష్కారం చెప్పాలని నినాదాలు



బార్సిలోనా: స్పెయిన్‌లో నెలకున్న గృహసంక్షోభం కారణంగా 14 సంవత్సరాల తర్వాత మళ్ళీ మొదటిసారి బుధవారంనాడు సార్వత్రిక సమ్మె జరిగింది. లక్షలమంది కార్మికులు దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి ప్రదర్శనల్లో పాల్గొన్నారు. జీతాలు, గృహాలు, ధరలు(తగ్గింపు) అనే మూడు అంశాలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని డిమాండ్ చేస్తూ వామపక్షాలు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి. దేశంలో నెలకున్న హౌసింగ్ సంక్షోభానికి ప్రభుత్వం పరిష్కారం చెప్పాలని కార్మికులు నిలదీశారు. దేశంలో ఉన్న యుజిటి, సిసిఓఓ అనే రెండు ప్రధాన యూనియన్లు ఈ సమ్మెకు పిలుపు ఇచ్చాయి. కీలక రంగాలలో పనులన్నీ స్తంభించిపోయాయి.ఆటోమోటివ్‌రంగంలో 90 శాతం మేరకు కార్యకలాపాలు స్తంభించాయి. నౌకారంగంలో కూడా అదేస్థాయిలో కార్యకలాపాలను కార్మికులు స్తంభింపజేశారు. దేశంలో ఉన్న 85 శాతం మాంసం ఉత్పత్తి పరిశ్రమ, వ్యర్థాల సేకరణ వ్యవస్థలో 82 శాతం,ఇంధన రంగంవ్యవస్థలో 75 శాతం మేరకు స్తంభించాయి. మొత్తంగా చూస్తే, కార్మికులకు, రాజకీయ వ్యవస్థకు, ఇతర కార్యకర్తలకు, సాధారణ స్పానిష్ పౌరులకు, వివిధ సామాజిక గ్రూపులకు ఎవరి కారణాలతో వారు బుధవారం జరిగిన ఈ సార్వత్రిక సమ్మెకు పూర్తి మద్దతు తెలియజేశారు. గడచిన పది సంవత్సరాలలో ఇళ్ళ అద్దెలు రెట్టింపుస్థాయిలో పెరిగిపోయాయి. కుటుంబాల సంపాదనలో భారీ మొత్తం ఇళ్ళ అద్దెలకే వెళ్ళిపోవడంతో వారు తిన దానికి ఏమీ మిగలడంలేదనే తీవ్ర ఆందోళన ప్రతి ఒక్కరిలో ఉంది. గతనెలలో మాడ్రిడ్ నగరంలో 87 ఏళ్ళు వయసుగల ఒక వృద్ధురాలిని ఇంటి అద్దె చెల్లించలేదని బలవంతంగా ఇంట్లోంచి బయటకు గెంటివేసిన సంఘటన స్పెయిన్ దేశవ్యాప్తంగా ప్రజలకు తీవ్ర ఆగ్రహం రప్పించింది. ఆ తర్వాత మారి కార్మెన్ అనే మహిళ అద్దె ఇంట్లో మరణించింది. ప్రజలు తమ సొంత ఇంటి కల నెరవేర్చుకోలేని దుర్భర పరిస్థితులు తలెత్తాయనే భావోద్వేగం సర్వత్రా వ్యాపించింది. అప్పటినుండీ స్పెయిన్‌లో ఇళ్ళ సమస్య పరిష్కరించాలని కోరుతూ మెల్లిగా చిన్న ఆందోళన ప్రారంభమై అది క్రమంగాదేశవ్యాప్తంగా విస్తరించి పెద్ద ఉద్యమంగా మారింది. పర్యాటక అపార్ట్‌మెంట్ల తొలగింపు, రియల్ ఎస్టేట్ స్పెక్యులేషన్స్‌పై కఠిన చర్యలు, లీజులను అద్దెదారులే పునరుద్ధరించడం ద్వారా రక్షణ చర్యలు ఇవ్వాలని నిరసన ప్రదర్శకులు కోరుతున్నారు.
ఈ సమ్మె కారణంగా ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. వ్యాపారాలు నిలిచిపోయాయి. కర్మాగారాలు, దుకాలు ఆగిపోయాయి. రహదారుల స్తంభన, అనేక ప్రాంతాలలో టైర్లను రోడ్లకు అడ్డంగా పడేసి దగ్ధం చేయడం వంటి చిన్న చిన్న ఘటనలు జరిగాయి. పోలీసులు, ప్రదర్శకులమధ్య అక్కడక్కడ ఘర్షణలు చెలరేగాయి. దేశంలోని ప్రధాన హోల్‌సేల్ మార్కెట్ వద్ద ప్రదర్శకులకు, పోలీస్‌లకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. పలుచోట్ల సమ్మెలో పాల్గొన్న కార్మికులు బాణసంచా పేల్చారు. బార్సిలోనాలో అర్థరాత్రి కార్మికులు గుమిగూడి వీధుల్లో బాణసంచా పేలుళ్ళకు పాల్పడ్డారు.

కాంగోలో.. ఎబోలా మృత్యుఘోష



బునియా: డి.ఆర్.కాంగోలో ఎబోలాకు సంబంధించిన సరికొత్త బుండిబుగ్యో వైరస్ మృ త్యుతాండవం చేస్తోంది. నవబరు పదో తేదీన విడుదల చేసిన నివేదిక ప్రకారం కాంగోలో ఎబోలా మృతుల సంఖ్య 5,387కు చేరుకుంది.అదనంగా మరో 11,000 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధి పొరుగుదేశాలకు కూడా వ్యాపిస్తోంది. ఈ వ్యాధి ఈ విధంగా విజృంభించడం కాంగో చరిత్రలో ఇది రెండోసారి. 2014–16 మధ్యకాలంలో కూడా ఇదేవిధంగా ఎబోలా వ్యాధి మృత్యుతాండవం చేసింది. ఆనాడు 28,600 మంది ఈ వైరస్ బారినపడి మరణించారు. కాంగోలో ఈ వ్యాధి ప్రబలినట్లు ఈ ఏడాది మే 15వ తేదీన అధికారికంగా ప్రకటించారు. అప్పటినుండీ మృతులసంఖ్య పెరుగుతోంది. పరిశుభ్రత పాటించకపోవడం, శ zవాలను దూరంగా ఉం చకపోవడం వంటివి పెద్ద సమస్యగా మారాయి.కాంగోలోని 26 రాష్ట్రాలలో ఈ వ్యాధి ప్రబలింది.

భారత్ వ్యతిరేక అల్లర్లలో 'ఉగ్ర'పాత్ర ఉందా?

విచారణ కోరుతూ రాష్ట్రపతికి బ్రిటన్ ప్రవాస సంఘాల లేఖ



లండన్: ఇటీవలి వారాల్లో జరిగిన భారత్ వ్యతిరేక నిరసన ప్రదర్శనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బ్రిటన్‌లో ఉన్న 50 ప్రవాస భారతీయ సంఘాలు,సామాజిక సంస్థలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఒక లేఖ రాశాయి.భారత్ వ్యతిరేక అల్లర్ల వెనుక ఉగ్రవాద చర్యలు లేదా, పాకిస్థాన్, ఖలిస్థానీ, బంగ్లాదేశీ ఇస్లామిస్టుల భాగస్వామ్యం ఏదైనా ఉందా? అనే కోణంలో విచారణ చేయాలని ఈ యాభై సంఘాలు రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశాయి. అసమ్మతిని తెలియజేయడం ప్రజాస్వామ్యబద్ధమైన హక్కుఅనీ, కానీ రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే విధంగా,మత విభజనలు రెచ్చగొట్టేవిధంగా ప్రోత్సహించేందుకు అల్లర్లు చేయడం ప్రమాదకరమని పేర్కొన్నాయి.హిందూ కమ్యూనిటీ ఆర్గనైజేషన్స్ గ్రూప్,ఇండియన్ దయాస్పోరా ఇన్ ద యుకె, ఫ్రెండ్స్ ఆఫ్ ఇండియా సొసైటీ యుకె ,ఇండియన్ నేషనల్ స్టూడెంట్స్ అసోసియేషన్ యూకె ద్రౌపదీముర్ముకు ఈ లేఖ రాశాయి.ముఖ్యంగా లండన్‌లో ఉన్న భారత్ హైకమిషన్ కార్యాలయం ఎదుట జరిగిన నిరసనలను ప్రముఖంగా ప్రస్తావించింది. అక్టోబరు 16వ తేదీన స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో భారత్ హైకమిషన్ ఎదురుగా పెద్ద ధర్నా, నిరసన ప్రదర్శన జరిగిందని, అక్టోబరు 17న పార్లమెంటు స్క్వేర్ ఎదుట మరో నిరసన ప్రదర్శన జరిగిందని తెలియజేసింది. ఈ ప్రదర్శనలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సెర్ ధ్రువ్‌రాతీ ప్రసంగించారని ఆ సంఘాలు రాష్ట్రపతికి తెలియజేశాయి. ఈ ప్రదర్శనల వెనుక ఉగ్రవాదులు లేదా చట్టవిరుద్ధమైన శక్తుల ప్రమేయం, వాటి సమన్వయం ఉందా? అనే విషయాన్ని పరిశీలించాలని ఈ ప్రవాస సంఘాలు కోరాయి.శాంతియుత నిరసనలు,చట్టబద్ధమైన అసమ్మతి ఏ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా అవసరమని,కానీ ఈ అసమ్మతి మాత్రం మతపరమైన విభజనకు, హింసను ప్రోత్సహించడానికి దోహదం చేయకూడదని ఈ సంఘాలు ఆ లేఖలో పేర్కొన్నాయి. జాతీయ బాధ్యత దృష్ట్యా ఈ విజ్ఞప్తి చేస్తున్నట్లు ఈ ప్రవాస సంఘాలు పేర్కొన్నాయి.

ఉక్రేన్‌పై త్రైపాక్షిక చర్చలు

అబుధాబి: రష్యా–ఉక్రేన్ మధ్య పరస్పర దాడుల నేపథ్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో అమెరికా మధ్యవర్తిగా రెండోరోజు బుధవారం కూడా త్రైపాక్షిక చర్చలు జరిగాయి. గడచిన తొమ్మిది నెలల్లో మొదటిసారి ఈ రెండు దేశాల ప్రతినిధులు చర్చల బల్ల ఎదురుబదురూ కుదురుగా కూర్చున్ని మాట్లాడుకున్నారు. అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతినిధుల సమక్షంగా ఈ చర్చలు జరిగాయి. ఈ మొదటి సమావేశంలో బ్రహ్మాండమైన పురోగతి సాధించగలరన్న ఆశలు ఏ పక్షానికీ లేవు. కానీ అమెరికాతరపున ఈ చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు మాత్రం, శాంతి యత్నాలను పునరుద్ధరిస్తామనే కృత నిశ్చయంతో ఉన్నట్లు విశ్వాసం ప్రకటించారు. ట్రంప్ తరపున స్టీవ్‌విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్ ఈ చర్చల్లో మధ్యవర్తులుగా పాల్గొన్నారు.''మొదటి రోజు మంగళవారంనాడు రష్యా–ఉక్రేన్ దేశాల ప్రతినిధులు ఒకే బల్లకు ఇరు వైపులా ఎదురెదురుగా కూర్చుని నాలుగు గంటలసేపు మాట్లాడుకున్నారు. గతంలో ఈ మాత్రం సమావేశాన్ని కూడా పుతిన్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఐతే ఈ చర్చల్లో గణనీయమైన ఫలితాల సాధనలో ఇరుపక్షాలు విఫలమయ్యాయి. కాగా నాటో, యూరోపియన్ యూనియన్ సభ్యులు అబుధాబిలో ఉక్రేన్ ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జెనీవాలో ఈ రెండు దేశాలమధ్యా ఒక సమావేశం జరిగింది. ఆ తర్వాత సంప్రదింపుల్లో మార్పులు సంభవించాయి. కాంగ్రెస్ ఉభయసభలను డెమోక్రాట్లు స్వాధీనం చేసుకున్నందువల్ల ఉక్రేన్‌కు మరింత మద్దతు ఇవ్వాలని వారు ట్రంప్‌ను డిమాండ్‌చేసే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోవాలి. ఐతే మరోవైపు పరస్పర దాడులు కూడా కొనసాగాయి. తమ దేశంలోని పలు లక్ష్యాలపై వందల డ్రోన్లు, క్షిపణులను ఉక్రేన్ ప్రయోగించిందని, దాదాపు 150కి పైగా డ్రోన్లను కూల్చివేశామని రష్యా రక్షణవ్యవస్థ ప్రకటించింది. ఇదిలా ఉండగా,ఏళ్ళ తరబడి కొనసాగుతున్న ఉక్రేన్–రష్యా యుద్ధం ముగించేందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఈ యుద్ధానికి శాశ్వత పరిష్కారం సాధించాలని ట్రంప్ ప్రతిపాదన చేస్తుండగా, భవిష్యత్ ఒప్పందాల కారణంగా యూరప్‌లో రాబోయే కాలంలో రష్యాతో సంబంధాలు ప్రమాదకరమైనవని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వాదిస్తున్నారు.

ఇటలీలో 300 స్కూళ్ళకు నకిలీ బాంబు బెదిరింపులు

రోమ్: ఇటలీలో ఒక్కసారిగా 300 పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇటలీ విద్యాశాఖామంత్రి గియుసెప్పె వల్డిటారా బుధవారం ఈ విషయం గురించి మాట్లాడుతూ, బహుశా ఇవి నిజమైన బెదిరింపులు కాదని, సైబర్ దాడులు కావచ్చునని సందేహంవ్యక్తం చేశారు. యూరప్‌వ్యాప్తంగా ఇటీవలికాలంలో సూపర్ మార్కెట్లు,విమానాశ్రయాలు, విమానాలు,ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని ఇటీవలికాలంలో జరుగుతున్న బెదిరింపులు వెనుక ఒక స్పష్టమైన వ్యూహం ఉందని వల్డిటారా ఇటాలియన్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఇటలీలోని అనేక ప్రధాన నగరాలలో ఉన్న పాఠశాలలకు ఇ–మెయిల్స్ ద్వారా ఈ బాంబు బెదిరింపులు రావడంతో ప్రధానమంత్రి జార్జియా మెలోనీ మంత్రులు, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. దేశంలో భయాందోళనలు సృష్టించడంకోసమే ఈ బాంబు బెదిరింపులు వస్తున్నాయని మంత్రి చెప్పారు.

ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నూతన భవనాల ప్రారంభం

ఒకేరోజు 2,216 భవనాలను ప్రారంభించనున్న ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక కార్యక్రమానికి సిద్ధమైంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 2,216 నూతన భవనాలను ప్రారంభించనుంది. ఉపాధిహామీ పథ కం నిధులతో నిర్మించిన ఈ భవనాలు గ్రామీణ పాలన, మహిళా సంఘాల కార్యకలాపాలు, చిన్నారుల సంక్షేమానికి ఉపయోగపడనున్నాయి.ప్రారంభించనున్న భవనాల్లో 599 గ్రామ పంచాయతీ భవనాలు, 1,399 మహిళా సంఘాల భవనాలు, 184 అంగన్‌వాడీ భవనాలు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు, మహిళా సంఘాలకు ప్రత్యేక కార్యాలయాలు, అంగన్‌వాడీలకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన భవనాల్లో మిగిలి న ఫినిషింగ్ పనులను వేగంగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించా రు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

రూ.7 కోట్ల పెట్టుబడి మోసం

శ్రీ ఫిన్‌టెక్‌పై కేసు నమోదు

- డాక్టర్, కుటుంబ సభ్యుల నుంచి భారీగా పెట్టుబడులు సేకరించినట్లు ఆరోపణలు
- అధిక లాభాలు, వ్యక్తిగత హామీలతో నమ్మించి వసూళ్లు
- పది మందిపై కేసు.. దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్ పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్: అధిక లాభాలు వస్తాయంటూ పెట్టుబడుల పేరుతో ఓ వైద్యుడు, ఆయన కుటుంబ సభ్యుల నుంచి సుమారు రూ.7 కోట్లు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసం చేశారన్న ఆరోపణలపై సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీ వర్స్ , శ్రీ ఫిన్‌టెక్ ఇండియా ఎల్‌ఎల్‌పి, వాటి అనుబంధ వ్యాపారాలు, యాప్‌ల పేరుతో ఈ మోసం జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన యుక్తా ఆసుపత్రుల కన్సల్టెంట్ వైద్యుడు డాక్టర్ పొట్టభత్తిని పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితుడికి 2019 నుంచి పరిచయమున్న చిలగాని సంపత్ కుమారస్వామి 2023 ఆగస్టులో బషీర్‌బాగ్‌లోని ఆర్‌కె అసోసియేట్స్ కార్యాలయానికి పిలిచి శ్రీ వర్స్ పెట్టుబడి పథకాన్ని పరిచయం చేశారు. శ్రీహైప్‌మార్ట్, శ్రీట్రాడెక్స్, శ్రీ క్లబ్ సర్కిల్ వంటి అనుబంధ వ్యాపారాలు, యాప్‌ల ద్వారా ప్రతిరోజూ అధిక ఆదాయం వస్తుందని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెట్టుబడికి వ్యక్తిగత హామీ ఇస్తానని సంపత్ చెప్పడంతో పాటు బాండ్ పేపర్లపై ఒప్పందాలు చేసి, తిరిగి చెల్లింపునకు చెక్కులు కూడా ఇచ్చినట్లు బాధితుడు తెలిపారు. మొదటగా 2023 సెప్టెంబర్‌లో సుమారు రూ.1.20 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు, ఆ తర్వాత కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి నిధులు సమకూర్చి మొత్తం రూ.3.50 కోట్ల వరకు పెట్టినట్లు ఫిర్యాదులో వివరించారు. మొదట్లో సుమారు రూ.80 లక్షలు తిరిగి చెల్లించడంతో నమ్మకం పెరిగిందని, ఆ తర్వాత మరిన్ని నిధులు సమకూర్చాలని ఒత్తిడి చేసినట్లు ఆరోపించారు. అప్పులు చేయడం, స్థలాలు, ఇల్లు విక్రయించడం, భార్య బంగారు ఆభరణాలు అమ్మడం ద్వారా కూడా డబ్బు సమకూర్చినట్లు పేర్కొన్నారు.
2024 జనవరిలో దుబాయ్‌కు తీసుకెళ్లి సంస్థకు చెందిన వారిగా పరిచయం చేసిన అక్షయ్ పటేల్, ముక్తి ధమన్‌వాలాను కలిపించారని, అక్కడ శ్రీ కాయిన్ పేరుతో డిజిటల్ టోకెన్ల వినియోగం, అధిక లాభాల గురించి వివరించి మరింత పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించారని ఫిర్యాదుదారు ఆరోపించారు. అదనంగా రూ.5 కోట్లు పెట్టుబడి పెడితే డైమండ్ ర్యాంక్ వస్తుందని, తాత్కాలికంగా సమకూర్చే నిధులను 45 రోజుల్లో తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం మరో రూ.3.50 కోట్ల వరకు వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం పెట్టుబడి సుమారు రూ.7 కోట్లకు చేరిందని తెలిపారు. 2024 ఏప్రిల్, మే నెలల నుంచి లాభాలు, అసలు తిరిగి ఇవ్వాలని కోరగా సాఫ్ట్‌వేర్ సమస్యలు, సాంకేతిక లోపాలు తదితర కారణాలు చెబుతూ కాలయాపన చేశారని బాధితుడు ఆరోపించారు. శ్రీ కాయిన్ టోకెన్లను తిరిగి కొనుగోలు చేసి నగదు చెల్లిస్తామన్న హామీని కూడా నెరవేర్చలేదని పేర్కొన్నారు. అనంతరం సూరత్, అహ్మదాబాద్‌లలో జరిగిన సమావేశాల్లో మూడు నెలల్లో విడతలవారీగా డబ్బు చెల్లిస్తామని రాతపూర్వక హామీ ఇచ్చినా, గడువు ముగిసిన తర్వాత కూడా చెల్లింపులు జరగలేదని ఫిర్యాదులో తెలిపారు. చివరకు కొందరు తన ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసి స్పందించడం మానేశారని ఆరోపించారు.

నాణ్యమైన విద్య

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలనే సంకల్పంతో విద్యారంగంలో పటిష్టమైన పునాదులు వేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ ప్రారంభించిన 'యంగ్ ఇండియా' పత్రిక స్ఫూర్తితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆంగ్ల మాధ్యమ బోధన, ఆధునిక సదుపాయాలు, విద్యార్థులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్యను అందించి సమానత్వం, సామాజిక సమైక్యత, సోదరభావం పెంపొందించేలా ఈ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని వెల్లడించారు.అదేవిధంగా ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందించే ఈ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ విద్యాబోధన, ఆధునిక తరగతి గదులు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులను ప్రభుత్వ రవాణా సదుపాయంతో తిరిగి వారి ఇళ్లకు చేర్చుతామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు.తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందించి భవిష్యత్తులో ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా చేయడమే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, శాసనమండలి సభ్యులు బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, ఎండి అయూబ్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, టిజిఎన్‌పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, పోలీస్ కమిషనర్ శ్వేత, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

10+2 అమలు

(మొదటి పేజీ తరువాయి)

సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడకుండా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ల్యాండ్‌స్కేపింగ్, ఇంటీరియర్స్, డిజిటల్, క్రీడా పరికరాలు, కిచెన్ సామగ్రి కోసం అత్యుత్తమ సంస్థలను ఎంపిక చేయాలన్నారు. క్యూర్ పరిధిలో నిర్మిస్తున్న పాఠశాలల పురోగతిని కూడా ఈ సందర్భంగా సిఎం సమీక్షించారు.ఐటీఐలను అడ్వాన్స్‌డ ట్రైనింగ్ సెంటర్లుగా మార్చిన తర్వాత విద్యార్థుల నమోదు పెరగడంతో పాటు శిక్షణ పొందిన వారికి ఉద్యోగావకాశాలు లభించాయని సిఎం తెలిపారు. పాలిటెక్నిక్‌ల ఆధునికీకరణకు అవసరమైన నిధుల విడుదలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మరోవైపు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్, అసోసియేట్, ఇతర ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని, నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఉన్నత విద్యామండలి ఛైర్మన్, విసిలకు సూచించారు. ఈ సమీక్షసమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, ఎంపి వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ అభిలాష అభినవ్, పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు నవీన్ నికోలస్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, టిజిఈడబ్ల్యూఐడిసి డైరెక్టర్ గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట్ల సబ్సిడీ

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. అందుకే రైతులకు తగినంత ఎరువుల సబ్సిడీ ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రబీసీజన్ కోసం సుమారు రూ. 62,370.02 కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని తెలిపారు. ఇది 2025–26 రబీ సీజన్ కంటే సుమారు రూ. 24,417.73 కోట్లు ఎక్కువ అని అన్నారు. డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్) ఎరువు ధరలో ఎటువంటి మార్పు ఉండదు; ఇది 50 కిలోల బస్తాకు రూ. 1,350 ధరకే లభిస్తుంది.

రూ.5వేల కోట్ల మేర ముద్రా రుణాలు

సూక్ష్మ పరిశ్రమల కోసం ఉద్దేశించిన 'క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్' (సిజిఎఫ్ఎంయు) పథకాన్ని కేంద్ర కేబినెట్ మరో 5 ఏళ్లపాటు పొడిగించింది. అంటే 2031 మార్చి వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. పిఎం ముద్ర యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు బ్యాంకులు, రుణ సంస్థలు ఏకంగా 60.36 కోట్లకుపైగా రుణాలు మంజూరు చేశాయి. వాటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లు ఉంటుంది. బ్యాంకులు లేదా రుణ సంస్థలు ఇచ్చే ఈ రుణాలకు డిఫాల్ట్ (రుణాలు తిరిగి చెల్లించలేకపోవడం) రిస్క్ లేకుండా సిజిఎఫ్ఎంయు పథకం రక్షణ లభిస్తుంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి రూ.5వేల కోట్ల మేర నిధులు కేటాయించేందుకు ఆమోదం లభించింది. దీని ద్వారా రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రాయోజన రుణాలకు ఊతం లభిస్తుంది. 2016 జనవరిలో ప్రారంభమైన ఈ సిజిఎఫ్ఎంయు అనేది ముద్ర యోజన రుణాల వృద్ధిని వేగవంతం చేయడంలో ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.
స్టాండప్ ఇండియా పథకం ఐదేళ్లు పొడిగింపు కేంద్ర కేబినెట్ స్టాండప్ ఇండియా పథకం గడువును 2031 మార్చి 31 వరకు అంచే ఐదేళ్లపాటు పొడిగించింది. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగల(ఎస్‌టి)ల్లోని వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి, అలాగే వారిలో పారిశ్రామిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా రానున్న 5 ఏళ్లలో అదనంగా మరో 2.5 లక్షల మంది వ్యాపారవేత్తలకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. 2016 ఏప్రిల్‌లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్‌సి, ఎస్‌టి వ్యాపారవేత్తలకు ఈ రుణాలు అందించారు. ఉత్పాదక, సేవా, వాణిజ్య రంగాలు లేదా వ్యవసాయ అనుబంధ రంగాల్లో సరికొత్త గ్రీన్ ఫీల్డ్ సంస్థలను స్థాపించడానికి గాను, ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ నుంచి కనీసం ఒక ఎస్‌సి లేదా ఎస్‌డి లబ్ధిదారునికి, కనీసం ఒక మహిళకు రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందించడమే లక్ష్యంగా ఈ స్టాండప్ ఇండియా పథకం పని చేస్తుంది. తక్కువ వడ్డీకి ఇచ్చే ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల వరకు మారటోరియం పీరియడ్ ఉంటుంది. అయితే ఈ రుణాలను 7 సంవత్సరాల్లోపు పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణ మొత్తంలో 85 శాతానికి క్రెడిట్ గ్యారెంటీ లభిస్తుంది. దీని ప్రామాణిక గ్యారెంటీ ఫీజు 0.50 శాతంగా ఉంటుంది.

విద్వేషానికి చోటులేదు

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తున్న విచ్ఛిన్నకర విధానాలు యావత్తు సమాజంలో అశాంతిని సృష్టిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా భారత్ సమ్మిట్‌లో చర్చించి ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనకు కృషి జరుగుతుందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్వేష రాజకీయం, ఆర్థికం, సామాజిక విధానాలకు భారత దేశంలో చోటు లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించి అమలు చేసేందుకు కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడానికి ఈ సమ్మిట్‌ను ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పెట్టుబడిదారి వర్గాలు, పారిశ్రామిక వేత్తలు చర్చించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందించుకోవడానికి వేదికగా మారిన దావోస్ మాదిరిగా మితవాద శక్తులు అనుసరిస్తున్న విధానాలకు ప్రత్యామ్నాయ ఆర్థిక, సామాజిక, రాజకీయ విధానాలపై చర్చించి తగిన చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడే విధంగా హైదరాబాద్ ఒక వేదికగా మారాలని ఆకాక్షించారు. మంత్రి డి.శ్రీధర్ బాబు మాట్లాడుతూ సమ్మిట్‌లో ప్రపంచం ఈనాడు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లపై చర్చించడానికి వివిధ అంశాలపై 12 సదస్సులను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం నాటి నుంచి తొలి ప్రధానమంత్రి పండిత్ జవహార్ లాల్ నెహ్రూ అనుసరించిన విధానాలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. గురుదీప్ సింగ్ సప్పాల్ మాట్లాడుతూ దేశంలో ప్రపంచంలో ఈ రోజు అనుసరిస్తున్న ప్రమాదకరమైన విధానాలకు ప్రత్యామ్నాయంగా మహాత్మాగాంధీతో పాటు కాంగ్రెస్ ఇతర పెద్దలు చూపిన మార్గదర్శకం, వేసిన బాటలు ప్రపంచానికి ఎంతో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా కొత్త ప్రపంచాన్ని సృష్టిద్దాం అనే శీర్షికతో నిర్వహిస్తున్న ఈ సమ్మిట్ లోగోను కేంద్ర విదేశాంగ శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, సమృద్ధ భారత్ ఫౌండేషన్ డైరెక్టర్ పుష్పారాజ్ దేశ్ పాండే, ఎమ్మెల్యే మక్కన్ రాజ్ సింగ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ టెస్ట్‌ల్లోకి తెలుగు తేజం రీఎంట్రీ!

యుఎఇ తరఫున బరిలోకి దిగేందుకు కెఎస్ భరత్ ప్రయత్నాలు


టీమిండియా మాజీ వికెట్ కీపర్, తెలుగు తేజం కెఎస్ భరత్ టెస్ట్ క్రికెట్‌లోకి పునరాగమనం చేసేందుకు సిద్ధమయ్యాడు. అయితే భారత్ నుంచి కాకుండా యుఎఇ తరఫున బరిలోకి దిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన కెఎస్ భరత్.. 2023–2024 మధ్య భారత టెస్ట్ జట్టులో వికెట్ కీపర్‌గా కొనసాగాడు. భారత్ తరఫున 7 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి.. 12 ఇన్నింగ్స్‌ల్లో 221 పరుగులు చేశాడు. వికెట్ కీపింగ్‌లో 18 క్యాచ్‌లతో పాటు ఒక స్టంపౌట్ చేశాడు. టీమిండియా ప్రధాన వికెట్ కీపర్ రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదంలో గాయపడి జట్టుకు దూరం కావడంతో కెఎస్ భరత్‌కు అవకాశం దక్కింది. రిషభ్ పంత్ పూర్తిగా కోలుకొని పునరాగమనం చేయడంతో పాటు బ్యాకప్ వికెట్ కీపర్‌గా ధ్రువ్ జురెల్ అవకాశాలు అందుకోవడంతో కెఎస్ భరత్‌కు ఉద్వాసన తప్పలేదు. దాంతో అతను చిన్న వయసులోనే రిటైర్మెంట్ ప్రకటించాడు. విదేశీ లీగ్స్ ఆడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాడు. ప్రస్తుతం అబుదాబి టీ10 సిరీస్ ఆడేందుకు యుఎఇలో ఉన్న కెఎస్ భరత్.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. యుఎఇ తరఫున టెస్ట్ క్రికెట్ ఆడాలనే యోచనలో ఉన్నాడు. అంతర్జాతీయ క్రికెట్ రూల్స్ ప్రకారం.. ఆటగాళ్లు మరో దేశం తరఫున ఆడే ముందు తప్పనిసరిగా నిర్దిష్ట విరామ కాలాన్ని పూర్తి చేయాలి. ఆ విరామ సమయం కెఎస్ భరత్‌కు వచ్చే ఏడాది ఫిబ్రవరితో ముగుస్తుంది. ఆ తర్వాత అతను అంతర్జాతీయ స్థాయిలో యుఎఇ జట్టు తరఫున టెస్ట్ మ్యాచ్‌లు ఆడేందుకు పూర్తి అర్హత సాధిస్తాడు. కెఎస్ భరత్ ప్రస్తుత వయసు 33 ఏళ్లు మాత్రమే.

రీఎంట్రీ కోసమే రిటైర్మెంట్..

ఈ విషయంపై కెఎస్ భరత్ మాట్లాడుతూ..టెస్ట్ క్రికెట్ ఆడటం అనేది ఒక ఆటగాడికి లభించే అత్యంత గొప్ప అనుభూతని చెప్పుకొచ్చాడు. యుఎఇ తరఫున ఆడేందుకే భారత క్రికెట్‌కు వీడ్కోలు పలికానని తెలిపాడు. 'టెస్ట్ క్రికెట్ ఆడటం అనేది ఒక ఆటగాడికి లభించే అత్యంత గొప్ప అనుభూతి. నేను చాలా ఏళ్లుగా దేశీయ క్రికెట్‌లో బాగా ఆడాను. నాలో ఇంకా అంతర్జాతీయ క్రికెట్ మిగిలే ఉందని నేను గ్రహించాను. అందుకే భారత జట్టును వీడాలనే కఠినమైన నిర్ణయం తీసుకున్నాను. ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు నాకు మంచి సౌకర్యాలు కల్పించింది. ఇక్కడ సౌతాఫ్రికా, ఇంగ్లాండ్ అఫ్గానిస్థాన్, శ్రీలంక, పాకిస్థాన్, భారత్‌కు చెందిన ఆటగాళ్లు ఆడుతారు. నా కెరీర్‌లో ఈ రెండో ఇన్నింగ్స్ గురించి నేను చాలా ఉత్సాహంగా ఉన్నా. టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడిన నా అనుభవాలను గుర్తు చూసుకుంటూ.. ఈ టీ10 ఫార్మాట్‌కు అలవాటు పడుతున్నాను.' అని కెఎస్ భరత్ చెప్పుకొచ్చాడు.

చరిత్ర విస్మరించిన శ్రమజీవులు!

'నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?



'తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?' అన్నాడు మహాకవి శ్రీశ్రీ. నిజమే... చరిత్రను మనం ఎక్కువగా రాజులు, సామ్రాజ్యాలు, యుద్ధాలు, విజయగాథల రూపంలోనే చదువుతుంటాం. కానీ ఆ మహత్తర చరిత్రకు అసలైన పునాది వేసింది ఎవరు అన్న ప్రశ్నను లోతుగా అడిగితే, సమాధానం స్పష్టంగా కనిపిస్తుంది...సాధారణ మనుషులు, కూలీలు, రైతులు, కళాకారులు, శిల్పులు, వ్యాపారులు. ప్రాచీన నాగరికతల వెనుక ఉన్న అసలైన శక్తి వీరే. వారి శ్రమ లేకుండా ఏ సామ్రాజ్యమూ, ఏ నగరమూ, ఏ చారిత్రక అద్భుతమూ నిలబడలేదు. ప్రాచీన నాగరికతలు ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి ఎదిగాయి. నైలు, టైగ్రిస్–యూఫ్రటిస్, సింధు, యెల్లో నదీ లోయల నాగరికతలు అన్నీ రైతుల శ్రమపై నిలిచాయి. విత్తనం నాటడం నుంచి పంట కోత వరకు, నీటిపారుదల కాలువలు తవ్వడం నుంచి భూమిని సారవంతం చేయడం వరకు అన్నీ సాధారణ రైతుల కష్టమే. వారు ఉత్పత్తి చేసిన ఆహారమే అధిక ఉత్పత్తిగా మారి, సమాజంలో ఇతర వృత్తులు ఎదగడానికి అవకాశం కల్పించింది. ఈ అధిక ఉత్పత్తి లేకపోతే రాజులు, పూజారులు, లేఖకులు, సైనికులు వంటి ప్రత్యేక వర్గాలు పుట్టే ప్రశ్నే ఉండేది కాదు. అదే విధంగా, చరిత్రలో మనం ఆశ్చర్యంతో చూసే పిరమిడ్లు, దేవాలయాలు, కోటలు, నగర గోడలు తదితరాలన్నీ వేలాది మంది కూలీల చెమట చుక్కలతో నిర్మితమయ్యాయి. ఈజిప్టు పిరమిడ్లను నిర్మించిన వారు దేవతలు కాదు, సాధారణ కార్మికులే. మెసపొటేమియా జిగ్గురాట్లు, రోమన్ రహదారులు, ఇంకా నాగరికత రాతి నగరాలు అన్నీ శిల్పులు, రాయి కట్టేవారు, మోయువారు, పని వాళ్ల సమష్టి శ్రమ ఫలితాలు. రాజుల పేర్లు శాసనాల్లో నిలిచినా, ఆ శాసనాలను నిలబెట్టిన రాళ్లు కార్మికుల చేతుల మీదుగా నిలబడ్డాయి. కళలు, వృత్తులు కూడా కార్మిక వర్గాల నుంచే పుట్టాయి. కుండల తయారీ, లోహపనులు, నేసవస్త్రాలు, చెక్క పనులు ప్రతి తరంలోనూ నాగరికతకు ఆర్థిక బలం చేకూర్చాయి. వ్యాపార మార్గాలు అభివృద్ధి చెందినది కూడా సాధారణ వ్యాపారులు, కార్మికుల ప్రయాణాల వల్లే. వారు సరుకులను మోసుకుంటూ ప్రాంతాల మధ్య సంబంధాలను పెంచారు. సంస్కృతుల మార్పిడికి మార్గం వేసారు. అయితే చరిత్ర పుస్తకాల్లో ఈ శ్రమకు తగిన స్థానం దక్కలేదు. పాలకుల విజయాలు, యుద్ధాల కథనాలు ఎక్కువగా నమోదయ్యాయి. కానీ ఆ విజయాలకు కావలసిన ఆహారం, ఆయుధాలు, భవనాలు అందించిన ప్రజల కష్టం అంచుల్లోనే మిగిలిపో యింది. నిజానికి, ఏ రాజ్యమైనా నిలవాలంటే ప్రజల శ్రమ మీదే ఆధారపడుతుంది. శ్రమ ఆగితే రాజ్యాలు కూలిపోతాయి. ఇది చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది. కాబట్టి చరిత్రను నిజంగా అర్థం చేసుకోవాలంటే, రాజుల కిరీటాల వెనుక ఉన్న కూలీల చేతులను గుర్తించాలి. నాగరికతలు అనేవి పై నుంచి కిందికి వచ్చిన అద్భుతాలు కావు... అవి కింద నుంచి పైకి నిర్మించబడిన శ్రమపర్వతాలు. సాధారణ మనిషి శ్రమే చరిత్రకు అసలైన వెన్నెముక. ఈ నిజాన్ని గుర్తించినప్పుడే మన చరిత్ర పఠనం సంపూర్ణమవుతుంది.



ఇటలీలోని ప్రాచీన నగరం పాంపేయోలో పురావస్తు శాస్త్రవేత్తలు ఒక అద్భుతమైన ఆవిష్కరణ చేశారు. సుమారు 2,000 సంవత్సరాలుగా మూసివేసి ఉన్న ఒక పురాతన చెక్క అల్మారాను తొలిసారిగా తెరిచారు. అందులో అప్పటి ప్రజల జీవనశైలి, నమ్మకాలు, అలంకరణల పట్ల ఆసక్తిని తెలియ వచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. వీటితోపాటు సుగంధ ద్రవ్యాలు నిల్వ చేసే చిన్న సీసాలు, వివిధ రకాల మట్టి పాత్రలు కూడా లభించాయి. చరిత్రలో పాంపేయ్ నగరం క్రీస్తు శకం 79లో వెసూవియస్ అగ్నిపర్వత విస్ఫోటనం కారణంగా బూడిదలో కూరుకుపోయింది. ఆ విపత్తు నగరాన్ని నాశనం చేసినప్పటికీ, అప్పటి జీవితానికి సంబంధించిన అనేక ఆనవాళ్లను భద్రపరిచింది. ఈ ఆవిష్కరణ, సుమారు

వేల సంవత్సరాలనాటి అపురూప సంపద!



రెండు వేల సంవత్సరాల క్రితం జీవించిన మనుషుల విశ్వాసాలు, అలంకరణలు, సంస్కృతి, రోజువారీ జీవితాన్ని అర్థం చేసుకోవడానికి లభించిన అరుదైన చారిత్రక అవకాశం.

పంజాబ్ కింగ్స్‌కు హార్దిక్ పాండ్యా..

ముంబై ఇండియన్స్‌కు అర్షదీప్ సింగ్



న్యూఢిల్లీ: ఐపిఎల్‌లో హార్దిక్ పాండ్యాపై నెలకొన్న ఉత్కంఠ వీడింది. ఆల్‌రౌండర్ హార్దిక్ ఇక నుంచి పంజాబ్ కింగ్స్ తరపున ఆడనున్నారు. ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ జరిగింది. ఈ విషయాన్ని బుధవారం ఐపిఎల్ స్పష్టం చేసింది. రెండు ఫ్రాంచైజీలు ఇష్ట ప్రకారమే ఆటగాళ్లను మార్చుకున్నాయి. దీనికి సంబంధించిన పేపర్ వర్క్‌ను కూడా సోమవారమే బిసిసిఐకి అందజేసినట్లు తెలిసింది. టాటా ఐపిఎల్ 2027 సీజన్ కోసం ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్ జట్టుతో కలవనున్నాడు. ఇక టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన అర్షదీప్ సింగ్ ముంబై ఇండియన్స్ జట్టుతో కలుస్తాడని ఐపిఎల్ తన స్టేట్‌మెంట్‌లో తెలిపింది. 18 కోట్ల ప్రైజ్‌మనీతో పాండ్యా పంబాజ్ జట్టులో చేరనున్నాడు. ముంబైలో అతనికి 16.35 కోట్ల ప్రైజ్‌మనీ ఉంది. ఇక బౌలర్ అర్షదీప్ ప్రస్తుతం ఉన్న 18 కోట్ల ఫీజుకే పంజాబ్ జట్టుతో కలవనున్నాడు. పంజాబ్ కింగ్స్ జట్టుకు 2019 నుంచి అర్షదీప్ ఆడుతున్నాడు. అతను 96 మ్యాచుల్లో 111 వికెట్లు తీశాడు. అయితే తొలిసారి అర్షదీప్ తన స్వంత ఫ్రాంచైజీని వీడుతున్నాడు.

తొలిరోజే హోరాహోరీ పోటీలు

యు-16 క్రికెట్ లీగ్‌లో సూర్యాపేట, ఆదిలాబాద్, హన్మకొండ, నిర్మల్ జట్ల జోరు

భారీ విజయాలతో సత్తా చాటిన యువ క్రికెటర్లు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యు16 రాష్ట్ర స్థాయి క్రికెట్ లీగ్ పోటీలు బుధవారం మొయినాబాద్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు గ్రూప్‌ఎ, గ్రూప్‌బి విభాగాల్లో జరిగిన నాలుగు మ్యాచ్‌లలో సూర్యాపేట, ఆదిలాబాద్, హన్మకొండ, నిర్మల్ జట్లు విజయాలు సాధించాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని వన్ ఛాంపియన్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో సూర్యాపేట జట్టు వరంగల్‌పై 31 పరుగుల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు బెల్లంపల్లిపై 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. హన్మకొండ జట్టు భూపాలపల్లిపై 9 వికెట్ల తేడాతో గెలుపొందగా, నిర్మల్ జట్టు ఆర్మూర్‌పై 100 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేసింది. వ్యక్తిగత ప్రదర్శనల్లో నిర్మల్ ఆటగాడు సాన్విత్ 59 పరుగులతో ఆకట్టుకోగా, వరంగల్ బౌలర్ మోయిన్ నవాజ్ 5 వికెట్లు పడగొట్టాడు. ఆదిలాబాద్ ఆటగాడు హీత్ డోక్వాల్ 40 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హన్మకొండ బౌలర్ రిత్విక్ 3 పరుగులకే 3 వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. నిర్మల్ బౌలర్ సి. శివ 3 వికెట్లతో రాణించాడు. నాలుగు మ్యాచ్‌ల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన ఆటగాళ్లకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ పురస్కారాలు అందజేశారు.



కరువు ప్రాంతంగా పెద్దపల్లి జిల్లాను ప్రకటించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు న్యాయం చేయాలని పెద్దపల్లి అడిషనల్ కలెక్టర్‌కు సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ వర్ష భావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు పెద్దపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, జిల్లాలో కరువు పరిస్థితులను సమగ్రంగా అంచనా వేసి, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతో పాటు సాగునీరు, తాగునీరు, పశుగ్రాస సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, భూగర్భ జలాలు, తాగు, సాగు నీటి లభ్యతపై సమగ్ర వివరాలు వెల్లడించాలని, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పరిశ్రమలకు సరపర చేస్తున్న నీటిని సమీక్షించి ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, పెద్దపల్లి పట్టణ కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన యూనివర్సిటీలో ప్రకృతి విధ్వంసమా?

- తవ్విన మట్టి, కొట్టిన చెట్లకు లెక్క చెప్పాలి
- యూనివర్సిటీలో పర్యావరణ విధ్వంసంపై ప్రభుత్వం విచారణ చేపట్టాలి
- ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్ : శాతవాహన యూనివర్సిటీలో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వుతూ బొండల గడ్డగా మార్చుతారా అని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి యూనివర్సిటీ విసి, రిజిస్ట్రార్‌లను ప్రశ్నించారు. కరీంనగర్ సిటీ ప్రజలకు లంగ్ స్పేస్‌గా ఉన్న శాతవాహన యూనివర్సిటీలోని పచ్చని చెట్లను నరికివేసి ప్రకృతి విధ్వంసం చేశారని, దీంతో యూనివర్సిటీలో ఉండే వన్యప్రాణులు కనిపించకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో తవ్విన మట్టికి, కొట్టిన చెట్లకు లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం శాతవాహన యూనివర్సిటీ ఆవరణలో అక్రమంగా తవ్విన తవ్వకాలను చెట్ల నరికివేత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో విసి, రిజిస్ట్రర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇప్పటికే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు యూనివర్సిటీలో అక్రమంగా మట్టిని తవ్వేందుకు, చెట్లను నరికివేసేందుకు సహకరిస్తున్నారని, మట్టి, కలప బయటికి వెళ్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. యూనివర్సిటీ పాలక మండలి నిర్ణయం మేరకు మట్టి తవ్వకాలు, చెట్ల నరికివేత జరిగాయా అనే అంశంపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని వన్యప్రాణులు ప్రస్తుతం కనిపించడం లేదని, నెమళ్ళు, కుందేళ్ళ, పక్షుల కిలకిల రావాలు వినపడటం లేదన్నారు. యూనివర్సిటీలో తవ్విన మట్టిని ఎక్కడికి పంపించారు.? ఎందుకోసం పంపించారు? నరికి వేసిన చెట్లను ఎవరికి అప్పగించారు? అనే దానిపై ప్రభుత్వం విచారణ చేయాలన్నారు. యూనివర్సిటీలో ఇప్పటికే అభివృద్ధి పేరుతో నిధుల దుర్వినియోగం జరుగుతోందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ వ్యవహారాలు చూస్తున్న నేపథ్యంలో శాతవాహన యూనివర్సిటీలో అక్రమంగా నిబంధన విరుద్ధంగా అనుమతి లేకుండా మట్టి తవ్వకాలు చెట్ల నరికివేత ప్రకృతి విధ్వంసంపై కమిటీ వేసి విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని మణికంఠ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్ రెడ్డి, ఎఐఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షుడు వరుణ్ శివాజీ, నాయకులు యశ్వంత్, కుమార్, సాగర్ తదితరులు పాల్గొన్నారు

బాలల హక్కుల చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జాతీయ కన్వీనర్ కల్లూరు ధర్మేంద్ర

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : బాలల హక్కుల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలను అమలు చేయటం అవసరం ఉందని ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బాలసంఘం జాతీయ కన్వీనర్ కల్లూరు ధర్మేంద్ర అన్నారు. బాలల దినోత్సవ సందర్భంగా ఎఐవైఎఫ్, బాలసంఘం బుధవారం మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భావిపౌరులైన విద్యార్థులు నేటి సమాజంలో హక్కులు కలిగిన వారని, వాటిని కాపాడాల్సిన బాధ్యతను విస్మరించరాదన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించటంతో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయటం ద్వారా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను పూర్తి స్థాయిలో ఉచితంగా అందివ్వాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు విద్యా హక్కు చట్టం, పోక్సో చట్టం, బాల కార్మిక నిషేధ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. భగత్‌సింగ్ ఆశయాల స్ఫూర్తితో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత, సమానత్వ భావనలు పెంపొందించే లక్ష్యంగా బాల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభ పోటీల ద్వారా వెలికి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి గిరిబాబు,కిరణ్,నరేష్,ఉప్పల్ మండల అధ్యక్షుడు అజీంపాషా, బాల సంఘం జిల్లా కన్వీనర్ రాజ్‌కుమార్, పాఠశాలప్రధానోపాధ్యాయులు శివకుమార్, ఉపాధ్యాయులు సురేష్,మధురిమ,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాలి

విదేశీ వాణిజ్య ఒప్పందాలు రద్దు చేయాలి : సాయిబాబు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల వ్యవసాయ విధానాలతో రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు విమర్శించారు. విదేశీ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, అన్ని పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల నేపథ్యంలో బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా రైతాంగం మౌలిక సమస్యలు పరిష్కారం కాకపోవడం పాలకుల వైఫల్యమన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్చివేయడం వల్ల వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతింటోందని విమర్శించారు. విదేశీ వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసే వరకు రైతాంగం పోరాటాలు కొనసాగించాలని తెలంగాణ రైతు సంఘం నాయకుడు డాక్టర్ అరిబండి ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులకు కొత్త కష్టాలు ఎదురవుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన ఆర్థిక కేటాయింపులతో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో మండల స్థాయిలో మానవహారాలు నిర్వహించాలని, 15న నల్లగొండలో జరిగే కిసాన్ సభ జాతీయ మహాసభల ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం కోశాధికారి మూడ్ శోభన్ నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు పద్మ, సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, ఆర్. సుధా భాస్కర్, జె. మల్లికార్జున్, వి.ఎస్.రావు, పి.జయలక్ష్మి, కె.ఈశ్వర్‌రావు, కె.గోపాలస్వామి, రాష్ట్ర కార్యదర్శులు జె. వెంకటేష్, ఎం.పద్మశ్రీ, బి.మధు, కూరపాటి రమేష్, పి.శ్రీకాంత్, పి.సుధాకర్, బీరం మల్లేష్, ఎం.వెంకటేష్, రాగుల రమేష్, ఏ.ముత్యంరావు, కాసు మాధవి, బి.కవిత, సిహెచ్. భాను కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కులు కల్పించాలి

- భూముల స్వాధీనాన్ని తక్షణమే నిలిపివేయాలి
- డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్



ప్రజాపక్షం/హనుమకొండ: దళిత పేదలకు ప్రభుత్వం గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూములకు సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని, అభివృద్ధి, పరిశ్రమల పేరుతో దళితుల సాగు భూములను స్వాధీనం చేసుకునే చర్యలను తక్షణమే నిలిపివేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్ పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా సమితి సమావేశం రాజారపు రత్నం అధ్యక్షతన బుధవారం స్థానిక బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ, దళిత పేదలకు భూమిని పంపిణీ చేయడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పునాది వేయాల్సిన ప్రభుత్వం, మరోవైపు వివిధ ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో అదే భూములను తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయడం ఆందోళనకరమన్నారు. భూమి కేవలం ఆస్తి మాత్రమే కాదని, దళిత పేదల జీవనాధారమని, ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించకుండా అనేక ఆంక్షలతో ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమన్నారు. అసైన్డ్ భూములపై సాగుదారులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సమగ్ర విధానాన్ని ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ భూముల పంపిణీ, అసైన్డ్ భూముల వివరాలు, ప్రస్తుతం సాగులో ఉన్న రైతుల స్థితిగతులపై జిల్లా వారీగా సమగ్ర సర్వే నిర్వహించి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దళితుల భూముల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడుతుందని, జిల్లా, మండల, గ్రామస్థాయిలో భూ సమస్యలపై పోరాటాలను బలోపేతం చేస్తామని తెలిపారు. దళితుల భూ ముల పరిరక్షణ, అసైన్డ్ భూములకు సంపూర్ణ హక్కుల సాధన కోసం ప్రజాస్వామిక శక్తులు, దళిత సంఘాలు, భూమిలేని పేద లు ఐక్యంగా ఉద్యమించాలని మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బికెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, డిహెచ్ పిఎ స్ జిల్లా కార్యదర్శి నిమ్మల మనోహర్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కొట్టేపాక రవి, నాయకులు పద్మా, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు
రూ.120 కోట్లతో ఏర్పాట్లు
డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 నిర్వహణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు భారీ ఏర్పాట్లు చేపడుతోంది. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జరిగే ఈ క్రీడా పోటీల కోసం రూ.120 కోట్లతో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. సుమారు 7 వేల మంది క్రీడాకారులు, కోచ్‌లు, అతిథులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు.ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై కేంద్ర క్రీడా శాఖ కార్యదర్శి హరిరంజన్ రావు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న ఏర్పాట్లను సీఎస్ వివరించారు. క్రీడా వేదికల అభివృద్ధితో పాటు పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్ల పునరుద్ధరణ, ఇతర కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ప్రతి క్రీడా వేదికకు అదనపు కలెక్టర్ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు వెల్లడించారు. పోటీలు జరిగే ప్రతి వేదిక వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని స్టేడియాలను పోటీలకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నామని, ఇప్పటికే 11 స్టేడియాలు సిద్ధమయ్యాయని, మరో ఐదు స్టేడియాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని సీఎస్ వివరించారు. ఈ సమీక్షలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీ బాలాదేవి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార శాఖ కమిషనర్ ముకుంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిసి కమిషన్‌లో ‘బిపి మండల్ గ్రంథాలయం’
14న మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ప్రారంభం

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా తెలంగాణ బిసి కమిషన్ కార్యాలయంలో ఈ నెల 14న బిపి మండల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శనివారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రంథాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం కె.ఎన్. అనంతరామన్ కాన్ఫరెన్స్ హాల్‌ను కూడా ప్రారంభిస్తారు. గ్రంథాలయంలో బిసిలకు సంబంధించిన వివిధ కమిషన్ నివేదికలు, సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు, బిసి అంశాలపై మేధావులు రూపొందించిన నివేదికలను అందుబాటులో ఉంచనున్నారు. భావితరాలకు, పరిశోధకులకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుతున్నట్లు కమిషన్ తెలిపింది.


బిసి రిజర్వేషన్లకు చారిత్రక నివేదిక..

బిపి మండల్ మాజీ ఎంపి, బీహార్ మాజీ ముఖ్యమంత్రిగా సేవలందించారు. 1978 డిసెంబరు 20న వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్‌గా నియమితులై, 1980 డిసెంబరు 31న నివేదిక సమర్పించారు. మండల్ కమిషన్ సిఫార్సుల ఫలితంగా కేంద్ర ప్రభుత్వ విద్య, ఉద్యోగ రంగాల్లో బిసిలకు 27 శాతం రిజర్వేషన్లు అమలులోకి వచ్చాయి.

అనంతరామన్ కమిషన్‌కు గుర్తుగా సమావేశ మందిరం..

1968లో కె.ఎన్. అనంతరామన్, ఐసీఎస్ (రిటైర్డ్) అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ బిసి కమిషన్ ఏర్పాటైంది. బిసిల సామాజిక, విద్యాపరమైన పరిస్థితులను అధ్యయనం చేసిన అనంతరామన్ కమిషన్ నివేదిక ప్రామాణిక గ్రంథంగా నిలిచింది. ఈ ఇద్దరు ప్రముఖుల సేవలకు గుర్తుగా వారి పేర్లను గ్రంథాలయం, సమావేశ మందిరాలకు పెట్టాలని బిసి కమిషన్ నిర్ణయించింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మి రంగు, మెంబర్ సెక్రటరీ బి. బాల మాయాదేవి పాల్గొననున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.

ఆన్‌లైన్ ప్రకటనల
మాయలో పడితే డబ్బులు గల్లంతే!



నకిలీ డిస్కౌంట్లు, బ్యాంకు కార్డు వివరాలతో సైబర్ మోసాలు
ప్రజలకు టిజిసిఎస్‌బి హెచ్చరిక

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆన్‌లైన్ షాపింగ్‌లో భారీ తగ్గింపు ధరల ఆశ చూపిస్తూ ఒకవైపు వినియోగదారులను మోసం చేస్తుండగా, మరోవైపు బ్యాంకు రివార్డులు, క్యాష్‌బ్యాక్, క్రెడిట్ కార్డు పరిమితి పెంపు పేరుతో ఖాతాదారుల సొమ్ము ను కాజేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు, గుర్తుతెలియని లింకులు, హానికరమైన మొబైల్ యాప్‌ల ద్వారా జరుగుతున్న ఈ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) డైరెక్టర్ శిఖాగోయేల్ ప్రజలను హెచ్చరించారు. గత 20 నుంచి 30 రోజులుగా ఈ తరహా మోసాలపై ఫిర్యాదులు పెరుగుతున్నాయని వెల్లడించారు. నవంబర్ నెల సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయేల్ ప్రజలకు రెండు కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌తో పాటు నకిలీ వెబ్‌సైట్లలో ప్రముఖ బ్రాండ్ల ఎలక్ట్రానిక్ వస్తువులు, దుస్తులు, విహారయాత్ర ప్యాకేజీలు, గృహోపకరణాలు, ఇతర సేవలను భారీ తగ్గింపు ధరలకు అందిస్తామంటూ మోసగాళ్లు ప్రకటనలు ఇస్తున్నారని తెలిపారు. వీటిని నమ్మి ముందస్తుగా యుపిఐ, డిజిటల్ వాలెట్లు, బ్యాంకు బదిలీల ద్వారా నగదు చెల్లించిన తర్వాత నకిలీ ఆర్డర్ ధ్రువీకరణలు పంపి, సరుకు ఆలస్యమవుతోందంటూ కాలయాపన చేసి చివరకు ఫోన్ నంబర్లను, వెబ్‌సైట్లను మూసివేస్తున్నారని వివరించారు.మరోవైపు బ్యాంకు రివార్డులు, క్యాష్‌బ్యాక్, క్రెడిట్ కార్డు పరిమితిని రూ.5 లక్షల వరకు పెంచుతామంటూ నకిలీ సందేశాలు, లింకులు పంపుతున్నారని హెచ్చరించారు. వాటిని క్లిక్ చేసి హానికరమైన ఎపికె ఫైళ్లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే కార్డు నంబరు, గడువు తేదీ, సివివి, పిన్, ఒటిపి వంటి రహస్య వివరాలను మోసగాళ్లు తస్కరిస్తున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో మాల్‌వేర్ ద్వారా ఫోన్‌కు వచ్చే బ్యాంకు సందేశాలను కూడా దొంగిలించి, బాధితుల అనుమతి లేకుండానే దేశీయ, అంతర్జాతీయ లావాదేవీలు జరుపుతున్నారని పేర్కొన్నారు.గుర్తుతెలియని సామాజిక మాధ్యమ విక్రేతల నుంచి కొనుగోళ్లు చేయవద్దని, అసాధారణ తగ్గింపు ధరలను నమ్మవద్దని టిజిసిఎస్‌బి సూచించింది. విక్రేత వివరాలు, వినియోగదారుల సమీక్షలు, అధికారిక వెబ్‌సైట్లను పరిశీలించిన తర్వాతే చెల్లింపులు చేయాలంది. వాట్సాప్, ఎస్ఎంఎస్ లేదా గుర్తుతెలియని లింకుల ద్వారా వచ్చే ఎపికె ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దని, బ్యాంకు కార్డు వివరాలు, సివివి, పిన్, ఒటిపిని ఎవరికీ వెల్లడించవద్దని స్పష్టం చేసింది. కార్డుకు సంబంధించిన రివార్డులు, పరిమితి పెంపు ఆఫర్లను అధికారిక బ్యాంకు యాప్‌లు లేదా కస్టమర్ కేర్ ద్వారానే ధ్రువీకరించుకోవాలని సూచించింది. సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే జాతీయ సైబర్ నేరాల టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేయాలని, లేదా http://www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని టిజిసిఎస్‌బి కోరింది. మోసం జరిగిన తొలి గంటలో ఫిర్యాదు చేయడం ద్వారా నష్టాన్ని అరికట్టే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొంది.

యుగంధర్ గౌడ్‌పై 270 మంది ఎక్సైజ్ ఎస్‌ఐల ఫిర్యాదు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎక్సైజ్ శాఖ అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తమ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఆరోపిస్తూ బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్‌పై 2020 బ్యాచ్‌కు చెందిన సుమారు 270 మంది ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్ కమిషనర్ ఒక్కో ఎస్‌ఐ నుంచి రూ.30 వేల చొప్పున వసూలు చేశారంటూ యుగంధర్ గౌడ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వారు ఖండించారు. ఈ నెల 7న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యుగంధర్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు తమను తీవ్ర మనోవేదనకు గురిచేశాయని ఎస్‌ఐలు పేర్కొన్నారు. శిక్షణ కాలాన్ని చట్టవిరుద్ధంగా కుదించారని, డబ్బులు వసూలు చేశారని చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. శిక్షణ కాలానికి సంబంధించిన అంశం ఇంకా పెండింగ్‌లోనే ఉందని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బందిని బ్లాక్‌మెయిల్ చేస్తూ వేధిస్తున్నారని, తమ విధులకు ఆటంకం కలిగిస్తూ శాఖ కార్యకలాపాలను స్తంభింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారని యుగంధర్ గౌడ్‌పై ఆరోపణలు చేశారు. కమిషనర్, ప్రభుత్వం, 2020 బ్యాచ్ ఎస్‌ఐల ప్రతిష్టకు భంగం కలిగించేలా చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.



త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు
హైదరాబాద్‌లో పూర్తవ్వగానే జిల్లాల్లో కేటాయింపు
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలను అందించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణల నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రిని కలిసి, ఇటీవల జరిగిన తమ సంఘ రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ఇటీవల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు చేసిన సానుకూల ప్రకటనపై తమ సంఘ కార్యవర్గ సమావేశం కృతజ్ఞతలు తెలపడంతో పాటు ఈ ప్రక్రియను వేగవంతం చేసి జర్నలిస్టుల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు విరాహత్ అలీ, రాంనారాయణలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే మరో ప్రధాన సమస్య అయిన ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, జర్నలిస్టుల ప్రాణాలకు ప్రభుత్వం భద్రత కల్పించాలని తమ సంఘం చేసిన తీర్మానం వివరాలను వారు మంత్రికి వివరించారు.దీనిపై మంత్రి స్పందిస్తూ ముందుగా హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, త్వరలోనే ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఈ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు చేపడతామని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రాజేష్ లు ఉన్నారు.



ఎపిలో కొత్త పార్టీ ఆవిర్భావం
‘పరివర్తన రాజనీతి పార్టీ’ని ప్రకటించిన మాజీ ఎంపి విజయసాయిరెడ్డి

విజయవాడ : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పార్టీ ఆవిర్భవించింది. విజయవాడలో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి కొత్త పార్టీని ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ పేరును ‘పరివర్తన రాజనీతి పార్టీ’గా వెల్లడించారు. కాషాయం, తెలుపు రంగు మధ్యలో అశోకచక్రంతో కూడిన పార్టీ జెండాతో పాటు పార్టీ పేరును ఆవిష్కరించారు. దేశం కోసం ధర్మం కోసం నినాదంతో పిఆర్‌పిని ఏర్పాటు చేశారు. అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడారు. ఏ ఒక్కరూ రాష్ట్రాన్ని, దేశాన్ని మార్చలేరని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఏ ఒక్క నాయకుడి చేతిలో లేదన్నారు. అంతా ప్రజల చేతిలోనే ఉందని ఓటుతో వారి పాత్ర ముగిసిపోదని చెప్పారు. ప్రభుత్వాలు ఏవైనా చేసినా మంచి పనులే చెబుతాయని వివరించారు. మంచి పని ఎవరు చేసినా అభినందించాల్సిందేనని తెలిపారు. తప్పు ఎవరు చేసినా ఆధారాలతో ప్రశ్నించాలని అన్నారు. ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న హక్కు అని విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ పార్టీ ఇంకో నాయకుణ్ని ఇవ్వడానికి రాలేదని విజయసాయిరెడ్డి వెల్లడించారు. యువతకు ఉండే నాయకత్వ లక్షణాలు పైకి తీసుకురావాలన్నారు. వారిని నాయకులుగా మార్చేందుకే నూతన రాజకీయ పార్టీని స్థాపించానని చెప్పారు. అందుకే పరివర్తన రాజనీతి పార్టీ పేరుతో ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. ఐదు కోట్ల ఆంధ్రా ప్రజలను రెండు కుటుంబాలే శాసిస్తున్నాయని వివరించారు. రెండు కుటుంబాలే ఐదు కోట్ల ప్రజానీకాన్ని శాసించాలా అని ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని తెలియజేశారు. తనకు ముఖ్యమంత్రి అవ్వాలనే ఆశలేదన్నారు. యువతలోనే సీఎం అభ్యర్థిని ఎంపిక చేస్తానని పేర్కొన్నారు. ప్రతి సామాజిక వర్గంలోని నాయకులను ప్రోత్సహిస్తామని విజయసాయిరెడ్డి తెలియజేశారు.

ప్రైవేటు సంస్థలకు పాలకులే కట్టబెడుతున్నారు
మల్కం చెరువు, ఖాజాగూడలో ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజం

ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రభుత్వ భూములను కాపాడాల్సిన పాలకులే వాటిని ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతూ రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. తోటమాలిలా ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూముల దోపిడీ యథేచ్ఛగా సాగుతోందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కం చెరువు ఎదురుగా లిడ్ క్యాప్‌కు చెందిన ఆరు ఎకరాల భూమిని వంశీరామ్ బిల్డర్స్, అపర్ణ బిల్డర్స్‌కు అప్పగించారని ఆరోపించారు. ఏక్తా మాల్ పేరుతోనూ భూముల దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఖాజాగూడలో బిసి స్టడీ సర్కిల్ ఏర్పాటు కోసం గతంలో కేటాయించిన భూమిని ఎస్ఎఎస్ ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారని దాసోజు శ్రవణ్ ఆరోపించారు. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వ హయాంలో బిసి స్టడీ సర్కిల్‌కు కేటాయించిన భూమిని ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేటు సంస్థల పరం చేసిందని అన్నారు. ప్రభుత్వ భూమిని భూ భారతి రికార్డుల్లో మార్చిందెవరో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా ఇంతటి వ్యవహారం జరుగుతుందా? అని ప్రశ్నిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతోనే ఈ వ్యవహారాలు సాగుతున్నాయని ఆరోపించారు. బిసి స్టడీ సర్కిల్ భూముల పక్కనే మరో మూడు ఎకరాల ఎఫ్‌టిఎల్ భూమి ఆక్రమణకు గురవుతున్నా హైడ్రా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీసీ స్టడీ సర్కిల్ భూములు అన్యాక్రాంతమవుతుంటే బిసి మంత్రులు పొన్నం ప్రభాకర్, మధు యాష్కీ ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఈ భూముల వ్యవహారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సిసిఎల్ఏ, హైడ్రా, సిఎంకి లేఖలు రాశారని, అరికపూడి గాంధీ కూడా విచారణ జరపాలని హైడ్రాకు లేఖ రాశారని వెల్లడించారు. భారత్ సమ్మిట్ వేదికగా ప్రభుత్వ భూముల దోపిడీ గురించి వివరిస్తారా? అని ప్రశ్నించిన ఆయన, బిసి మంత్రులు ఇప్పటికైనా నిద్రలేచి భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నేత కురువ విజయ్ కుమార్ పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్లు ఓట్లు అమ్ముకోవద్దు
కల్వకుంట్ల కవిత

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు ఆకాశ్ కొల్లూరి, డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌తో కలిసి ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఫ్యూజ్ ఎగిరిపోయిందని, రైతులు పొలంలో ఫ్యూజ్ ఎగిరిపోతే కొత్త ఫ్యూజ్ వేసుకున్నట్టే, రాజకీయాల్లో కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అధికార పార్టీతో పాటు నిద్రావస్థలో ఉన్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విద్యావంతులు ఒక అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఆకాశ్ కొల్లూరిని, నల్గొండ ఖమ్మం వరంగల్ స్థానానికి డాక్టర్ శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇద్దరూ యువకులు, విద్యావంతులని, రాజకీయ, ఆర్థిక నేపథ్యం లేకపోయినా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగారని తెలిపారు. గ్రాడ్యుయేట్లు డబ్బులు తీసుకుని ఓటు వేస్తారన్న అపవాదును తొలగించుకోవాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. రాష్ట్రంలో దాదాపు 80 లక్షల మంది డిగ్రీ చదివిన వారు ఉన్నారని, వారు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. సామాజిక న్యాయంలో భాగంగా ఇద్దరు బిసి అభ్యర్థులకు అవకాశం కల్పించామని కవిత తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జీలు డాక్టర్ రఘు, సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్లు గొంగళ్ల రంజిత్, అర్చనా సేనాపతి, వాసిలి చంద్రశేఖర్, రామ్ కళ్యాణ్ చల్లా, మతిన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల ఏర్పాట్ల పనులు వేగవంతం

దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజ అయ్యర్



ప్రజాపక్షం/భద్రాచలం : రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని భద్రాచలం గోదావరి నదీతీర ప్రాంతాల్లో చేపడుతున్న ఘాట్ల అభివృద్ధి పనులు, ఆలయ పరిసరాల అభివృద్ధి ఇతర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ అయ్యర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాభివృద్ధి పనులను, గోదావరి ఘాట్ల నిర్మాణపనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్టతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా చేపట్టిన పనుల పురోగతి ఇప్పటి వరకు పూర్తయిన పనులు ఇంకా చేపట్టాల్సిన పనులు ఎదురవుతున్న సమస్యలు పనులను పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవిదేశాల నుండి భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని దర్శించుకునేందుకు గోదావరి పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారని చెప్పారు. భక్తులందరికీ స్వామి దర్శనం లభించేలా చర్యలు తీసుకోవడంతో పాటు పుణ్యస్నానాలు ఆచరించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వైద్య సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ప్రధానంగా పుష్కర వనం కోసం అనువైన స్థలాన్ని సేకరించాలని, విఐపిలు, భక్తులకు వేర్వేరుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటుచేయాలని, భక్తుల కోసం డార్మెటరీ సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవస్థానాభివృద్ధి పనులతో పాటు పుష్కరఘాట్ పనులకు కలిపి రూ.348కోట్ల 59 లక్షల నిధులు విడుదల చేసినందుకు అన్ని శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని పనుల అమలులో ఎలాంటి జాప్యం తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం పెంపొందించుకుని ఎదురయ్యే సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవాలని సూచించారు. గోదావరి పుష్కరాల నిర్వహణకు భద్రాచలాన్ని అన్ని విధాలుగా సిద్ధం చేసే లక్ష్యంతో అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేసి అభివృద్ధి పనులన్నింటినీ శ్రీరామనవమి నాటికి పూర్తి చేయాలని, శాఖల మధ్య ఏమైనా సమస్యలుంటే వెంటనే కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని, పనులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అపొద్దని ఆమె అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ దామోదర రావు, ఆర్అండ్‌బి ఇఇ నాగేశ్వరరావు, డిపిఒ అనూష, ట్రాన్స్‌కో ఎస్‌సి మహేందర్ రెడ్డి, డిఎంహెచ్ఒ తుకారం రాథోడ్, డిఎఒ భగవాన్ రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, సర్పంచ్ పూనెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచలం శివారు ప్రాంతంలో 11.6 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కాపుగాసి పట్టుకున్నారు. గంజాయి అక్రమంగా తరలించుకు పోతున్నారనే పక్కా సమాచారంతో బుధవారం కూనవరం రోడ్‌లో వాహనాల విస్తృతతనిఖీ చేపట్టారు. అనుమానాస్పందగా బైక్‌పై అతి వేగంగా వస్తున్నవారిని ఆపి సోదాలు చేయగా వారి వద్ద గంజాయి లభ్యమైంది. పట్టుబడిన ఎండు గంజాయి విలువ సుమారు రూ.6.90 లక్షల వరకు ఉంటుందని ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

ఐటి, పారిశ్రామిక రంగాల్లో
అగ్రగామిగా ఆదిలాబాద్

- స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్, త్వరలోనే విమానాశ్రయానికి శంకుస్థాపన
- ఐటి టవర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటన

ప్రజాపక్షం/మావల

ఐటి, పారిశ్రామిక రంగాల్లో ఆదిలాబాద్ జిల్లాను శీఘ్రగతిన అభివృద్ధి చేసి, స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మావల సమీపంలో రూ. 57.85 కోట్లతో నూతనంగా నిర్మించిన సమగ్ర ఐటి టవర్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గతంలో నిధుల కొరతతో మూలనపడిన ఐటి టవర్ నిర్మాణాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక సహకారంతో వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గ్రామీణ యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్ లేదా ఇతర మహానగరాలకు వలస వెళ్లకుండా సొంత జిల్లాలోనే ఉపాధి పొందేలా ప్రముఖ ఐటీ సంస్థలను ఆదిలాబాద్‌కు రప్పిస్తున్నామన్నారు. ఐటి టవర్‌లో టాస్క్ శిక్షణ కేంద్రం, ఇంక్యుబేషన్ హబ్‌ను కూడా ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుతం ఎన్‌టిటి డేటా సంస్థలో 50 మంది స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి లభించేలా సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించాయని వెల్లడించారు. ఆదిలాబాద్‌లో 3 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందుకోసం తొలివిడతలో 2 వేల ఎకరాలు, రెండో విడతలో మరో 1000 ఎకరాలు సేకరించేందుకు భూసేకరణ చర్యలు వేగవంతం చేశామన్నారు. ఆదిలాబాద్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడి ప్రత్యేక చొరవ చూపుతున్నారని, అన్ని అనుమతుల ప్రక్రియ పూర్తి చేసి త్వరలోనే విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే పరిశ్రమల స్థాపనకు కొత్త ఊపిరి వస్తుందని చెప్పారు. అలాగే గతంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశ్రమ పునరుద్దరణకు సాంకేతిక, విధానపరమైన అంశాలను పరిష్కరిస్తున్నామన్నారు. హైదరాబాద్‌కే పరిమితమైన ఐటి రంగాన్ని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ ఎంపి జి.నగేష్ మాట్లాడుతూ ఐటి టవర్ ప్రారంభం జిల్లా యువత భవిష్యత్తుకు ఎంతో ప్రయోజనకరమని, విమానాశ్రయం, రైల్వే, జాతీయ రహదారులు, సీసీఐ పునరుద్ధరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందడుగు వేయాలని కోరారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ జిల్లాకు ఐటీ టవర్ తెచ్చినందుకు ధన్యవాదాలు తెలిపుతూ, ఉద్యోగ విప్లవానికి సంకేతంగా మరో ఐటీ టవర్‌ను మంజూరు చేయాలని, స్థానిక పరిశ్రమలకు రాయితీలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ అభినందనీయమని, స్థానిక గిరిజన యువతకు ఐటీ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇస్తూ ఈ ప్రాంతంలో ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సెక్రటరీలు అనుదీప్, శశాంక్, అదనపు కలెక్టర్లు ఎస్. రాజేశ్వర్, ఆర్ఎస్ చిత్రు, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివప్రసాద్, ఆర్డీఓ గజదీశ్వర్ రావు, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఐటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మామిళ్లగూడ వద్ద ఒక్కో ఫ్లాట్ రూ.8.50 లక్షల చొప్పున గ్రౌండ్ + 5 బ్లాక్ లలో 480 ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడానికి ప్రభుత్వం జీవో ఆర్టీ నెం.579 ద్వారా అనుమతించిందని తెలిపారు.ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 5.00 లక్షల సబ్సిడీ ఇస్తుందని,లబ్ధిదారుల వాటా కింద యూనిట్‌కు రూ. 3.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇల్లు,ప్లాట్ లేని వారై ఉండాలి. వార్షిక ఆదాయం రూ. 6.00 లక్షలు దాటకూడదు.ఒక్క కుటుంబం నుండి ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి,దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా నల్లగొండ కార్పొరేషన్ పరిధిలో నివాసి అయి ఉండాలిమున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్హులైన వారు మీ సేవ ద్వారా ఆన్‌లైన్‌లో డిసెంబర్ 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కార్మికుల ఐక్యతతోనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఏఐటియుసి నియోజక వర్గ అధ్యక్షులు దంతాల రాంబాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికుల హక్కుల సాధన కోసం ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) చేస్తున్న పోరాటాలు, ఉద్యమ కార్యక్రమాలకు ఆకర్షితులై సూర్యాపేట ఆర్‌టిసి డిపోకు చెందిన టిజెఎంయు యూనియన్ నాయకులు బుధవారం డిపో కార్యదర్శి పి. మధు ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం కోసం ఎంప్లాయిస్ యూనియన్ చేస్తున్న నిరంతర పోరాటాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఇతర యూనియన్ల వారు చేరుతున్నట్లు చెప్పారు. ఏఐటియుసి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు చామల అశోక్ కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ రాజారాం, రిటైర్డ్ ఆర్‌టిసి ఏడిసి ఎస్‌సి సైదులు, ఏడిసి కృష్ణ, డి. రాజు, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు సేవియా, కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీ మహిళ మృతి



ప్రజాపక్షం/నేరేడుచర్ల: పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కళ్లదుటే భార్య మృత్యువాత పడటంతో భర్త కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా పల్లెగూడెం గ్రామానికి చెందిన బొమ్మి వెంకన్న, గురమ్మ దంపతులు చిలక జోస్యం చెబుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడెం నుండి హుజూర్‌నగర్ కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా నేరేడుచర్ల పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఆగి ఉన్న బస్సును క్రాస్ చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి టిప్పర్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న గురవమ్మ (40) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు గురవమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణకు మాతృవియోగం

కుటుంబాన్ని పరామర్శించి భౌతికకాయానికి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ బీర్ల, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం





ప్రజాపక్షం/భువనగిరిరూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం వడాయి గూడెం గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బీసీ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్లెం కృష్ణ మాతృమూర్తి కళ్ళెం హనుమక్క అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. బుధవారం ఆమె అంతిమయాత్ర స్వగ్రామమైన వడాయిగూడెంలో నిర్వహించారు. మృతదేహాన్ని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్, బండి జంగమ్మ, బచ్చనగొని గాలయ్య, కురిమిద్ద శ్రీనివాస్, చిగుర్ల లింగం, పల్లె శేఖర్ రెడ్డి, కుసుమని హరిచంద్ర, పేరబోయిన మహేందర్ యాదగిరిగుట్ట మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కసావు శ్రీనివాసు గౌడ్, మాజీ ఎంపీటీసీలు తంగళ్ళపల్లి సుగుణాకర్, సీస కృష్ణ గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి మహేందర్, పట్టణ కార్యదర్శి శ్రీధర్ నివాళులర్పించారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం కేసు

చందు మీ-సేవ,ఆధార్ కేంద్రాలు శాశ్వత రద్దు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నకిలీ మరణ ధ్రువీకరణ పత్రంతో వైద్య ఆరోగ్యశాఖలో కారుణ్య నియామకం పొందిన కేసులో సహకరించినందుకుగాను జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద ఉన్న చందు మీసేవ కేంద్రాన్ని,అలాగే ఆధార్ కేంద్రాలను శాశ్వతంగా రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. చందు మీసేవ కేంద్రాన్ని,అలాగే డీఈఓ కార్యాలయం వద్ద ఉన్న ఆధార్ కేంద్రాన్ని పనస చంద్రశేఖర్ అనే వ్యక్తి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీలో సహకరించారన్న నేరంపై పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారని తెలిపారు.ఈ మేరకు చంద్రశేఖర్ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో సహకరించినందుకుగాను శాశ్వతంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు.

జనవరి 31లోగా 10వేల ఎకరాలకు కృష్ణా జలాలు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

బిఆర్ఎస్ కరువును రాజకీయ ఆయుధంగా వాడుకున్నదని విమర్శ



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (పాలకవీడు) : కరువును రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్న బిఆర్ఎస్ నేతలు తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు మళ్లిస్తున్నారంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తలెత్తే ముప్పున్న వేళ రైతులకు అండగా నిలువాల్సిన ప్రధాన ప్రతిపక్షం వారి కష్టాల నుంచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. బుధవారం రూ.400కోట్లతో కృష్ణా నదిపై నిర్మిస్తున్న జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన ఆయన పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తెలంగాణ కృష్ణా, గోదావరి జలాలను బిఆర్ఎస్ హయాం కంటే ఎక్కువగా వినియోగించుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని మళ్లిస్తున్నారన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారం అని స్పష్టం చేశారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో పేరుకుపోయిన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పరిష్కరిస్తోందన్నారు.

కృష్ణా, మూసీ నదుల ఆధారంగా ఎత్తిపోతల పథకాలు చేపడుతున్నామని, తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ఈ పథకాలతో మూడు పంటలకు నీరందించే అవకాశం ఉంటుందన్నారు. పులిచింతల జలాశయం తీర గ్రామాల రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని జనవరి నెలాఖరులోగా ప్రారంభిస్తామని ప్రకటించారు. సవరించిన ఆయకట్టు పరిధిలోని 10వేల ఎకరాలకు 2027 జనవరి 31 నాటికి కృష్ణా జలాలు అందించాలని అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. ఈ పనులను పలుమార్లు పరిశీలించినట్లు తెలిపారు. ప్రతిసారి గడువు మారుతోందని ఇకపై అలా జరగకూడదన్నారు. జనవరి నెలాఖరులోగా మొత్తం 10వేల ఎకరాలకు నీరు చేరాలని తేల్చి చెప్పారు. గడువు తప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పథకంతో జాన్‌పహాడ్, పాలకవీడు, కోమటికుంట, ఓతులపాలెం, ఎల్లాపురం, సజాపురం, హనుమాయగూడెం, నాగిరెడ్డిగూడెం, గుడుగుంట్ల పాలెం, గుండ్లపహాడ్, చెరువుతండా, అలింగాపురం, గుండెబోయినగూడెం, రాఘవాపురం, మిగడంపాడు తండా గ్రామాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు. డిసెంబర్ నెలాఖరులోగా పంప్‌హౌస్, జనవరి నెలాఖరులోగా విద్యుత్ ఉపకేంద్రం పనులు పూర్తిచేసి, నిర్ణీత గడువులో పథకాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకటరెడ్డి, మాజీ ఎంపిపి భూక్యా గోపాల్, మాజీ జడ్‌పిటిసి మాలోత్ మోతీలాల్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పనుల పరిశీలన

ప్రజాపక్షం/కోదాడ రూరల్ : మండలంలోని రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై నిర్మిస్తున్న రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ పనులను బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ముందుగా కాలువ పనులను, అండర్ గ్రౌండ్ మోటర్‌లను, సబ్ స్టేషన్ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ రెడ్ల కుంట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రూ.47.64 కోట్లతో 4,460 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లకు నీరు అందించడం జరుగుతుందని, ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కోదాడ మండలంలోని ద్వారకుంట గ్రామంలో 66 ఎకరాలకు, నల్లబండగూడెం గ్రామంలో 1400 ఎకరాలకు, కాపుగల్లు గ్రామంలో 1608 ఎకరాలకు, కూచిపూడి గ్రామంలో 400 ఎకరాలకు, రెడ్లకుంట గ్రామంలో 576 ఎకరాలకు, చిమిరాల గ్రామంలో 410 ఎకరాలకు 430 కెడబ్లు విటి సామర్థ్యం గల 4 మోటార్ల సహాయంతో సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. మొత్తం గ్రామాల్లో కలిపి కులాల వారిగా లబ్ధిదారులు ఓసి 290, బిసి 720, ఎస్‌సి 446, ఎస్‌టి 30 కుటుంబాలు ఉన్నాయని మొత్తం 1,486 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు.



కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, రోగుల సంరక్షణ, భద్రతా విభాగాల కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య, రోగుల సంరక్షణ, భద్రతా సిబ్బందికి చట్టప్రకారం వేతనాలు పెంచడంతో పాటు పండుగ సెలవులు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు అమలు చేయాలని కోరారు. ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి పారిశుద్ధ్య, భద్రతా, రోగుల సంరక్షణ కార్మికుల వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ, ఈసారి 4 సంవత్సరాలు దాటినా పెంపుదల జరగలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విధుల్లో చేరిన కార్మికులకు కనీసం రూ.16 వేలు చెల్లించాలని జీవో నంబర్ 6 జారీ చేసిందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 నుంచి 20 సంవత్సరాల సర్వీసు కలిగిన కార్మికులకు వారి అనుభవం, సేవలను పరిగణనలోకి తీసుకుని న్యాయబద్ధంగా నెలకు రూ.26 వేలు వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు ఎస్కే షమీం, రామలింగం, బిక్షం, స్వామి, బేగం పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పి కెనాల్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ నిందితులపై కేసులు

తప్పుడు అండర్ టేకింగ్‌తో ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్

రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చిన ఆరుగురిపై కేసు నమోదు : డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పి) కెనాల్ నిర్మాణ కోసం గతంలో ప్రభుత్వం సేకరించిన భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన వ్యవహారంలో హుజూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం, అండర్ సమర్పించి ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురిపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఇదే విషయమై బుధవారం హుజూర్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈకేసులో సంబంధిత వ్యక్తులపై రిమాండ్ ప్రక్రియ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేళ్లచెరువు గ్రామానికి చెందిన బోనగిరి సామ్రాజ్యమ్మ తండ్రి బోనగిరి వెంకటనర్సయ్యకు గతంలో హుజూర్‌నగర్, మేళ్లచెరువు తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉండేవి. 1971లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 458లో ఉన్న భూమిని అప్పటి ప్రభుత్వ భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి పరిహారం చెల్లించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అయితే సదరు భూమి రెవెన్యూ రికార్డుల్లో ఎన్ఎస్‌పి కాలువ భూమిగా నమోదు కాకపోవడాన్ని ఆసరాగా చేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్‌కు పథకం రూపొందించినట్లు ఆరోపణలున్నాయి. సామ్రాజ్యమ్మకు చెందిన భూముల వివరాలను పరిశీలించే క్రమంలో పసుపులేటి రామారావు కీలకపాత్ర పోషించినట్లు పోలీసులు పేర్కొన్నారు. హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 458/ఎ3/3లో ఉన్న 9 ఎకరాల 16 గుంటల భూమి ఆమె పేరున పట్టా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సదరు భూమి గతంలోనే ఎన్ఎస్‌పి కాలువ నిర్మాణం కోసం ప్రభుత్వం సేకరించినప్పటికీ రికార్డుల్లో పేరు కొనసాగుతుండటంతో దానిని విక్రయించేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేతం వెంకటరెడ్డి, శేషం రవి తదితరులు రంగంలోకి వచ్చి భూమి కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులకు తెలిపారు. భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అగ్రిమెంట్‌ను చూపించి హైదరాబాద్‌కు చెందిన ఒక ఫైనాన్స్ వద్ద ఫైనాన్స్ పొందేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. తొలుత రూ.1.50 కోట్ల ఫైనాన్స్ కోరగా, రూ.1.30 కోట్లు ఇచ్చేందుకు ఆయన అంగీకరించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొన్నారు. 2026 ఆగస్టు 6న హుజూర్‌నగర్ తహసిల్దార్ కార్యాలయంలో సంబంధిత వ్యక్తులు హాజరై రెవెన్యూ అధికారులకు తప్పుడు అండర్‌టేకింగ్ సమర్పించి కనమూరి కళ్యాణ్‌కుమార్ పేరున భూమిని రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంలో రూ.1,07,95,089 విలువైన చెక్కును సామ్రాజ్యమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు అందులో నుంచి రామారావు కుమార్తె లావణ్య ఖాతాకు ఐదు లక్షలు, మరో వ్యక్తికి సంబంధించిన ఖాతాకు 6 లక్షలు బదిలీ చేసినట్లు పోలీసులు వివరించారు. సామ్రాజమ్మకు మాత్రం లక్ష నగదు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 255/2026 కింద బిఎన్ఎస్ సెక్షన్ 61(2), 318(4) 338, 336(3) 217 ఆర్/డబ్ల్యూ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో బోనగిరి సామ్రాజమ్మ, పసుపులేటి రామారావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేతం వెంకటరెడ్డి, శేషం రవి పేర్లు నిందితుల జాబితాలో ఉన్నాయి. సామ్రాజ్యమ్మకు నోటీస్ జారీ చేసినట్లు కేసు వివరాల్లో పేర్కొన్నారు. మిగిలిన నిందితులపై తదుపరి పోలీసు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ చరమంద రాజు, ఎస్ఐ లు నరేష్, హనుమానాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీదేవిపై జరిగిన దాడి ఘటనపై జాతీయ మహిళా కమిషన్ విచారణ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: పట్టణంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి తల్లి నాగం శ్రీదేవిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్ నిజనిర్ధారణ కమిటీ నల్గొండలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టింది.ఈ విచారణలో భాగంగా జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు శ్రీమతి నివేదితా సుబ్రమణియన్,సీనియర్ కోఆర్డినేటర్ శ్రీమతి కంచన్ ఖట్టర్ పట్టణంలోని నాగం శ్రీదేవి నివాసాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఘటన జరిగిన ప్రదేశాన్ని స్వయంగా పరిశీలించి,దాడి జరిగిన తీరును, ఇంటి వద్ద ధ్వంసమైన వస్తువులను, జరిగిన ఆస్తి నష్టాన్ని పరిశీలించారు.అనంతరం బాధితురాలు నాగం శ్రీదేవిని,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సభ్యుల నుంచి ఘటనకు సంబంధించిన వివరాలు, అందుబాటులో ఉన్న ఆధారాలను సేకరించి విచారణ నిర్వహించారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి,వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కమిటీకి విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలోబిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం అందించడమే లక్ష్యం



ప్రజాపక్షం/తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజలకు విద్యా, వైద్యం ఉచితంగా అందించడమే ప్రజాపాలన లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం 100 పడకల ఆసుపత్రిని పరిశీలించి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. డిసెంబర్ 31 నాటికి ఎట్టి పరిస్థితుల్లో కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో 100 పడకల ఆసుపత్రిని అప్పగించాలని ఆదేశించారు. ఆపరేషన్ కోసం సుమారు రూ.1కోటి 20లక్షలతో ప్రత్యేక వైద్య పరికరాలు రానున్న రోజుల్లో రానున్నట్లు తెలిపారు. ఆసుపత్రి నందు ప్రత్యేకంగా ఎంఆర్ఐ స్కాన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రితో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అనంతరం వెలుగుపల్లి రుద్రమ్మ చెరువు దగ్గర రైతుల ప్రయోజనాల కోసం ఏర్పాటు చేస్తున్న గోదాముల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిసిహెచ్ఎస్ విద్యాసాగర్ రావు, స్థానిక సర్పంచ్ మల్లెపాక సాయిబాబా, పిఏసిహెచ్ చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకన్న పాల్గొన్నారు.

పురాతన కట్టడాలను సంరక్షించుకుందాం



నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

ప్రజాపక్షం/నల్లగొండ : పురాతన,చారిత్రాత్మక కట్టడాలు,దేవాలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్లగొండ సమీపంలోని పానగల్‌లో ఉన్న ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన వారసత్వ నడ (హెరిటేజ్ వాక్)ను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, రాష్ట్రం నలుమూలల నుండి ఈ దేవాలయాన్ని సందర్శించేందుకు ప్రజలు వస్తుంటారని,ముఖ్యంగా 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో ఈ దేవాలయం ఏర్పాటైనట్లు చరిత్ర ద్వారా తెలుస్తున్నదని చెప్పారు.హెరిటేజ్ వాక్ ద్వారా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం గురించి మరింత తెలుసుకునే అవకాశం ఉందన్నారు.ఇలాంటి పురాతన కట్టడాలు,చారిత్రక నిర్మాణాలను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగానే రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవల ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి బడ్జెట్‌ను కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఇంటాక్ సంస్థ ద్వారా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద హెరిటేజ్ వాక్ ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఇంటాక్ న్యూఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ పురాతన కట్టడాలను పునరుద్ధరించడం, సంరక్షించడమే ఇంటాక్ సంస్థ ఉద్దేశమని తెలిపారు. నల్లగొండ ఇంటాక్ చాప్టర్‌ను ప్రారంభించే నిమిత్తం నల్లగొండకు వచ్చి ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించడం ఎంతో సంతోషమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు,వేద్ కుమార్,సజ్జాద్ సాహిది,ధనుంజయ్,రమేష్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు ధర్నా



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: ధాన్యం కొనుగోళ్ళు వెంటనే ప్రారంభించాలని కోరుతూ రైతులు బుధవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో ధర్నా రాస్తారోకోతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి రాకపోకలను స్థంభింపచేశారు. మండల వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి రైతుల కళ్ళల్లో కన్నీటిని తుడవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో ఆర్భాటంగా కేంద్రాలను ప్రారంభించినప్పటికి నేటికి ధాన్యం తూకం వేయకుండా రైతు కష్టాన్ని ఎండపాలు చేస్తున్నారని అధికారులు ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వెలిబుచ్చారు. వరిధాన్యం వెంటనే కొనుగోళ్ల ప్రారంభిస్తామని హామి ఇస్తేనే ధర్నా విరమిస్తామని భీష్మించి కూర్చోవటంతో ఎంఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకొని ఉన్నతాధికారులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి ,దుబ్బాక జగన్ మంచాల మధు, రాములు, సుధాకర్ రెడ్డి యాదిరెడ్డి, జంగయ్య, భిక్షపతి, మల్లారెడ్డి ,కృష్ణారెడ్డి, శేఖర్ ,రాంరెడ్డి రైతులు పాల్గొన్నారు.

కాలనీ మధ్యలో సెల్‌టవర్ తొలగించాలని ధర్నా



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన సెల్‌ఫోన్ టవర్‌ను వెంటనే తొలగించాలని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 8వ వార్డు కుసుమవారిగూడెం కాలనీవాసులు బుధవారం ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ పోతురాజు ఇందుశ్రీ అనిల్ మాట్లాడుతూ గతంలో వార్డు ప్రజలు పలుమార్లు కలెక్టర్, మున్సిపల్, పోలీస్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటు చేయవద్దంటూ తాము ధర్నా చేస్తే మాత్రం పావుగంటలోనే పోలీసులు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చిన్నపిల్లలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఉన్నారని సెల్‌టవర్ నుంచి వెలువడే రేడియేషన్ ప్రభావంపై ఆందోళన చెందుతున్నారని వివరించారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని నివాస ప్రాంతంలో టవర్ నిర్మాణం జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలనీవాసుల ఆందోళనను అధికారులు పరిగణలోనికి తీసుకొని సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ ధర్నాలో రవీందర్, రమాదేవి, యూసుఫ్, సుల్తానా, వసీమా, నజీర్, రాములు, రవీందర్ రెడ్డి, వెంకన్న, గోపాల్ రెడ్డి, నాగేందర్ రెడ్డి పాల్గొన్నారు.

హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా 'మాయలేడి'. ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎవరికీ చెప్పొద్దు.

రీల్



రోషన్ మేక కొత్త చిత్రం ప్రారంభం

మోహన కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో రూపొందనున్న పాన్ ఇండియా చిత్రంలో రోషన్ మేక సూపర్ హీరో పాత్రలో నటించనున్నారు. 18 నెలల ప్రీప్రొడక్షన్ పనుల అనంతరం షూటింగ్ ప్రారంభించారు. బుధవారం పూజా కార్యక్రమంతో ఈ చిత్రం ప్రారంభమైంది; ముప్పా వెంకయ్య చౌదరి కెమెరాను స్విచ్ ఆన్ చేయగా, శ్రీకాంత్ క్లాప్ కొట్టారు. అశోక క్రియేషన్స్ బ్యానర్‌పై అశోక్ వర్ధన్ ముప్పా సునీల్ బలుసు భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం, ఆ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ నుంచి వస్తున్న మూడవ ప్రధాన ప్రాజెక్ట్. బాలీవుడ్ నటి రేఖా పాండే ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం కానుండగా, ప్రముఖ నటుడు వినయ్ రాయ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్‌లో ప్రారంభం కానుంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పి.జి. విందా , ప్రసిద్ధ సంగీత దర్శకుడు గౌర హరి పని చేస్తున్నారు. లీ విట్టేకర్ , రామకృష్ణల పర్యవేక్షణలో రూపొందుతున్న అత్యంత ఉత్కంఠభరితమైన యాక్షన్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

'ఇంకా ఏం అనుకోలేదు' నుంచి 'మేఘాలు సంద్రంలో' సాంగ్



వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, ఇటివి విన్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఇంకా ఏం అనుకోలేదు!'. వంశీ నందిపాటి నిర్మాతగా కన్ను సమీర్, వెన్నపూస శ్రీకర్ రెడ్డి సహ నిర్మాతలుగా ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి పెమ్మసాని సంయుక్తంగా తెరకెక్కించిన ఈ మూవీలో అక్షయ్ లగుసాని, కేయూరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో , జయకృష్ణ, రావు రమేష్, హర్షవర్ధన్, అనిత చౌదరి, సుబ్బరాజు తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని డిసెంబర్ 11న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో 'మేఘాలు సంద్రంలో' అంటూ సాగే సాంగ్‌ను లాంచ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వంశీ నందిపాటి మాట్లాడుతూ ''ఇంకా ఏం అనుకోలేదు!' చిత్రం అందరికీ రిలేట్ అయ్యేలా, కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఈటీవి విన్‌తో కలిసి ఈ మూవీని డిసెంబర్ 11న ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం అని అన్నారు. ఇటివి విన్ కంటెంట్ హెడ్ భరణ్ మాట్లాడుతూ ''ఇంకా ఏం అనుకోలేదు!' మాకెంతో ప్రత్యేకమైన సినిమా. ఈ చిత్రంతో ఒకేసారి ఇద్దరు దర్శకుల్ని పరిచయం చేయబోతోన్నాం.డిసెంబర్ 11న మా సినిమాని రిలీజ్ చేస్తున్నామ'ని అన్నారు.ఇటివి విన్ వైస్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ మాట్లాడుతూ 'మాకు సింజిత్ ఎప్పుడూ మంచి పాటల్నే ఇస్తుంటాడు. 'ఇంకా ఏం అనుకోలేదు!' సినిమాకి కూడా సింజిత్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. వంశీ నందిపాటి ని నిర్మాతగా పరిచయం చేస్తుండటం ఆనందంగా ఉంది. ఈ మూవీతో ఇద్దరు దర్శకుల్ని పరిచయం చేయబోతోన్నామ'ని అన్నారు. దర్శకుడు ప్రణయ్ వల్లూరిపల్లి, దర్శకుడు గిరి పెమ్మసాని, అక్షయ్ లగుసాని, మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్, కో ప్రొడ్యూసర్ సమీర్. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రఘు పాల్గొన్నారు.

#సిద్దు19



సిద్దు జొన్నలగడ్డ నటించనున్న కొత్త చిత్రం '#సిద్దు19#' బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. మోహన్ బి దర్శకత్వంలో, సుకుమార్ ఇతర నిర్మాతలు నిర్మిస్తున్న ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ చిత్రంలో నయన్ సారిక కథానాయికగా నటిస్తోంది. దీనికి ఇంకా పేరు ఖరారు కాలేదు, తాత్కాలికంగా #సిద్దు 10 అని పిలుస్తున్నారు — బుధవారం ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంలోని కీలక సభ్యులు హాజరయ్యారుస్టార్ అల్లు అర్జున్ తండ్రి, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఈ చిత్రానికి క్లాప్ కొట్టి, సినిమా ప్రారంభాన్ని అధికారికంగా లాంచ్ నంగా మొదలు పెట్టారు. ఈ నెల చివరలో ఒక పాట చిత్రీకరణతో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని చిత్ర బృందం వెల్లడించింది.మోహన్ బి దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రంపై మంచి ఆసక్తి నెలకొంది, ఎందుకంటే ప్రముఖ దర్శకుడు సుకుమార్ దీనికి నిర్మాతలలో ఒకరిగా వ్యవహరిస్తున్నారు. ఒకఈ చిత్రానికి మూడుసార్లు జాతీయ అవార్డు గెలుచుకున్న సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.ఈ చిత్రం ప్రారంభోత్సవానికి ముందు, దర్శకుడు మోహన్ బి మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకున్నారన్న విషయం తెలిసిందే. ప్రతి కథకుడిలోనూ ఒక కల ఉంటుంది. నేడు, ఆ కల వెండితెర వైపు తన మొదటి అడుగు వేస్తోంది. ఇది ఒక కొత్త ఆరంభం, ఒక కొత్త ప్రయాణం, కల నిజమవుతున్న క్షణం. కొత్త ప్రారంభాలకు స్వాగతం! #సిద్ధు10. ప్రేమలోని మాధుర్యాన్ని చాటిచెప్పే ఒక అద్భుతమైన కలయిక. @sukumar writingsఅండ్@bvworksoffl సంస్థల నుండి వస్తున్న రెండో చిత్రం — 'స్టార్‌బాయ్' #సిద్దు10.

'కొక్కొరొకో' షూటింగ్ పూర్తి



దర్శకుడు రమేష్ వర్మ.. కొత్త దర్శకులకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఆర్.వి ఫిల్మ్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ బ్యానర్‌పై తొలి సినిమాగా 'కొక్కొరొకో' రూపొందుతోంది. ఐదు విభిన్న పాత్రలతో తెరకెక్కుతోన్న ఈ ఆంథాలజీ ద్వారా శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రీసెంట్‌గానే 'కొక్కొరొకో' సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మేకర్స్ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు.శీను కోసం పార్వతి ఎదురుచూస్తుండగా. నటన, శీను, పార్వతి మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అందమైన విజువల్స్, మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో ఈ చిన్న గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. శ్రీనివాస్ వసంతాల కథ చెప్పే విధానంపై నమ్మకంతోనే దర్శకుడు రమేష్ వర్మ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. వినూత్నమైన ఆలోచనలతో సినిమాలను తెరకెక్కిస్తూ శ్రీనివాస్.. 'కొక్కొరొకో'తో విజువల్‌గా కొత్త అనుభూతిని అందించడంతో పాటు, భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తారని మేకర్స్ భావిస్తున్నారు.సీనియర్ రచయిత జి. సత్యమూర్తి తనయుడైన ఆయన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌కు సోదరుడు. 'కొక్కొరొకో' సినిమాకు జివి సాగర్ మాటలు అందిస్తున్నారు.డా.జయంతి లాల్ సమర్పణలో పెన్ స్టూడియోస్, ఆర్.వి. స్టూడియోస్ బ్యానర్స్‌పై ఈ చిత్రాన్ని రేఖా వర్మ, కూరపాటి శిరీష నిర్మిస్తుండగా.. నీలాద్రి ప్రొడక్షన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రమేష్ వర్మ ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లేను అందించారు. ఐదు విభిన్న కథలతో కూడిన ఆసక్తికరమైన ఆంథాలజీగా, కొత్త దర్శకుడి ఆలోచనలతో 'కొక్కొరొకో' తెరకెక్కుతోంది.



ఘనంగా 'మాయలేడి' ప్రీ రిలీజ్

హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా 'మాయలేడి'. ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు 'మాయలేడి'తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'మాయలేడి' సినిమా ఈ నెల 13న వరల్డ్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. చాలా సినిమాలు ఆ తేదీన వస్తున్నాయి. నాపై అభిమానంతో మా డిస్ట్రిబ్యూటర్స్ ఈ డేట్ ఎందుకు అని కూడా చెప్పారు. స్ట్రాంగ్ కంటెంట్ ఉంటే ఎన్ని సినిమాల మధ్యనైనా మా సినిమా ఆదరణ పొందుతుందని మేము నమ్మాం. ఆ కంటెంట్ నే నమ్ముకుని ఈ నెల 13న రిలీజ్ చేస్తున్నాం. ఈ సినిమా సక్సెస్ అయితే మరికొందరు కొత్త వాళ్లతో నేను సినిమాలు చేయగలుగుతాను. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో థియేటర్స్‌కు వస్తే హ్యాపీగా బయటకు వెళ్తారు అని అన్నారు. రెస్పాన్స్‌తో నాకు మీరు వెల్ కమ్ చెప్పినట్లు భావిస్తున్నా. ఈ నెల 13న మాయలేడి సినిమాను థియేటర్స్‌లో చూడండి. బాగా ఎంటర్‌టైన్ అవుతారు. అన్నారు. కో ప్రొడ్యూసర్ విజిత్, రైటర్ బిందు, ఆర్ట్ డైరెక్టర్ భార్గవ్, నటి మధురిమ, నటి లావణ్య, ఫైట్ మాస్టర్ అంజి, ఎడిటర్ రవితేజ గిరిజాల, డిఒపి రాధాకృష్ణన్ డైరెక్టర్ ప్రశంకర్, డైరెక్టర్ మహేశ్ బాబు .పి. , డైరెక్టర్ శశికిరణ్ తిక్క పాల్గొన్నారు.

అడ్డంకులు దాటుకుని ప్రేక్షకుల ముందుకు....

'గోట్' హీరో
సుడిగాలి సుధీర్



ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో ఈ చిత్రం నవంబరు 12న థియేట్రికల్ విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు హీరో మంచు మనోజ్, నిర్మాత నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సందర్భంగా నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ '' సుడిగాలి సుధీర్‌కు నేను అభిమానిని.. హీరో సుడిగాలి సుధీర్ మాట్లాడుతూ '' చాలా ఒడిదుడుకులు. అడ్డంకులు దాటుకుని సినిమా ప్రేక్షకుల ముం దుకు రాబోతుంది. ఈ సినిమా చూడండి.తప్పకుండా అందరూ ఈ సినిమాను థియేటర్‌లో ఎంజాయ్ చేయాలి' అని కోరుకుంటున్నాను అన్నారు. హీరోయిన్ దివ్యభారతి మాట్లాడుతూ ఈ సినిమాలో సొసైటీకి మంచి మేసే జ్ ఉంది. ఈ సినిమా ఈ రోజు ఇలా విడుద ల అవుతుంది అంటే నిర్మాత చంద్రశేఖరే కారణం. ఈ సినిమా తప్పకుండా బ్లాక్ బస్టర్ అవ్వాలని కోరుకుంటున్నాను. మంచు మనోజ్ మాట్లాడుతూ గోట్ వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఇండస్ట్రీలో హీరోగా నిలదొక్కుకోవాలంటే అంతా ఆషామాషీ కాదు. ఈ సినిమా సుధీర్‌తో పాటు అందరికీ మంచి విజయం అందించాలి కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు వేదవ్యాస్, నిర్మాత చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నాలుగు ప్రాజెక్టుల మూసివేతకు టిజిపిసిబి సిఫార్సు

మరో 18 నిర్మాణ సంస్థల్లో ఉల్లంఘనలు..
పర్యావరణ పరిహారం, బ్యాంకు గ్యారెంటీల జప్తునకు చర్యలు
లోపాల సవరణకు 10 రోజుల గడువు

ప్రజాపక్షం/ హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నిర్మాణ ప్రాజెక్టుల నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళితో వాయు కాలుష్యం పెరుగుతుండటంపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) కొరడా ఝుళిపించింది. నిబంధనలు పాటించని నిర్మాణ సంస్థలపై కఠిన చర్యలకు సిద్ధమైంది. తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలపై 18 నిర్మాణ ప్రాజెక్టులను సమీక్షించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ.. నాలుగు ప్రాజెక్టుల మూసివేతకు, మరో ప్రాజెక్టు నిర్మాణ పనుల నిలిపివేతకు సిఫార్సు చేసింది. లోపాలను సరిదిద్దుకునేందుకు 10 రోజుల గడువు ఇవ్వడంతో పాటు, తీవ్రమైన ఉల్లంఘనలకు పర్యావరణ పరిహారం, ఇతర ఉల్లంఘనలకు బ్యాంకు గ్యారెంటీల జప్తునకు సిఫార్సు చేసింది. నిర్మాణ ప్రాజెక్టుల వద్ద కనీసం 10 మీటర్ల ఎత్తులో గాలిని అడ్డుకునే గోడలు ఏర్పాటు చేయకపోవడం, రహదారులపై దుమ్ము పేరుకుపోయినా నీటిని చల్లకపోవడం, నిర్మాణ వ్యర్థాలను బహిరంగంగా నిల్వ చేయడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. స్ప్రింక్లర్ వ్యవస్థల నిర్వహణలోనూ నిర్లక్ష్యం ఉన్నట్లు తేల్చారు. వ్యర్థాల తరలింపునకు సరైన చ్యూట్స్ ఏర్పాటు చేయకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా మెటల్ డ్రమ్ చ్యూట్స్ వినియోగించడం వల్ల శబ్ద కాలుష్యం కూడా పెరుగుతున్నట్లు గుర్తించారు. కొన్ని ప్రాజెక్టుల వద్ద శబ్ద స్థాయిలు 65 డెసిబెల్స్ పరిమితిని మించుతున్నట్లు వెల్లడించారు.

సనత్‌నగర్‌లోని టిజిపిసిబి ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన సమీక్షలో 18 ప్రాజెక్టుల పనితీరును పరిశీలించారు. స్థాపనా అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్న నాలుగు ప్రాజెక్టులను మూసివేయాలని, మరో ప్రాజెక్టులో పనులు నిలిపివేయాలని కమిటీ సిఫార్సు చేసింది. అలాగే నిర్వహణ అనుమతి లేకుండా, కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకుండా పని చేస్తున్న ఒక నిర్మాణ ప్రాజెక్టుకు అనుబంధమైన రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసి) ప్లాంట్‌ను మూసివేయాలని సూచించింది. ఈ సిఫార్సుల మేరకు సంబంధిత ప్రాజెక్టులపై చర్యలు తీసుకోనున్నట్లు బోర్డు వెల్లడించింది.

మూసీకి పునరుజ్జీవం కల్పించాల్సిందే...

అభివృద్ధికి రాజకీయాలకు
అతీతంగా సహకరించాలి:
సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : మూసీకి పునరుజ్జీవం కల్పించాల్సిందేనని, ఈ ప్రక్షాళనలో ఏ ఒక్కరికి నష్టం జరగకుండ ఆదుకునే బాధ్యత ఈ ప్రభుత్వానిది ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మానవ తప్పిందం, నిర్లక్ష్యం, ప్రభుత్వాల వైఫల్యం అన్ని కలగలిపే మూసీ మురికి అని అన్నారు. బేషజాలాలను పక్కన పెట్టి మూసీ ప్రక్షాళనకు ప్రజా ప్రతినిధులందరూ సహకరించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరించిన మాదాపూర్ లోని తమ్మిడి కుంట చెరువును మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ నగర భవిష్యత్తును, భావితరాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కొన్ని ఇబ్బందులు ఎదురైనా తమ్మిడికుంట చెరువును అభివృద్ధి చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఒకప్పుడు 14 ఎకరాలకు కుంచించుకుపోయిన చెరువును 30 ఎకరాలకు విస్తరించామని వెల్లడించారు. చెరువు విస్తరణకు అక్కినేని నాగార్జున ముందుకొచ్చి రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అందించడం అభినందనీయమని, ఆయన సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలోనూ హీరోగా నిలిచారని ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఒకప్పుడు 1,372 చెరువులు ఉండేవని, వివిధ కారణాలతో వాటిలో సగం చెరువులు కనుమరుగయ్యాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల ఆక్రమణల కారణంగా వర్షాలు కురిసినప్పుడు రహదారులపై నీరు నిలవడం, కాలనీలు జలమయం కావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని చెరువులను పునరుద్ధరించి, ఆక్రమణల నుంచి వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.హైదరాబాద్‌ను చెరువులు, కొండల నగరంగా నిలబెట్టడంతోపాటు విశ్వనగరంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో మూసీ వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు నిజాం ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నిర్మించారని గుర్తుచేశారు. వికారాబాద్ నుంచి ప్రారంభమయ్యే ముచుకుందా నది, మూసా, ఈసా నదులు కలిసే ప్రాంతంలో మూసీగా మారుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా నదీ నాగరికతలు అభివృద్ధి చెందాయని, వందేళ్ల క్రితమే మూసీ నది ప్రాధాన్యతను గుర్తించిన పాలకులు దాని పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం మూసీ తీవ్ర కాలుష్యానికి గురైందని, దాని ప్రభావంతో నల్గొండ జిల్లా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ప్రజలు మూల్యం చెల్లించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే మూసీని ప్రక్షాళన చేసి పునరుజ్జీవం కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని సిఎం స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో కాకుండా నదికి తిరిగి జీవం పోయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. త్వరలోనే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు తొలి దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. నగర ప్రజల జీవన విధానం మూసీ నదితో ముడిపడి ఉందని, నదుల పేర్లను ఆడబిడ్డలకు పెట్టుకునే సంస్కృతి మనదని గుర్తుచేశారు.చెరువుల ఆధారంగా స్థానిక ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా లేక్ ఎకానమీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. చెరువు ఆవరణలో జమ్మి చెట్టును నాటాలని రంగనాథ్‌కు సూచించారు. అలా చేస్తే దసరా వేడుకలకు చెరువులు వేదికలుగా మారుతాయని, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కూడా అవి దోహదపడతాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలోప్రముఖ సినీ నటులు అక్కినేని నాగార్జున ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ,చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కుందురు రఘువీర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, కె.ఆర్ సురేష్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ , ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్, మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి నవీన్ యాదవ్ అనిల్ కుమార్ రెడ్డి , తోట లక్ష్మీ కాంతరావు ,శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



పవన్ రైస్ మిల్లుపై ఆకస్మిక దాడులు

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : పవన్ రైస్ మిల్లుపై జిల్లా సివిల్ సప్లై అధికారు లు ఆకస్మిక దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వలో ఉన్నా బియ్యా న్ని పరిశీలించారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలో శేరిగూ డ గ్రామ సమీపంలో పవన్ రైస్ మిల్లుపై రంగారెడి జిల్లా సివిల్ సప్లై అధికారిణి వనజాత రెడ్డి ఆధ్వర్యంలో పక్కా సమచారంతో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలో పెం డింగ్‌లో ఉన్న సిఎంఆర్ వరి ధాన్యం బస్తాలు ప్రభుత్వానికి పంపించాల్సిన బియ్యాన్ని ప్రైవేట్‌కు సరాఫరా చేసి నిధులన్ని సోమ్ము చేసుకొని ప్రభుత్వా ఆదాయనికి గండి కొడుతున్నారని అధికారులు ఆరోపించారు. అక్రమంగా బి య్యాన్ని నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు విక్రయిస్తున్న రైస్ మిల్లును సిజ్ చేసి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సివల్ సప్లై అధికారులు పాల్గోన్నారు.

ఉగ్రదాడి

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధారించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ ఫుటేజీలో మూసి ఉన్న దుకాణాలు కనిపిస్తున్నాయి. తుపాకీ కాల్పుల మోత, కొందరు కేకలు వేస్తున్న శబ్దాలు కూడా వినిపిస్తున్నాయి. సిఆర్‌పిఎఫ్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి జరిగిన కొద్దిసేపటికే అదనపు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంబులెన్స్ సైరన్లు మోగుతుండగా, స్థానికులు ఇళ్లనుంచి బయటకురావద్దని లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రకటనలు చేశారు. అదనపు బలగాలరాగా, సాయుధ వాహనాల్లో భద్రతా సిబ్బంది సంఘటనా స్థలం సమీపంలో కనిపించారు. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా కుల్గాంలోనే ఉన్నారు, కానీ దాడి జరిగిన ప్రదేశానికి సమీపంలో లేరు. ఈ ప్రాంతం పిర్ పంజాల్ పర్వత శ్రేణికి సమీపంలో ఉంది. ఈ పర్వత శ్రేణి కుల్గాంను జమ్ము డివిజన్‌లోని రాంబన్, రియాసి, రాజౌరి జిల్లాలతో కలుపుతుంది. ఈ ఏడాది ఆరంభంలో, జులై 31న కుల్గామ్‌లోని ఒక ఇటుక బట్టీపై జరిగిన ఉగ్రవాద దాడిలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఇద్దరు కూలీలు మరణించారు. అదే జులైలో, పొరుగున ఉన్న అనంతనాగ్ పట్టణంలో ఉగ్రవాదులు ఒక పోలీసును కూడా కాల్చి చంపారు.

జాతీయ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

ఇంటింటికీ చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం తదితర పది ప్రధాన అంశాల ఆధారంగా నిర్వహించిన మూల్యాంకనం లో జిహెచ్ఎంసి పనితీరును పరిగణనలోకి తీసుకున్నారు.

పరిశుభ్రతలో కొనసాగుతున్న ప్రస్థానం..

హైదరాబాద్ 2017లో ఓడిఎఫ్, 2019లో ఓడిఎఫ్++ హోదాలను సాధించింది. 2021లో తెలంగాణలోనే తొలిసారిగా వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ పొందిన స్థానిక సంస్థగా గుర్తింపు పొందింది. 2023, 2024లోనూ ఈ హోదాను కొనసాగించింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 10 లక్షలకు పైగా జనాభా కలిగిన నగరాల విభాగంలో ఆరో ర్యాంకు సాధించింది. 2023లో 5 స్టార్, 2024లో 7 స్టార్ గార్బేజ్ ఫ్రీ సిటీ గుర్తింపు పొందింది.

10,500 మార్కులతో మూల్యాంకనం..

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025 26లో మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. చెత్త వేరు చేయడం, సేకరణ, రవాణా, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య సదుపాయాలు, మురుగునీటి నిర్వహణ, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, పౌరుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. అలాగే స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా జిహెచ్ఎంసి మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు మెంటర్‌గా వ్యవహరిస్తూ పారిశుద్ధ్య ప్రమాణాల మెరుగుదలకు శిక్షణ, సామర్థ్య పెంపు కార్యక్రమాలను నిర్వహించింది. ఈ జాతీయ అవార్డు నగర ప్రజలు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల సమ ష్టి కృషికి గుర్తింపుగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–26లో తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) గుర్తింపు పొందడం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సిఎంఅధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాల్లో సాధించిన పురోగతికి ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంత్రి పొన్నం ప్రభాకర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సిఎం వారికి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా, నెట్‌జీరో సిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సిఎం తెలిపారు. ఈ పురస్కారం సాధించడంలో జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సమష్టి కృషి అభినందనీయమన్నారు. నగరంలో పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణహిత వసతులను మరింత విస్తరించేందుకు ఈ గుర్తింపు ప్రోత్సాహాన్నిస్తుందని సిఎం రేవంత్‌రెడ్డిపేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com